సామాజిక
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM ఒంగోలు fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 165 పేజీలు: 12 వెల: 6.50

## హర్మూజ్ టాక్స్ నిర్ణయంపై ట్రంప్ వెనక్కి
## కేతన్ అగర్వాల్ తల్లి ప్రధాని మోడికి లేఖ
9లో

## కాపు ఉద్యమ శిఖరం ముద్రగడ ఇక లేరు



### హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ కన్నుమూత
### నేడు కిర్లంపూడికి మాజీ మంత్రి పార్థివ దేహం
### ఎంపీ, నాలుగుసార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం
### టిడిపి, తర్వాత వైసిపిలో కీలక నేతగా రాణింపు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై14,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ఉద్యమ శకం ముగిసింది. ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం (73) ఇక లేరు. గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.ఆయన ఇకలేరన్న వార్త వెలువడడంతో రాష్ట్రంలో కాపుసామాజిక వర్గంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. గత నెల రోజులుగా ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్సపొందుతున్న ముద్రగడ పరిస్థితి విషమించడంతో మరణించినట్లు >>2

## తలసరి ఆదాయం 55 లక్షలకు పెంచుతాం

- 2047 నాటికి రాష్ట్ర జిఎస్‌డిపి రూ. 308 లక్షల కోట్లకు పెంచే ప్రణాళిక
- వచ్చే మార్చిలో పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం
- మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడిల సమావేశంలో సిఎం చంద్రబాబు



మంగళవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఒడిల సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 14, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో 2019-2024 మధ్య అయిదేళ్లపాటు వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయని సిఎం చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో ఆ ఐదేళ్లూ విధ్వంసం జరిగిందన్నారు. మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఒడిల సమావేశంలో సిఎం మాట్లాడుతూ... గడిచిన రెండేళ్లుగా సమష్టిగా పనిచేశామని.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు అర్థం చెప్పామన్నారు. ప్రభుత్వ ఆలోచనల్ని ప్రభుత్వ యంత్రాంగం సమర్ధంగా అమలు చేసిందని కొనియాడారు. ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగామని.. మరిన్ని రంగాల్లో మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రభుత్వ శాఖ ఎప్పటికప్పుడు తాము సాధించిన ఫలితాలను బేరీజు వేసుకోవాలని సిఎం సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహించటంతో పాటు జిఎస్డీపిని విశ్లేషించుకుంటున్నామని చెప్పారు. 2047 వికసిత్ భారత్ బాటలోనే స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన చేశామన్నారు. తలసరి ఆదాయం, జిఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 19 >>2

## బిజినెస్ రూల్స్‌లో మార్పులకు కమిటీ

ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సిఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై సిఎం సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఎపిఎస్‌ఆర్టీసీ, రవాణా, అగ్నిమాపక, వ్యవసాయశాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సిఎం సూచనలు జారీచేశారు. ప్రోయాక్టివ్ >>2

## స్వగ్రామాలకు బోటు ప్రమాద మృతదేహాలు



సోమవారం రాత్రి ఎయిర్‌పోర్టులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### సోమవారం రాత్రినుంచి ఎయిర్‌పోర్ట్‌లోనే మంత్రి కొండపల్లి
### బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన మంత్రి

**విజయవాడ, జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నం పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకుల భౌతికకాయాలు మంగళవారం వారి స్వస్థలాలకు చేరుకున్నాయి. ఉదయం 7.20 గంటలకు ముంబై మీదుగా హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం కార్గో విభాగానికి ఈ మృతదేహాలు చేరుకోగా.. అక్కడ నుంచి ఎపి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆంబులెన్స్‌లలో వారి స్వగ్రామాలకు తరలించారు. ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్ దక్షిణ భారతదేశానికి చెందిన పంపిణీదారులను ప్రోత్స హించే క్రమంలో వీరిని వియత్నాం పర్యటనకు తీసుకువెళ్లింది. శనివారం మధ్యాహ్నం వియత్నాంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన ఫ్యుకాక్ ద్వీపంలో 32 మంది భారతీయ పర్యాటకులతో వెళుతోన్న బోటు బలమైన గాలులు వీయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కడపకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మృతిచెందారు .మృతుల కుటుంబాలకు తక్షణమే సహాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రభుత్వం తరపున సిఎం చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎపి ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు ఇండియన్ ఎంబసీ, వియత్నాం ఎంబసీ అధికారులతో మాట్లాడుతూ ప్రమాదం నుంచి బయటపడిన వారిని ఇండియాకు >>2

## దాతల విరాళాల నిబంధనల్లో టిటిడి మార్పులు

### వేద పారాయణ పథకం కింద 791 మంది వేదపండితులు
### ఒంటిమిట్టలో రూ. 17.84 కోట్లతో 100 గదుల నిర్మాణం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ట్రస్ట్‌లు, పథాకలకు విరాళాలిచ్చే దాతలకు కల్పిస్తున్న నిబంధనల్లో పలుమార్పులు చేశారు. ఇదివరకు లక్షరూపాయలు ఇచ్చే దాతలు ఇకపై రెండులక్షల రూపాయలు విరాళాలిస్తే వారికి కల్పించే సదుపాయాలను వివరించారు. విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరీతి (యూనిఫార్మిటీ) తీసుకురావడానికి టిటిడికి చెందిన అన్ని ట్రస్టులు, పథకాలకు విరాళాలుఅందించే దాతలకు కల్పించే సదుపాయాల్లో పలు మార్పులు చేపట్టారు. ఈ కొత్త నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి నుండి అమలులోకి వచ్చాయి. ఇప్పటికే వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలందించిన దాతలకు ప్రస్తుతం అమలవుతున్న సదుపాయాలు యథావిధిగా కొనసాగుతాయి. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంజరిగింది. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో నిర్ణయించిన పలు అంశాలు, ఆమోదించిన విషయాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ నాయుడు



మంగళవారం జరిగిన సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి

మాట్లాడుతూ 6.31 కోట్ల రూపాయలతో తిరుమలలో ఎస్ఎస్‌డి టోకెన్లు కలిగిన భక్తులు వేచి ఉండేందుకు ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లు ఆమోదించారు. తిరుమలలో కుమారధార, పసుపుధార డ్యామ్‌లు మరింత పటిష్టంగా ఉండేందుకు డబుల్ లేన్ వంతెననిర్మాణానికి 2.77కోట్లుమంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. హరితశక్తి అభివృద్ధి చేయడంలో భాగంగా జిఎన్‌సి సమీ >>2

## తృతీయ భాష అసెస్‌మెంట్ తప్పనిసరి

### నిబంధనల్లో మార్పులు చేసిన సిబిఎస్‌ఇ

**విజయవాడ, జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** సిబిఎస్‌ఇ 9, 10 బోర్డు పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 కింద 9,10 తరగతుల విద్యార్థులకు మూడో భాషనుతప్పనిసరి క్వాలిఫైయింగ్ సబ్జెక్టుగా మార్చింది. 2027-28వ సంవత్సరం 10వ తరగతి బోర్డు పరీక్షల్లో మూడో భాష (థర్డ్ లాంగ్వేజ్) భాగం కాదని, అయితే ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం తప్పనిసరిగా ఉంటుందని స్పష్టం చేసింది. పదో తరగతి సర్టిఫికెట్ పొందాలంటే ఈ థర్డ్ లాంగ్వేజ్ ఇంటర్నల్ అసెస్ మెంట్ పరీక్ష పాస్ కావడం తప్పనిసరి అని తేల్చిచెప్పింది. విద్యార్థులు ఎంచుకునే మూడు భాషల్లో రెండు కచ్చితంగా భారతీయ భాషలు అయ్యుండాలని స్పష్టం చేసింది.జులై 10న జారీ చేసిన సిబిఎస్‌ఇ సర్క్యులర్ ప్రకారం, 2027- 28 విద్యా సంవత్సరం నుంచి 10 తరగతి విద్యార్థులు 'థర్డ్ లాంగ్వేజ్‌పై స్కూల్లో అంతర్గతంగా నిర్వహించే అసెస్‌మెంట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి. ఒక వేళ ఎవరైనా విద్యార్థి ఈ ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోతే, అతనికి టెన్త్ పాస్ సర్టిఫికెట్ ఇవ్వరు. అందుకే బోర్డు పరీక్షల తుది ఫలితాలు ప్రకటించడానికి ముందే, పాఠశాలలు రీఅసెస్మెంట్ నిర్వహించాల్సి ఉంటుందని సిబిఎస్‌ఇ తెలిపింది. ఒకవేళ దీనిలో కూడా ఉత్తీర్ణత సాధించకపోతే, టెన్త్ క్లాస్ పాస్ సర్టిఫికెట్ ఇస్తారా, ఇవ్వరా అనే విషయంపై సీబీఎస్ ఈ క్లారిటీ ఇవ్వలేదు. అలాగే విద్యార్థుల ఫలితాలను తాత్కాలికంగా నిలిపి ఉంచుతారా? అనేది కూడా చెప్పలేదు. మొత్తంగా చూసుకుంటే, బోర్డు పరీక్షల్లో థర్డ్ లాంగ్వేజ్ పై పరీక్ష పెట్టనప్పటికీ, అంతర్గత మూల్యాంకనంలో ఉత్తీర్ణత సాధించడం సిబిఎస్‌ఇ తప్పనిసరి చేసింది. సిబిఎస్‌ఇ సర్క్యులర్ ప్రకారం, 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి 'త్రిభాషా సూత్రం' అమలు చేస్తారు. విద్యార్థులు కనీసం రెండు భారతీయ భాషలను కచ్చితంగా నేర్చుకోవాలి. 7,8,9వ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌తో పాటు అదనంగా మరో విదేశీ భాషను ఎంచుకోవచ్చు. గతంలో విద్యార్థులు 8వ తరగతి తర్వాత మూడో భాషను వదిలేసేవారు. తాజా విద్యా విధానంలో దీనిని పూర్తిగా మార్చేశారు. 9, 10వ తరగతి విద్యార్థులు కూడా మూడో భాష చదవడం తప్పనిసరి చేశారు. అయితే 202627 బోర్డు పరీక్షలకు హాజరయ్యే 10వ తరగతి బ్యాచ్‌పై ఈ మార్పుల ప్రభావం ఉండదు.ఇక 9వ తరగతి విద్యార్థులు మూడో భాష అసెస్‌మెంట్‌లో ఫెయిల్ అయినప్పటికీ, వారిని 10వ తరగతికి ప్రమోట్ చేస్తారు. వారు టెన్త్ క్లాస్ చదువుతూనే, తమ 9వ తరగతి పెండింగ్ అసెస్‌మెంట్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది.

## మహిళా డాక్టర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

### ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలికి డా. పి విజయ ఎన్నిక



**గుంటూరు మెడికల్, జులై 14 ప్రభాతవార్త :** భారతదేశంలో పక్షవాత వైద్యరంగ అభివృద్ధికి విశేష కృషి చేసి వేలాది మంది రోగులకు ప్రాణ దాతగా నిలిచిన గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు, లలిత పి.వి.ఎస్ వైద్య విజ్ఞాన సంస్థ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి, అంకినీడు అధునాతన పక్షవాత చికిత్స కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి. విజయకు అత్యున్నత అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలి సభ్యురాలిగా ఆమె ఎన్నిక కావడం దేశ వైద్యరంగానికే గర్వకారణంగా నిలిచింది. ప్రపంచంలోని 95 దేశాలకు చెందిన 3,500 మంది సభ్యుల ఓట్లతో ఎన్నికైన 18 మంది పాలక మండలి సభ్యుల్లో >>2

## ఇండో-బ్రిటన్ వాణిజ్య ఒప్పందం నేటినుంచే అమలు

### కార్లు, మద్యం, వెండి దిగుమతులపై సుంకాల తగ్గింపు

**న్యూఢిల్లీ,జులై 14:** భారత్-బ్రిటన్‌ల మధ్య పలుమార్లు జరిగిన చర్చల అనంతరం గత ఏడాది జూలై 25న కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వస్తున్న ఆరో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) ఇదే. అంతకుముందు మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్, ఒమన్‌లతో ఇలాంటి ఒప్పందాలను భారత్ అమలు చేసింది. గత కొన్నేళ్లలో భారత్ కుదుర్చుకున్న అతిపెద్ద వాణిజ్య ఒప్పందాల్లో ఒకటైన సీఈటీఏ ద్వారా భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు యూకే మార్కెట్లో సుంకం లేకుండా ప్రవేశం లభించనుంది. దీంతో భారత పరిశ్రమలు, ఎగుమతిదారులు, వినియోగదారులకు గణనీయమైన ప్రయోజనాలు కలగనున్నాయి.

ఈ ఒప్పందం వల్ల, రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్, ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంసం, ఇతర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు వంటి శ్రమాధారిత రంగాల ఉత్పత్తులు ఇకపై యూకే మార్కెట్లో సున్నా సుంకంతో ప్రవేశించనున్నాయి. ప్రస్తుతం వీటిపై 4 నుంచి 16 శాతం వరకు దిగుమతి సుంకం అమలులో ఉంది. అదేవిధంగా ఆటోమొబైల్స్, మోటారు సైకిళ్లు, విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, మెటల్ ఉత్పత్తులు, సిరామిక్స్, గాజు, రాయి, సిమెంట్ ఉత్పత్తుల రంగాలకు కూడా ఈ ఒప్పందం ద్వారా కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. మరోవైపు యూకే నుంచి దిగుమతి అయ్యే సాల్మన్ చేపలు, గొర్రె మాంసం,యంత్రాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, చాక్లెట్లు, శీతల పానీయాలు, సౌందర్య సాధనాలు, సబ్బులు, సుగంధ ద్రవ్యాలు, షేవింగ్ క్రీములు, నెయిల్ పాలిష్ వంటి ఉత్పత్తులపై సుంకాలు తగ్గడం వల్ల భారత మార్కెట్లో వీటి ధరలు తగ్గే అవకాశం ఉంది. యుకె నుంచి భారత్ దిగుమతి చేసుకునే అతిపెద్ద ఉత్పత్తి అయిన వెండిపై దిగుమతి సుంకాన్ని పదేళ్లలో పూర్తిగా సున్నాకు తీసుకురానుంది. యూకేలో తయారైన పూర్తిస్థాయి కార్లు, ట్రక్కులపై భారత్‌భారీగా దిగుమతి సుంకాలను తగ్గించేందుకు అంగీకరించింది.

## రూ. కోటి బంగారం మాయం!

### కాకినాడలోని బ్యాంక్‌లో భారీ గోల్‌మాల్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 14 ప్రభాతవార్త:** కాకినాడ నగరంలోని ప్రభుత్వ సర్వజన హాస్పటల్ ప్రాంగణంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో భారీ ఎత్తున గోల్ మాల్ జరిగింది. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారులను మోసం చేస్తూ దాదాపు రూ. కోటి విలువైన అసలు బంగారాన్ని మాయం చేసి, వాటి స్థానంలో నకిలీ నగలను ఉంచినట్లు తేలింది. బ్యాంకు గోల్డ్‌అప్రైజర్‌గా పనిచేస్తున్న నవర సూరిబాబు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.సాధారణంగా ఖాతాదారులు తెచ్చిన బంగారాన్ని పరీక్షి ంచి, మేనే జర్ సమక్షంలో లాకర్‌లో భద్రపరచడం అప్రైజర్ సూరిబాబు విధి. అయితే, ఇటీవల కొంతమంది ఖాతాదారులు తమ రుణాలు చెల్లించి బంగారం వెనక్కి తీసుకునేందుకు రాగా, సూరిబాబు పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేశాడు. దీనితో అనుమానం వచ్చిన ఖాతాదారులు అతడిని గట్టిగా నిలదీశారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన 789 గ్రాముల బంగారానికి బదులుగా కేవలం 589 గ్రాముల బంగారమే ఉంది. అంతేకాకుండా, లాకర్‌లో ఉన్న ఆ ఆభరణాలు కూడా నకిలీవని తేలింది.

## హత్యకేసు నిందితుడు కుటుంబంతో ఆత్మహత్య

### సింగరాయకొండ స్టేషన్‌లో విషాద ఘటన
### భార్య, ఇద్దరు చిన్నారులతో కలిసి హరికృష్ణ బలవన్మరణం
### బావ శ్రీహరి హత్యకేసులో హరికృష్ణ ప్రధాన నిందితుడు

**సింగరాయకొండ / బుచ్చి (నెల్లూరు) జులై 14, ప్రభాత వార్త :** సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో హృదయ విదారక ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు గూడ్స్ రైలు కిందపడి మృతి చెందారు. మృతులు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం ఆర్.ఎన్. కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణ (32), అతని భార్య ప్రణిత (30), కుమారుడు కౌనిక్ కృష్ణ (3), కుమార్తె మూగాంబిక (5)గా గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా తోట పల్లి గూడూరు మండలం ఆర్.ఎన్ కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణ కుటుంబ సభ్యులు భార్య ప్రణిత, ఇద్దరుపిల్లలతో కలిసి మంగళవారం మధ్యాహ్నం సింగరాయకొండ రైల్వేస్టేషన్ తూర్పువైపు రెండో ప్లాట్‌ఫారంపై కొంతసేపు ఉన్నారు. అనం >>2



హరికృష్ణ



ప్రణిత



మూగాంబిక



కౌనిక్ కృష్ణ

# రాష్ట్రంలో 'సర్' పొడిగింపు

**విజయవాడ. జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం(సర్)కు భారత ఎన్నికల సంఘం గడువును పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సందీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జులై 24 వరకు కొనసాగించనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జులై 24లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు.
ఓటర్ల ముసాయిదా జాబితాను జులై 31న ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ జులై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుంది. అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. సవరించిన షెడ్యూల్‌ను అన్ని అధికారులకు తెలియజేయడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాజకీయ పార్టీలకు కూడా ఈ మార్పులను లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించింది.

# మార్పులకు కమిటీ

>> గవర్నెన్స్ అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సిఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సిఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్‌ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం**

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పుచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని సిఎం సూచించారు. అన్నిబస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం సూచించారు.

# మహిళా డాక్టర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

>> డాక్టర్ విజయ స్థానం దక్కించుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఆసియా-ఓషియానియా ప్రాంతానికి భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఆమెకు లభించింది. పక్షవాత వైద్యానికి జీవితాన్నే అంకితం చేసిన వైద్యురాలు పక్షవాతానికి అత్యాధునిక చికిత్సలు అందించడం, శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వైద్యవిధానాల రూపకల్పనలో విశేష కృషి చేసినందుకే ప్రపంచ పక్షవాతసంస్థ ఈ అత్యున్నత బాధ్యతలను డాక్టర్ విజయకు అప్పగించింది. భారతదేశంలో ఆధునిక పక్షవాత చికిత్సకు శ్రీకారం చుట్టిన వైద్యుల్లో డాక్టర్ విజయ అగ్రగణ్యులు. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి పక్షవాత ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించి చరిత్ర సృష్టించారు. ముంబై, చెన్నై తర్వాత దేశంలో ఏర్పాటైన మూడో ప్రత్యేక పక్షవాత కేంద్రం ఇదే కావడం విశేషం. ఆమె నాయకత్వంలో ఈ కేంద్రం దేశంలోనే తొలి గుర్తింపు పొందిన అధునాతన పక్షవాత చికిత్స కేంద్రంగా నిలిచింది.

# బోటు ప్రమాద మృతదేహాలు

>> తీసుకువచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక ముగ్గురు పర్యాటకుల మృతదేహాలకు ముంబై విమానాశ్రయంలో అన్ని రకాల చట్టపరమైన లాంఛనాలను వేగంగా పూర్తి చేసి, భౌతికకాయాలను నేరుగా శంషాబాద్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం రాత్రి 8 గంటలకే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని రాత్రంతా ఆయన అక్కడే ఉండి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడతో పాటు విమానాశ్రయానికి వచ్చిన భౌతికాయాలను దగ్గరుండి కిందకు దింపించి.. వారి స్వగ్రామాలకు పంపే ఏర్పాట్లు పర్యవేక్షించారు. బాధితులను పరామర్శించి, ప్రభుత్వంవారికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధితులనుంచి పూర్తివివరాలు, వారి కుటుంబనేపథ్యం వివరాలు అడిగి మంత్రి తెలుసుకున్నారు.

# 55 లక్షలకు పెంచుతాం

>> ఎస్ఐపిబి సమావేశాలు, 57 కేబినెట్ సమావేశాలు నిర్వహించామన్నారు. గత పాలనలో ఎపిపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయిందన్నారు. కానీ ఆ పరిస్థితిని పునరుద్ధరించామని.. మళ్లీ ఎపి మోస్ట్ ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా అవతరించిందని వెల్లడించారు. పెద్దఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని.. తద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయన్నారు. వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాం. శెట్టిపల్లిలో 60, 70 యేళ్లుగా ఉన్న భూసమస్య పరిష్కరించాం. ప్రాపర్టీని అన్‌లాక్ చేస్తే ప్రభుత్వానికి 90 ఎకరాల భూమి వచ్చింది. వట్టిచెరుకూరులో ఎప్పుడో కట్టుకున్న ఇళ్లకు పట్టాలు ఇచ్చాం. సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొన్ని విభాగాల్లో స్థిరంగా, మరికొన్ని విభాగాల్లో అనూహ్య వృద్ధి. లక్ష్యాల మేరకు ముందుకెళ్తే 15 శాతం వృద్ధిరేటు సాధ్యమవుతుంది. స్థిరమైన ఆర్థిక వ్యవస్థ కోసం రెవెన్యూ రిసిప్ట్స్ చాలా ముఖ్యం. ఈ ఏడాదిలో జిఎస్డీపీ 20.4 శాతంగా నమోదైంది. కొందరు వ్యక్తులు కీలక విభాగాల్లో నెగెటివ్ రోల్ చేస్తే ఇబ్బంది వస్తుంది. రాబోయే రోజుల్లో కేసిఐ ఇండికేటర్ల ద్వారా నెలవారీ ఆర్థిక నివేదిక తయారీ. మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఒడిల క్షేత్రపర్యటనపై షెడ్యూల్ ఇచ్చాం. క్షేత్రస్థాయికి వెళ్లాలంటే ఎవరికీ ఆసక్తి ఉండదు నాతో సహా. క్షేత్రస్థాయికి వెళ్తే మాత్రం చాలా సంతృప్తి ఉంటుంది. క్షేత్రస్థాయిలోకి వెళ్తేనే వాస్తవాలు తెలుస్తాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. వ్యవసాయాధారిత రాష్ట్రంగా ఉన్న ఎపిని పారిశ్రామికంగానూ అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు, ఖనిజ వనరులు, కోస్తా జిల్లాల్లో ఆక్వా ఇలా వేర్వేరు రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, చీమకుర్తి గ్రానైట్ సహా విలువైన వనరులకు వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉందన్నారు. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన వద్ద ఉంది. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి అని పేర్కొన్నారు. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. ప్రతి నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం నిర్వహించుకోవటం ద్వారా పురోగతిని సమీక్షించుకుందామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
సీఎం చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే అన్నారు.డేటా డ్రివెన్ గవర్నెన్స్ ద్వారా రియల్ టైమ్ రిజల్ట్స్‌కు నాంది పలకాలని ఆకాంక్షిస్తున్నాన్నారు. పిజిఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను అన్నారు.మూడో యేడాదిలోకి అడుగు పెట్టినా విద్యుత్ ఛార్జీలను పెంచలేదు అన్నారు.ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పాం. దానిని నిలబెట్టుకున్నాం అన్నారు.ఇదే సమయంలో ట్రూ డౌన్‌ను కూడా అమలు చేసి ఛార్జీలు తగ్గించాం అన్నారు.పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం తగ్గించేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం అన్నారు. ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిపైనా దృష్టి సారించాలి అన్నారు.వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి అన్నారు.పట్టిసీమ కారణంగా గోదావరి నుంచి కృష్ణా డెల్టాకు నీరు అందించగలుగుతున్నాం అన్నారు.రాష్ట్రంలో చేపట్టిన జలసంరక్షణ చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి అన్నారు. వీటిని మరింత ముందుకు తీసుకెళ్లాలి గుడ్ ఆఫీసర్ సాల్వ్స్ ప్రాబ్లమ్స్ ఏ గ్రేట్ ఆఫీసర్ ప్రివెంట్స్ దెమ్ అనే కోణంలో అంతా పనిచేయాలిముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం అన్నారు.2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం అన్నారు.ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాంసెప్టెంబరు 1 తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాంరాష్ట్రంలోని 36 సాగునీటి ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్నాంకేంద్ర ప్రాయోజిత పథకాలన్నిటినీ పునరుద్ధరించాం.జల్ జీవన్ మిషన్ పథకాన్ని కూడా గరిష్టంగా వినియోగించుకోవాలి అన్నారుప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు పాలన సమీక్షించుకుని ముందుకు వెళ్దాం.జీఎస్డీపీలో 10.75 శాతం వృద్ధి నమోదు చేయగలిగాం. 15 శాతం లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలి

**2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం**

'స్వర్ణాంధ్ర 2047' విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర జిఎస్డీపీని ..308 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని ..55 లక్షలకు పెంచేందుకు, ఏటా 15 శాతం కంటే అధిక ఆర్థిక వృద్ధి సాధించే దిశగా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ఈ లక్ష్యాల అమలును పర్యవేక్షించేందుకు 30 సచివాలయ శాఖలు, 87 విభాగాల పరిధిలో 651 కీలక పనితీరు సూచికలు రూపొందించి డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
రాష్ట్ర ఆర్థిక పనితీరును వివరిస్తూ, 2025-26లో ఆంధ్రప్రదేశ్ 9.9 శాతం వృద్ధి నమోదు చేసి, జాతీయ సగటు 7.4 శాతాన్ని అధిగమించిందని తెలిపారు. అయితే మే2026 నాటికి రాష్ట్ర ద్రవ్యోల్బణం 4.9 శాతంగా నమోదవగా, గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 6.91 శాతానికి చేరడం సవాలుగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో ఖరీఫ్ ఆహార ధాన్యాల ఉత్పత్తి 39.8 శాతం పెరిగి 1.23 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరడం, తోటపంటలు, పశుసంవర్ధక, ఆక్వా రంగాలు పురోగతి సాధించడం సానుకూల పరిణామాలని పేర్కొన్నారు. నూనె గింజలు, మిర్చి-పసుపు, ఇన్‌లాండ్ చేపల ఉత్పత్తిలో తగ్గుదలపై ప్రత్యేక దృష్టి అవసరమని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ సాయిప్రసాద్,ప్రణాళికా శాఖ కార్యదర్శి పియూష్‌కుమార్, మంత్రులు అనగాని సత్యప్రసాద్,పయ్యావుల కేశవ్, నారా లోకేష్,వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం ముంబయిలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో మంత్రి కందుల దుర్గేష్

# ముంబయిలో డి.సిఎం పవన్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సిఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కల్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతిఅవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్‌తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

# శ్రీవారి హారతుల నిబంధనలపై కర్ణాటక సిఎం డికె జోక్యం మంచిదికాదు

## ఆయనకు అవగాహన కల్పించేలా చూస్తాం: టిటిడి బోర్డు సమావేశం నిర్ణయం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి వేకువజామున తోమాల, అర్చన సేవల తరువాత పారంపర్యంగా నిర్వహించే హారతుల నిబంధనలపై కర్ణాటక సిఎం డికె శివకుమార్ చేసిన సంచలన వ్యాఖ్యలపై టిటిడి బోర్డు కూలంకుషంగా చర్చించింది. మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డుసభ్యులు ఈ అంశంపై తీవ్రస్థాయిలో చర్చించారు..అందరూ ఒకే అంశంపై ముక్తకంఠంతో తీర్మానం చేశారు. తిరుమల ఆలయంలో దేవదేవునికి ఇచ్చే నిత్య హారతుల్లో పూర్వం మైసూరు మహారాజు శ్రీవారికి చేసిన సేవలు, అందించిన కానుకలకు గుర్తింపుగా ఆ మైసూరు మహారాజు కుటుంబానికి ,పలు మఠాలు, మైసూరు సంస్థానం తరపున హారతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం తొలి గంట నైవేద్యసమయంలో స్వామివారికి 21నిత్యహారతులు ఇస్తారు. 20 మఠాలతో బాటు మైసూరు సంస్థానం తరపున ప్రతినిధులు హారతి పళ్లెం, నైవేద్యాలుతో ఆలయంలోనికి వెళ్తారు. ఆలయంలోపల టిటిడి అర్చకులు హారతి పళ్లెంను శ్రీవారికి సమర్పించి తిరిగి దాన్ని వారికే అందజేస్తారు. అయితే ఈ భక్తిపరంపరలో ఆయా సంస్థాన ప్రతినిధులు తప్ప మరెవరూ బయటి వ్యక్తులుగానీ, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు పాల్గొనడానికి లేదు. ప్రతి నెలా ఉత్తరాభాద్ర నక్షత్రంరోజు, దీపావళి, ఉగాది ఆస్థానం, ఆణివార ఆస్థానం పర్వదినాల్లో మైసూరు మహారాజు పేరున ప్రత్యేక హారతి ఉంటుంది. మైసూరుమహారాజు తరపున కర్ణాటకకు ప్రాతినిధ్యం ఉంది. అయితే తాజాగా ఈ వైదిక అంశంపై కర్ణాటక సిఎం డికె శివకుమార్ అవగాహన లేకుండా చేసిన వ్యాఖ్యలుతో పెద్ద దుమారం రేగింది. దీనిపై మంగళవారం బోర్డులో కూడా చర్చకు వచ్చింది. సిఎం శివకుమార్ తిరుమల ఆలయ వైదిక సంప్రదాయాలు, కార్యక్రమాలపై జోక్యం చేసుకుని,నిబంధనలపై అవగాహన లేకుండా మాట్లాడటం మంచిదికాదని, దీనిపై ఒక లేఖ ద్వారా ఆయనకు పూర్తి వివరాలను తెలియజేయనున్నట్లు బోర్డు నిర్ణయించిందని ఛైర్మన్ నాయుడు తెలిపారు. కర్నాటక సిఎం చేసిన వ్యాఖ్యలతో ఇంతటితో వివాదం ముగిసినట్లేనని తెలుస్తోంది.

# కాపు ఉద్యమ శిఖరం ముద్రగడ ఇక లేరు

>> ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి.

**ముద్రగడ ప్రస్థానం...**

1953 జనవరి 22న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో రాజకీయ కుటుంబంలో ముద్రగడ పద్మనాభం జన్మించారు. ఆయన తండ్రి వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు స్వతంత్ర ఎమ్మెల్యేగా పనిచేశారు.తండ్రి మరణానంతరం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి సూచనతో ముద్రగడ రాజకీయాల్లోకి అడుగుపెట్టి 1978లో జనతా పార్టీ తరపున ప్రత్తిపాడు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు.అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి, ప్రత్తిపాడు నుండి గెలిచి ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా సేవలు అందించారు.1989 వరకు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాలుగు సార్లు శాసనసభ్యుడిగా, రెండు సార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1999-2004 మధ్య కాకినాడ నియోజకవర్గం నుండి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఎన్నికల ముందు 2024 మార్చిలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
1988లో ఉత్తరకొంచి సంఘటనలోనూ తన అనుచరులు బాసటగా న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌లో కేసులు వ్యతిరేకిస్తూ ఉద్యమం నడిపారు రోజులు గడుస్తున్నా స్పందించని పాలకులు తీరుకు నిరసిస్తూ అమరణ దీక్షకు ప్రకటించారు దీంతో దిగివచ్చిన పాలకులు కేసులు ఎత్తి వేశారు. దీనికి సంఘీభావం పలికిన కాపులతో కాపుల నేతగా మరింత బలపడ్డారు. కాపు రిజర్వేషన్ల పోరాట యోధుడుగా చరిత్రలో నిలిచిపోయే ముద్రగడ సామాజిక న్యాయం కోసం, ముఖ్యంగా కాపు సామాజిక వర్గ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నేతగా ఆయన నిలిచిపోయారు.
ముద్రగడ పద్మనాభం పేరు వినపడగానే గుర్తుకు వచ్చేది కాపు ఉద్యమం. 1994 అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పై కాపు సామాజిక వర్గ హక్కుల కోసంపోరాటం చేశారు.కాపులను వెనుకబడిన తరగతుల (బిసి) జాబితాలో చేర్చాలంటూ ఆయన దశాబ్దాల పాటు చేసిన ఉద్యమాలు, పాదయాత్రలు, తిరుపతి వరకు సైకిల్ ర్యాలీ,తన స్వగృహంలో ఆమరణ



మంగళవారం ముద్రగడ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపి రవిచంద్ర, పళ్లంరాజు తదితరులు

నిరాహార దీక్షలు చరిత్రలో నిలిచి పోయాయి. కిర్లంపూడి వేదికగా సాగిన కాపు ఉద్యమానికి ఆయనే ప్రధాన కేంద్రబిందువుగా నిలిచారు. పంతం పట్టుదలకు కూడా ఆయన పెట్టింది పేరు. అనుకున్న న్యాయం కోసం తన పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన ఘనత ఆయనకే దక్కింది. యావత్ రాష్ట్రాన్ని తనవైపుచూసేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఆయన ఉద్యమ నేతగా పేరొందారు. ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన ముద్రగడ ఏ పని తలపెట్టిన ఓ ప్రత్యేకత ఉండేది. 2016లో తుని ప్రాంతంలో జరిగిన కాపు ఐక్య గర్జనలో జరిగిన హింసాత్మక సంఘటన తర్వాత ఉద్యమం మరో మలుపు తిరిగింది. ఇంతటి ఘన చరిత్ర కలిగి ముద్రగడ పద్మనాభం హఠాన్మరణం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ నేతలు,వివిధ పార్టీల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాపు సామాజిక వర్గానికి, ఏపీ రాజకీయాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. ముద్రగడ పార్థివ దేహాన్ని బుధవారం ఆయన స్వగ్రామమైన కిర్లంపూడికి తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కిర్లంపూడి మండలంలో వర్తక సంఘం స్వచ్ఛంద బందుకు పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

15-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
పాడ్యమి ఉ.11.54
పుష్యమి రా.9.50
వర్జ్యం : ఉ.7.24-ఉ.8.51
దు. ఉ.11.47-మ.12.39
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** మీ లోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం చేస్తారు. స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**వృషభం:** ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలు చేస్తుంది. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు.

**మిథునం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం :** డాక్యుమెంట్లు, ముద్రణా పరమైన రానిబాకీలు, రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇవి ఇబ్బందులకు గురిచేస్తాయి.

**సింహం:** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కన్య :** శత్రు వర్గంలోని అనైక్యతనుగుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు. ఆహ్వానాలు అందుకుంటారు.

**తుల :** క్రమశిక్షణ పాటించడం వలన లాభపడతారు. ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. జాగ్రత్త వహించండి.

**మకరం:** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయటపడతారు. వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** కార్యాలయంలో సెలవు కోసం మీరు చేసే యత్నాలు ఫలవంతం కాక పోవచ్చు. మధ్యవర్తిత్వాలు చేయకండి.

**మీనం :** బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ముద్రగడ మృతికి సిఎం, డి.సిఎం సంతాపం

**విజయవాడ, జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంమరణవార్త విచారం కలిగించింది. పద్మనాభం కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. అని చంద్రబాబు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతాలో తన సంతాపాన్ని వెలిబుచ్చారు.
డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతాలో తన సంతాపాన్ని తెలిపారు. ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలి. మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. ముద్రగడ పద్మనాభం సతీమణికి, కుమారులకు, కుమార్తెకు, ఇతర కుటుంబ సభ్యులకు, వారి మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. అని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

**ముద్రగడ మరణవార్తపై విచారం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్, మంత్రి నారా లోకేష్,బిజెపి మాధవ్**

ముద్రగడ పద్మనాభం మరణవార్తపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విచారణ వ్యక్తం చేశారు. ముద్రగడ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభం మృతిపట్ల మంత్రి లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. ముద్రగడ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ మంత్రి,.అవనిగడ్డ ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్, ప్రభుత్వ మాజీ విప్, జనసేన నేత సామినేని ఉదయభానులు ముద్రగడ మృతికి విచారం వ్యక్తం చేసారు. ముద్రగడ పద్మనాభం మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కుటుంబంతో ఆత్మహత్య

>> తరం ఒంగోలు వైపు నుంచి వస్తున్న గూడ్స్ రైలు సమీపిస్తుండగా భార్యాభర్తలు ఇద్దరు చిన్నారులను ఎత్తుకుని పట్టాలపైకి వెళ్లడంతో నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు డీఎస్పీ మురళీధర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డియస్పీ తెలిపిన వివరాలు మేరకు గత నెలలో బుచ్చిరెడ్డిపాలెం వ్యవసాయ శాఖ అధికారి శ్రీహరి హత్య కేసులో కుడుముల హరికృష్ణ ప్రధాన నిందితుడుగా నిర్ధారణ కావడం, ఈ నెల 9న కేసు నమోదైన తర్వాత విచారణలో అతని పాత్ర నిర్ధారణ కావడంతో అప్పటి నుంచి పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదే కేసులో ఏ2 నిందితుడు సోంపల్లి రవీంద్ర ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నట్లు చెప్పారు.ఏ3 నిందితుడును అరెస్ట్ చేయడం జరిగిందని, హత్యకు గురైన శ్రీహరి హరికృష్ణకు సొంత బావమరిది అని పోలీసులు తెలిపారు. కేసు నేపథ్యంలో ఏర్పడిన కుటుంబ పరిస్థితులు, తీవ్ర మనస్థాపం కారణంగానే ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో భావిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.ఎఫ్ఎస్ఎల్ బృందం ఆధారాలు సేకరించిందని, పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించడం జరిగిందన్నారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.ఈ విషాద ఘటనతో ఆర్.ఎన్. కండ్రిగ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

**'శ్రీహరి హత్యలో సూత్రధారి హరికృష్ణ'**

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన వ్యవసాయాధికారి శ్రీహరి హత్యకేసులో ఎ-1 ముద్దాయి కుడుముల హరికృష్ణ,కుటుంబంతో సహా ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వేస్టేషనలో గూడ్సు రైలు కింద పడి దుర్మరణం చెందారు. హరికృష్ణ బావ వ్యవసాయాధికారి శ్రీహరిని పథకం ప్రకారం పెంచలకోనకు తీసుకొని వెళ్లి మార్గ మధ్యంలో ఇద్దరుతో కలిసి హత్య చేసి దానిని గుండె పోటుతో మృతి చెందినట్లుగా చిత్రీకరించారు.అయితే వ్యవసాయాధికారి శ్రీహరి మొదటి బార్య జిల్లా ఎస్‌పి అజితా వెజండ్లకు ఫిర్యాదు చేయడంతో అసలు కథ బయటకు వచ్చింది. శ్రీహరిది గుండెపోటు మరణం కాదని ముమ్మాటికి హత్యేనని తేలింది. ఈహత్య చేయించింది. రెండో భార్య సోదరుడు కుడుముల హరికృష్ణ మరో ఇద్దరితో కలిసి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎ-1 ముద్దాయి హరికృష్ణ కోసం వేట ప్రారంభించారు. దీంతో హరికృష్ణ రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో తనకు ఏమి తెలియదంటు వీడియో విడుదల చేశాడు. నేను చనిపోతాను అని కూడా ఆవీడియోలో స్పష్టం చేశాడు. చెప్పిన విధంగానే హరికృష్ణ సింగరాయ కొండ రైల్వేస్టేషన్‌లో కుటుంబంతో సహ ఆత్మహత్య చేసుకొని మంగళవారం మృతి చెందారు. ఏపాపం తెలియని భార్యా బిడ్డల్ని కూడా బలి చేశాడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# విరాళాల నిబంధనల్లో టిటిడి మార్పులు

>> పంలో 800 కిలోవాట్ల విండ్ టర్బైన్ జనరేటర్‌ను విష్‌విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విరాళంతో ఏర్పాటు చేసి, టిటిడికి 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ముందుకు వచ్చారు. తిరుమల ఎస్వీ మ్యూజియంలో 12 యేళ్ల పైబడిన సందర్శకులకు 50 రూపాయలు ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టాటా సంస్థకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో కాకులమాను తిప్ప సమీపంలోని 25 యేళ్లకు పైబడిన పాత ఘన వ్యర్థాలను బయో రిమీడియేషన్, బయోమైనింగ్ ద్వారా శాస్త్రీయంగా శుద్ధి చేయడానికి ఐదుకోట్లు మంజూరు చేయనున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా తిరుమల, తిరుపతిలోని టిటిడి ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణకు 2.35 కోట్లతో నిర్వహణ పనులను నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు. తిరుమలలో టిబిసి, ఎటిసి విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి, వాటి స్థానంలో దాతల సహకారంతో నూతన భవనాలను నిర్మించేందుకు ఆమోదించారు. 2027వ సంవత్సరానికి సంబంధించి శ్రీవారి క్యాలెండర్లు, డైరీలు ముద్రించేందుకు టిటిడి పాలకమండలి నిర్ణయించింది. ఇందులో డైరీలు 10 లక్షలు, 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు 75 వేలు ముద్రించేందుకు ఆమోదం తెలిపారు. తిరుమల ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు, ఎఫ్ఎంఎస్ సేవలకు 2.91 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయించారు.కడపజిల్లా ఒంటిమిట్ట సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి మూలవర్లకు బంగారు కవచాల తయారీకి టిటిడి ట్రెజరీలోని వెయ్యి గ్రాముల బంగారాన్ని వినియోగించుకునేందుకు నిర్ణయించారు. 17.84 కోట్లతో ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం వద్ద యాత్రికుల సౌకర్యార్థం వంద గదులతో విశ్రాంతి గృహం నిర్మాణానికి టెండర్లు ఆమోదించారు.
ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం ఈశాన్య మాడవీధి విస్తరణ, యాత్రికుల సౌకర్యాల అభివృద్ధి కోసం 6,103 చదరపు అడుగుల భూమి సేకరణ నిమిత్తం జిల్లా యంత్రాంగానికి 2.11 కోట్ల రూపాయలు చెల్లింపునకు బోర్డు ఆమోదించింది. టిటిడి వంటి ధార్మికసంస్థలో అధర్వణ వేదాలను నిరంతరాయంగా పారాయణం జరిగేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలలో కూడా నిత్య పారాయణం, లోక కల్యాణం జరిగేలా వేద పారాయణ స్కీం ద్వారా 791 మందిని సంభావన వేద పండితులుగా నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు.
హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల తదితర విభాగాల్లో సేవలందిస్తున్న కళాకారుల పారితోషికాన్ని ఆయా కళాకారుల నైపుణ్యాన్ని బట్టి పెంచేందుకు ఆమోదించారు.టిటిడి క్యాంటీన్ల విభాగంలో ఉన్న 65 సర్వర్ల పోస్టులను క్యాటరింగ్ సూపర్‌వైజర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు, టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

15-7Pg3exHMNWJQERLTC_15-7Pg3exHMNWJQERLTC.qxd 15/Jul/26 12:17 AM Page 1



## తిరుమల సమాచారం



### శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ వెలుపల టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ,అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరితో కలిసి ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుండి ఆనందనిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయంలో అష్టదళపాదపద్మారాధనసేవ రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి, జెఇఒ డాక్టర్ ఏ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒ లోకనాథం, బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



### టిటిడి ట్రస్ట్‌లకు రూ.50 లక్షలు విరాళం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరుకు చెందిన బృందా న్యూరో సెంటర్ మంగళవారం ఉదయం టిటిడి పథకాలకు భూరీ విరాళాలందించింది. వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు 10,00,116 లక్షలు, వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 10,00,116, బర్డ్ ట్రస్టుకు 10,00,116 విరాళంగా అందించింది. ఆ సంస్థ అధినేతలు డాక్టర్ హనుమ శ్రీనివాస రెడ్డి, సిద్ధార్థలు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మం డపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు. అలాగే బెంగుళూరుకు చెందిన శ్రీపతి శ్రీనివాస్, కొటారు సునీల్ లు వేంకటే శ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10,00,116 లక్షలు విరాళంగా అందించగా, విశాఖపట్నంకుచెందిన చాగర్లమూడి సీతారామయ్య బర్డ్ ట్రస్టుకు 10,00,116 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయ కుల మండపంలో ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు.



### రూ.60.61 లక్షలు విరాళాలు అందజేత

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** పలువురు దాతలు మంగళవారం రాత్రి టిటిడి ట్రస్ట్‌లకు భారీ విరాళాలిచ్చారు. ఎస్వీఅన్న ప్రసాదం ట్రస్ట్‌కు 60.61 లక్షలు విరాళంగా అందింది. విశాఖపట్నంకు చెందిన ఎస్ఎస్ఎన్ఆర్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10.50లక్షలు, విశ్వ సి.వి.చెరుకూరి భక్తుడు 10 లక్షలు, వంత ఇన్ ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10 లక్షలు, వెర్టెక్స్ కౌంటీ ఎల్ఎల్పీ సంస్థ 10 లక్షలు, హైదరాబాద్ కు చెందిన సాయిలీల ఎలక్ట్రికల్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10 లక్షలు, అమరావతిలోని తుళ్లూరుకు చెందిన జొన్నలగడ్డ కిరణ్ కుమార్ 10,11,116 లక్షలు రూపాయలుయ విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ృ, జాస్తి పూర్ణ సాంబశివరావు, శాప్ చైర్మన్ రవి నాయుడు పాల్గొన్నారు.

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యం

### రూఫ్ టాప్ సోలార్ పనులు వేగవంతం-విడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి మంగళవారం శివశంకర్ లోతేటి సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలతో అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేస్తూ వినియోగదారుల మన్నన పొందాలని సూచించారు. సంస్థ పరిధిలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుకు గురైతే నిర్ణీత గడువులోగా ట్రాన్స్ ఫార్మర్ను అమర్చాలని ఆదేశించారు. ఈ అంశంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను సీనియారిటీ ప్రాతిపదికన మంజూరు చేయా లని, ఈ అంశంలో నిబంధనల్ని అతిక్రమిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సి, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ సోలార్ ఏర్పాటు పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్లు తగిన స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, నిర్ణీత గడువులోగా పనుల్ని పూర్తి చేయాలని కోరారు. ఈ పనులను సంబంధిత సర్కిల్ అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు. సంస్థ పరిధిలోని వివిధ సర్కిళ్ళలో చేపడుతున్న విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్‌ఎస్ఎస్) పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్షి స్తూ పనుల్ని సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్(టెక్నికల్ హెచ్ఆర్డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణాదేవి, ఆర్. పద్మ, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, ఎం. మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు జగదీష్, చక్రపాణి, లత, శ్రీకాంత్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, సుధాకర్, రాఘవేంద్రం, చంద్రశేఖర్ రావు, సోమశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, మోజెస్, అమర్ బాబు, 9 సర్కిళ్ళ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, అకౌంట్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అకౌంట్స్

## 'రా ఎన్టీఆర్'కు ఎలాంటి అధికారాలు లేవు

### ఆ పేరుతో కార్యకలాపాలు నిర్వహించకూడదు: జూ.ఎన్టీఆర్ కార్యాలయం

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** టాలీవుడ్ స్టార్ ఎన్టీఆర్ పేరుతో ప్రకటనలు చేస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తున్న రా ఎన్టీఆర్ (ఆర్ఏడబ్ల్యు ఎన్టీఆర్) సంస్థకు ఎలాంటి అధికారం లేదని నటుడు నందమూరి తారక రామారావు కార్యాలయం స్పష్టం చేసింది. ఆయనకు సంబంధించిన సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలను కేవలం వ్యక్తిగత లేదా ఆయన అధికారిక బృందం ద్వారా మాత్రమే వెల్లడి అవుతాయని ఈ సందర్భంగా ప్రకటన చేసింది. ఆర్ఏడబ్ల్యు ఎన్టీఆర్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక సంస్థ ఎన్టీఆర్‌తో సంబంధం ఉన్నట్లు ప్రజల్లో భావన కలిగించే విధంగా వ్యవహరిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా మేము ఒక విజ్ఞప్తి చేస్తున్నాం. ఎన్టీఆర్‌కి గానీ, ఆయన కార్యాలయానికి 'రా ఎన్టీఆర్' అనే సంస్థతో లేదా వాటి కార్యకలాపాలతో ఏ విధమైన సంబంధం, అనుమతి, ప్రమేయం లేదు. సంబంధిత సంస్థకు ఎన్టీఆర్ తరఫున ప్రాతినిధ్యం వహించే అధికారం లేదు. ఎన్టీఆర్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు చేయడానికి వీల్లేదు. ఎన్టీఆర్‌కు సంబంధించిన ఏదైనా సేవా కార్యక్రమం, అధికారిక ప్రకటన లేదా ఇతర కార్యకలాపాల గురించి సమాచారం ఎన్టీఆర్ లేదా ఆయన అధికారిక బృందం ద్వారానే వెల్లడిస్తారు. ఎన్టీఆర్ జులై 18న రాజకీయాల్లోకి రానున్నారంటూ వస్తున్న వార్తలపై ఎన్టీఆర్ అభిమానుల సంఘం సోమవారం ఓలేఖను రిలీజ్ చేసి ఆ వ్యాఖ్యలన్నీ అవాస్తవమని ఖండించింది. ఆ రోజు నిర్వహించనున్న ఈవెంట్ కార్యక్రమానికి తారక్ పొలిటికల్ ఎంట్రీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇది ఒక సామాజిక కార్యక్రమం మాత్రమేనని వెల్లడించింది. ఇంతలో కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే మంగళవారం మరో సంస్థ తిరుపతి రాఎన్టీఆర్ తాజ్ హోటల్‌లో ఎన్టీఆర్ ప్రెస్ మీట్ పెట్టనున్నారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం ఆశ్చర్యకరం. ఈ వార్తలు పలు మీడియా ఛానెళ్లలో సైతం ప్రసారం కావడంతో చివరికి ఎన్టీఆర్ ఆఫీస్ రంగంలోకి దిగి మరో ఇష్యూని అవాస్తవాలు అని క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. దాంతో సంబంధిత సంస్థ చేసిన వ్యాఖ్యలు అసత్యమైనవిగా తేలింది. ఎన్టీఆర్ అభిమానుల సంఘం జులై 18న ఈరోజు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనికి ఎప్పుడో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపింది. దీన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దని విజ్ఞప్తి చేసింది. అసత్య ప్రచారాలను నమ్మొద్దని అందరిని కోరింది. ఇలాంటి వాటిని ప్రచారం చేయొద్దని మీడియా సంస్థలు, సోషల్ మీడియా పేజీలకు సైతం తెలియజేసింది. దీని వల్ల అభిమానులు అనవసరంగా అయోమయానికి గురవుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. దీనిపై క్లారిటీ ఇస్తూ ఎన్టీఆర్ అభిమానుల సంఘం సంబంధిత లేఖలో పేర్కొంది.

## ఎపి చేనేత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్: ఎంపి విజయేంద్ర ప్రసాద్

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ చేనేత, వస్త్ర ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్ అన్నారు. నైపుణ్యమైన నేత కళాకారులను వర్చువల్ రియాలిటీ (వీఆర్) వంటి ఆధునిక సాంకేతికత ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ మండపంలో మంగళవారం ప్రారంభమైన భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆయన సందర్శించారు. భారతీయ సాంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ముఖ్యంగా అమెరికాలోని భారతీయ ప్రవాసులు, అంతర్జాతీయ వినియోగదారుల్లో మంచి ఆదరణ పెరుగుతోందని ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ అవకాశాన్ని ఆంధ్ర ప్రదేశ్ సమర్థంగా వినియోగించుకుంటే చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (లేపాక్షి) పసుపులేటి హరి ప్రసాద్ పెవిలియన్‌ను సందర్శించి అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అమలవుతున్న ఏపీ టెక్స్‌టైల్ పాలసీ-4.0 ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.



మంగళవారం ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను సందర్శించి ఎంపి విజయేంద్ర ప్రసాద్

## ఆర్థిక సంక్షోభంలో ఇండియా

### బిజెపి పాలనలో రూ.150 కోట్ల విదేశీ అప్పులు: చింతామోహన్





మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

**చిత్తూరు, జులై 14 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 12 సంవత్సరాల్లో 150 లక్షల కోట్ల రూపాయల విదేశీ అప్పులు చేసి భారతదేశంను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతా మోహన్ ధ్వజమెత్తారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతామోహన్ మాట్లాడుతూ భారతదేశాన్ని యేళ్ల తరబడి పాలించిన కాంగ్రెస్ పార్టీ హయాంలో విదేశీ అప్పులు కేవలం 50లక్షల కోట్ల రూపాయలు మాత్రమే వుండేదన్నారు. దేశంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల్లో విదేశీ అప్పులు మూడింతలు పెరిగాయని ధ్వజమెత్తారు. కేంద్రంలో యుపిఎ అధికారంలో వున్న సమయంలో ఒక లీటరు పెట్రోలు, డిజీలు రూ.60 వుండేదని, ప్రస్తుతం ఈ ధర రూ.110కి పెరిగిందన్నారు. ప్రస్తుతం దేశంలో కోడి గ్రుడ్డు నుండి ఎరువులు, బియ్యం, నూనె, పప్పుల ధరలు అందనంత ఎత్తుకు ఎగబాకి సామాన్యులకు అందడం లేదని ధ్వజమెత్తారు. ఆయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం వసూలు చేసిన నిధుల గురించి అడిగితే బిజెపి నాయకులు పారిపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని బాధపడుతున్నారని, ఆయనపై 16 సంవత్సరాలుగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో విచారణ సాగుతున్నదని, న్యాయ స్థానాల్లో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు.

తమిళనాడు మాజీ సిఎం జయలలితకు ఒక న్యాయం, ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం వైఎస్ జగన్‌కు ఒక న్యాయం! అని ప్రజల్లో చర్చ విస్తృతంగా జరుగుతున్నదన్నారు. అలాగే రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించిన ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత జిల్లా చిత్తూరుకు ఏమి చేయకపోవడం అన్యాయమన్నారు. ఇకనైనా సిఎం సొంత జిల్లా చిత్తూరు ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## రవితేజ మృతదేహానికి అంత్యక్రియలు

### శోకసంద్రంలో కుటుంబీకులు



రవితేజ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య,తదితరులు

**హిందూపురం, జులై 14 ప్రభాతవార్త:** విహారయాత్రకు వియత్నాం వెళ్లి పడవ ప్రమాదంలో దుర్మరణం చెందిన హిందూపురం వాసి రవితేజ మృతదేహం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీసత్యసాయిజిల్లా హిందూపురానికి చేరుకుంది. వియత్నాం నుంచి న్యూఢిల్లీకి సోమవారం బోటు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు వచ్చాయి. తదుపరి మంగళవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోగా ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో రోడ్డు మార్గం నందు ఇక్కడికి తీసుకొచ్చారు. స్థానిక టీచర్స్ కాలనీలోని నివాసానికి మృతదేహం చేరుకోగానే భార్య, ఇద్దరు కుమార్తెలు, తల్లి గుండెలు పగిలేలా రోదించారు. వారి రోదనలను చూసిన ప్రజలు చలించిపోయారు. 40 ఏళ్ల వయసులోనే మృత్యువాత పడడం అత్యంత బాధాకరమైనదని కుటుంబీకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో లక్కీ మొబైల్ షాపును నిర్వహించిన రవితేజ లావా కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్లను రికార్డు స్థాయిలో విక్రయించడంతో వియత్నాం టూర్‌కు సెలక్ట్ అయి అక్కడికి వెళ్లిన మూడో రోజే మృత్యువాత పడడం తెలిసిందే. కాగా లావా కంపెనీ ప్రతినిధులు రవితేజ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారంగా ప్రకటించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో స్నేహితులు, ప్రజలు తరలివచ్చారు.

### నగల కోసం వృద్ధురాలు దారుణ హత్య

**తిరుపతి,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరంలో మంగళవారం మధ్యాహ్నం దారుణ హత్య జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని టార్గెట్ చేసిన దుండగులు గొంతుకోసం హత్యచేసి ఆపై ఒంటిపై ఉన్న నగలను అపహరించుకెళ్ళారు. ఈ సంఘటన తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవాయన గుంటలో జరిగింది. ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ గా రిటైర్డ్ అయిన కృష్ణారెడ్డి జ్యోతి దంపతులు నివాసముంటున్నారు. ఆయనకుమారుడు ఉదయ్ అమెరికాకు వెళ్ళేందుకు విమానాశ్రయంవెళ్లి సాగనంపేందుకు సోమవారం బెంగళూరుకి వెళ్ళాడు, దీన్ని గమనించిన దుండగులు అదనుగా భావించి ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు జ్యోతి(60)ని దుండగుడు గొంతు కోసి నగలు లాక్కొని ఇంటికి బయట తాళం వేసి పరారయ్యాడు. బెంగళూరు నుండి పలుమార్లు భర్త ఫోన్ చేసినా తీయక పోవడంతో అనుమానం వచ్చి పై ఇంటిలో ఉన్న వాళ్లకు సమాచారమిచ్చాడు. పై ఇంటిలో ఉన్నవాళ్లు క్రిందికి వచ్చి అరచినా తలుపులు తీయకపోవడంతో వారి వద్ద ఉన్న మరో తాళంచెవితో తలుపుతీశారు. లోపలరక్తస్రావం తో విగత జీవిగా ఉన్న జ్యోతిని గుర్తించి మృతురాలు భర్తకు పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఎఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, రవి మనోహరచారి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యామ్‌సుందర్, సిఐలు మద్దయ్యాచారి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీస్ క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, డాగ్ స్క్వాడ్ చేరుకొని ఆధారాలు సేకరించాయి. ఆ ఇంటికి చుట్టుపక్కల ఉన్న సిసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు.. ఆధారాలను సేకరించారు. గతంలోనూ తిరుపతిలో ఒంటరిగా ఉన్న మహిళను హతమార్చి నగలు కాజేసిన విషయం విదితమే.

### శవ రాజకీయాల ముసుగు తొలగిస్తాం

### మత్స్యకారుల పక్షాన నిలచిన చరిత్ర మాది: మంత్రి అచ్చెన్నాయుడు



**సచివాలయం,జులై 14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిపక్ష గొడ్డలి పార్టీ అధ్య క్షుడు చేస్తున్నవన్నీ పచ్చి అబద్దాలని, శవ రాజకీయాల ముసుగులో లబ్ధి పొందాలని చూస్తే ప్రజా క్షేత్రంలో ఉతికి ఆరేస్తాం అని వ్యవ సాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖ పట్నం తీరంలో ప్రకృతి వైపరీత్యం వల్ల గల్లంతైన మత్స్యకారుల ఉదంతపై ప్రతిపక్షం చేస్తున్న చౌకబాబు విమర్శలను ఆధారాలతో సహా తిప్పికొట్టారు. సముద్రంలో జరిగిన ప్రమాదంపై ప్రతిపక్ష నేతకు కనీస అవగాహన లేదని అచ్చెన్నాయుడు ఎద్దేవ చేశారు. టీవిల్లో, పేపర్లలో 19నాటికల్ మైల్స్(దాదాపు 35కిమీ) దూరంలో ప్రమాదం జరిగిందని ట్రోలింగ్ వస్తుంటే, కనీస జ్ఞానం లేకుండా 10కిమీదూరంలోనే జరిగిందని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. నాటికల్ మైల్‌కు, కిమీకు తేడా తెలియని నువ్వు ఈరోజు ప్రభుత్వ బాధ్యత గురించి మాట్లాడటం హాస్యాస్పందం అని మండిపడ్డారు. మత్స్యకారుల రక్షణకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పాండర్ల సాంకేతికత గురించి మంత్రి వివ రించారు. ప్రమాద సమయంలో బోటులోని వారు అలారం ఆన్ చేయక పోవడం వల్ల లోకేషన్ గుర్తించడం కష్టమైందని, అయినాకాని ఉద యం 10.30గంటలకు సమాచారం అందిన వెంటనే డిపార్ట్‌మెంట్ అప్రమ త్తమైందన్నారు. 11.30 గంటల కల్లా కోస్ట్‌గార్డ్, నావికాదళం, జిల్లా కలెక్టర్ ను సమన్వయం చేసి హెలికాప్టర్లు, బోట్లతో గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించామని చివరకు రష్యాబోటు సహాయంతో ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు.

**కంటి సర్జరీని కూడా రాజకీయం చేస్తారా?** గత 30ఏళ్ళుగా రాష్ట్రంలో ఎక్కడ విపత్తు వచ్చినా అర నిమిషంలో అక్కడ వాలిపోయే చరిత్ర అచ్చెన్నాయుడిది, ప్రమాదం జరిగిన రోజు నాకు రెండు కళ్ళకు కాటరాక్ట్ సర్జరీ జరిగింది. నేను వెళ్ళలేకపోయినా, తక్షణమే ముఖ్యమంత్రితో మాట్లాడి మా సహచర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును, స్థానిక ఎమ్మెల్యేలను, అధికారులను రాత్రికి రాత్రే బాధితుల వద్దకు పంపాను, అంతేకాకుండా మత్స్యకార శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా తక్షణ సహాయం చెక్కులను విశాఖపట్నం పంపించి బాధతులకు అందజేశాం. ఇవన్నీ నీ కళ్ళకు కనిపించడం లేదా? అని నిలదీశారు. శ్రీకాకుళంలో గొర్రెలు కాసుకునే అమాయక పేదవాడిని ఢీకొట్టి చంపిన మాజీమంత్రి కొడుకు ఉదంతాన్ని మంత్రి ప్రస్తావించారు. చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన "డేగ కళ్ళ" సీసీ నిఘా కెమెరాలు ఉండబట్టి, ఎస్పీ ఆ ఫుటేజ్ చూసి మీ కుట్రలను బట్ట బయలు చేశారు. 'పలకరింపుల పేరుతో కెమెరాల ముందు నవ్వుకుంటూ, జైజైలు కొట్టించుకునే శవ రాజకీయాల ముసుగును మత్స్యకార సంఘాలు గమనించాలి. అభివృద్ధిపై, సంక్షేమంపై ఎక్కడికి రమ్మన్నా బహిరంగ చర్చకు నేను సిద్ధం" అని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిపయ్యావుల కేశవ్‌తో ఉద్యోగ సంఘాల నాయకులు

## మంత్రి పయ్యావులను కలిసిన ఉద్యోగసంఘ నాయకులు

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలో ప్రభుత్వఉద్యోగుల సంఘంనాయకులు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాద పూర్వకంగా కలిసి, 2004 సెప్టెంబర్ 1కు ముందు ఏపీపీఎస్సీ/డీఎస్సీ నోటిఫికేషన్ల ద్వారా ఎంపికై వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయనున్న నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన ఉద్యోగులు, ఏపీఎన్జీఓ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాసా ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం దాదాపు 11 వేల మంది ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిందని వారు పేర్కొన్నారు.

### ఆధార్ కార్డు అప్డేట్, కొత్తగా నమోదుకు ప్రత్యేక సెంటర్లు

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్‌లో విద్యార్థుల ఆధార్ కార్డు అప్డేట్. కొత్త నమోదుల కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తోంది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నేటి నుండి 17వతేదీ వరకు మొదటి విడత ఆధార్ అప్డేషన్, కొత్త నమోదులు చేసుకోవచ్చు. ఇక రెండోవిడత జులై 21 నుండి 24 వరకు నిర్వహించబడుతుంది. మొత్తం 8రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వచ్చు. ఐదు నుండి 17సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

## ఆగస్టు 6నుంచి 15 వరకు 'మార్పు కోసం'

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ.జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** సీపీఐ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు మార్పు కోసం అనే నినాదంతో దేశ వ్యాప్తంగా ప్రచార, పాదయాత్రలను రాష్ట్రంలోను నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు, 674 మండలాలు, వందలాది గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఆగస్టు 17 నుంచి 27 వరకు పార్టీ అనుబంధ ప్రజాసంఘాలు తమ తమ సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే మహాసభకు రాష్ట్రం నుంచి సుమారు మూడు వేల మందిని సమీకరిస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ చివరి వారంలో కడపలో నాలుగురోజులపాటు సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో.. 2023లో ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణలో సెన్సస్, నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేసిన విధానాన్ని విరమించి, ఎలాంటి షరతులు లేకుండా వెంటనే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలోని 543స్థానాల్లో కనీసం 181 స్థానాలను మహిళలకు కేటాయించాలని కోరారు. ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ, ప్రజా స్వామ్యంపై నిరంకుశ దాడి జరుగుతుందన్నారు, ఉపాకు వ్యతిరేకంగా ఐదు నగరాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బిజెపి అజెండా మోస్తే టీడీపీ రాజకీయ ఉనికికి ప్రమాదమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నంకు వినతి పత్రం అందజేస్తున్న జెఎసి నేతలు

### సమస్యలు పరిష్కరించండి: జెఎసి నేతలు

**కుప్పం,జులై 14 ప్రభాతవార్త:** ఎపిఎస్ ఆర్టీసీ జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు, పెండింగ్ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నంకు ఆర్టీసీ జెఎసి నేతలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను వైస్‌చైర్మన్‌కు వివరించి వాటి పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం స్పందిస్తూ జెఎసి నేతల వినతిని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా జెఎసి కన్వీనర్లు ఉపేంద్ర, బలరాంమూర్తి, రాష్ట్ర సభ్యులు బాబు, శ్రీకర్‌రెడ్డి, కుప్పం డిపో జెఎసి అధ్యక్షుడు మునెప్ప, కార్యదర్శి జయపాల్, నాయకులు కరుణాకరన్, వేలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి



హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి (ఫైల్)

**కర్నూలు అర్బన్, జు లై 14 ప్రభాతవార్త** బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ మీద ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి (41) మృతి చెందారు. ఆయన 2వ బెటాలి యన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఎస్ డి ఆర్ ఎఫ్ ఎంటీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీగా వాకింగ్‌కు వెళ్లే ప్రసాద్ రెడ్డి ఉదయం బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్‌పై నడుస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఫ్లైఓవర్ పై నుంచి కృష్ణనగర్ సర్వీస్ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు, కానిస్టేబుల్ పరమేష్ కలిసి హైవే అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్సకు ముందే ఉదయం 7:48 గంటలకు ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. 21/MAU61-ADMN0STG(OTH)/12/2026, Dt: 14/07/2026
E-PROCUREMENT TENDER NOTICE
Name of Work: APCRDA - "Request for Proposal (RFP) for Selection of Consultant to Provide Comprehensive Multi-layered Third-Party Quality Assurance & Quality Control Services for infrastructure and construction works of development in Amaravati Capital City, Andhra Pradesh, India".
The bid can be downloaded on AP e-procurement portal from 15.07.2026 to 05.08.2026 up to 14.00 Hrs., Due date for submission of Bid is 05.08.2026 up to 15.00 Hrs., Technical bid opening 05.08.2026 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Amaravati

15-7pg4_15-7pg4.qxd 14/Jul/26 11:18 PM Page 1



వార్త

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.

— న- ఐ.జాన్సన్

# సర్ మెలికల కొలికి!


ఓటుహక్కు నవ్వులపాలవుతోంది. గడపగడపకూ, బిఎల్ఒలను పంపి విస్తృత పరిశీలన తర్వాతసమగ్ర ఓటర్ల జాబితా రూపొందించాలన్న 'సర్' లక్ష్యాన్నిఎవరూ కాదనలేం. కానీ దాని లక్ష్యం నెరవేరే స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు ఉండకపోవడం విచిత్రం. రాజ్యాంగానికి ఎన్నో సవరణలు చేసుకున్నప్పుడు మన మెందుకు సవరణ చేసుకోకూడదు అనుకున్నారో ఏమో కానీ సమగ్ర విధాన రూపకల్పన లేకుండా 'సర్' విధానాలున్నాయేమోననే అనుమానాలు జనంలో తలెత్తుతున్నాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ తీరు ఎంతో ఘనంగా సాగుతోందనే ప్రచారం జరుగుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. ఓటరు చేర్పులో వయోజనులు సైతం ఇబ్బందిపడుతున్నారు. ఎందుకంటే ఇంటింటికీ తిరుగుతున్న బిఎల్ఒలు చాలా ఇళ్లలో అంతకుముందున్న ఓటరు అక్కడ ఉన్నారా? లేరా? అనే పరిశీలన తప్పించి చాలా ప్రాంతాల్లో సంబంధిత కొత్త ఓటర్ల చేర్పింపు సజావుగా సాగడం లేదు.ఫలానా చోట ఫలానా వారు లేరనే సమాచారం రాగానే వాళ్ల ఓటు తొలగిస్తున్నారు తప్పితే వారి విషయమై అనంతర ఆచూకీ తీసుకోలేకపోతున్నారు. 'సర్' ప్రక్రియ ఆది నుంచీ వివాదాస్పదంగానే ఉంది. సర్ ప్రక్రియ పట్ల జనం భయభ్రాంతులౌతున్నారు. ఏదో ఎన్నికలప్పుడే ఓటు అనే పరిస్థితి నుంచి ఓటు హక్కు లేకుంటే ఓ సమస్య, రెండు చోట్ల నమోదై ఉంటే ఓ తకరారు. ఇలా సామాన్య ప్రజానీకం ఉలిక్కిపడి ఆందోళనపడుతున్నారు. ఎన్నికలు కొద్ది రోజుల్లో వస్తాయనగా బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఆదరాబాదరా 'సర్' పరిశీలన జరిగిందంటే అది వేరే విషయం. పైగా ఓట్లు అన్యాయంగా ఏరివేత కోసమే ఈ ప్రక్రియ అనో, తీరా తుది జాబితా పూర్తయ్యాక తమఓట్లు గల్లంతయ్యాయని ఆందోళన చెందిన సాధారణ జనం లేకపోలేరు. అంటే 'కొండ నాలికకు మందు వేస్తే ఉన్న నాలుక' పోయిందన్న చందాన ఈ ప్రక్రియసాగుతోంది.తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఇప్పట్లో ఎన్నికలు లేవు. అయినా 'సర్' ప్రక్రియ సజావుగా సాగడం లేదనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. 89శాతంబిఎల్ఒల పరిశీలన పూర్తయిందని చెప్తున్నా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజ్ఞప్తి మేరకు మరో పదిరోజులు పెంచారు.తెలంగాణలో 'సర్'కు సంబంధించిన నిబంధనలేవీ అమలు చేయడం లేదు. ఇంటింటికి మూడుసార్లు సందర్శించాల్సిన బిఎల్ఒలు తమ ప్రాంతానికే రావడం లేదని ఆరోపణలున్నాయి. వాళ్లలా అంటున్నారని కాదు కానీ ఇంత తక్కువ సమయంలో బిఎల్ఒలు ఒకసారే ఫలానా ఏరియాకు వెళ్లలేదనే సమాచారం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన వారెందరో ఉన్నారు. తాజా ప్రక్రియలో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కున్నట్లయితే రెండేళ్ల జైలు శిక్ష తప్పదంటూఎన్నికల కమిషన్ ప్రకటన చేసే సరికి చాలా మంది ఓటర్లకు తమకెక్కడ ఓటుందో తెలుసుకునే సమయం, వీలు చిక్కక వెతుక్కుని ఉండకపోతే వ్యక్తిగతంగా చిక్కుల్లో పడినట్లే కదా! నిరక్షరాస్యులు తమ పనులమీద వేరొకచోటకి వెళ్లి ఉన్నా, అసంఘటిత కార్మికులైన వారి ఓటర్ల పరిశీలన ఎంతో సంక్లిష్టంగా మారుతోంది.ఇలాంటి ఎన్నో అంశాల్లో పరిశీలన తేలకపోతే ఎందరివో ఓట్లు తొలగింపునకు గురయ్యే పరిస్థితిఏర్పడుతుంది. సాధారణంగా కొత్త ఓటర్లను చేరమని, ఇళ్లు మారిన వారి ఓట్లను కొత్త చోట్లకు మార్చుకోమని ఆహ్వానించే ఓటరు చేర్పింపు ప్రక్రియ ఈసారి చాలా సంక్లిష్టంగా మారింది. ఎన్నో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా డబ్లింగ్ ఓటరుల పరిశీలన సర్దుబాటు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు వినియోగంలోకి తెచ్చుకోవడం లేదో అర్థంకాదు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా విశ్వసనీయత అవసరమే. దానికోసం రూపొందించిన 'సర్' ప్రక్రియలో పారదర్శకతను బలోపేతం చేయాల్సిన అవశ్యకత ఉంది. అనర్హులను, నకిలీ నమోదును నిలిపివేసేందుకు తగు మార్పులు చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారాన్నిఅందుకోవడం అవసరం.వలస కార్మికులు,వృద్ధులు, దివ్యాంగులు సైతం కొత్త ఓటరు జాబితాలోకి నమోదయ్యే విషయంలో ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారని సమాచారం. బిఎల్ఒలకు సరైన ప్రామాణిక అవగాహనకల్పించకుండా ఎన్యూమరేషన్‌కు పంపడం వల్లనే ఈ ప్రక్రియ విమర్శలకు గురవుతోంది. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రాజకీయ పార్టీలు ఓటర్ల చేర్పింపు, తొలగింపులతో సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బంది పెట్టే అంశాలపై గొంతెత్తి విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల విశ్వాసాన్ని బలపరిచే ప్రక్రియ పురోగతిలో ఎన్నో అంశాలపై ఎన్నికల సంఘం ఎన్నో మెలికలు పెడుతోందనే అభిప్రాయంవ్యక్తమవుతోంది. వేగంగా పెరుగుతున్న జనాభా,పట్టణీకరణ, వలసలు, డిజిటల్ యుగంలో మారుతున్న నివాస పరిస్థితుల రీత్యా సమగ్ర సవరణలను కాదనలేం. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా మాయాజాలం జరిగిందా అనే అనుమానాలను రేకెత్తించే అంశాలపై ఓటర్ల జాబితా నిర్దేశకులకు స్పష్టత అవసరం. అనేక ప్రాంతాల్లో పత్రాల ధృవీకరణపై ప్రజల్లో అయోమయం ఏర్పడింది. ఇప్పుడీ ప్రక్రియలో ఆధార్ కార్డు, పౌరసత్వ కార్డు,పాత ఓటరు కార్డు, ఇలాంటివన్నీ ఎక్కడో ఓ దేశంలో ఇక్కట్ల పాలు చేస్తాయనే చర్చ బయలుదేరడంతో జనం చివరి క్షణంలో కంగారుపడిన వైనం. ఓటర్ల జాబితా సర్దుబాటు లో రాజకీయ పార్టీలు తాము గాబరా చెంది ఓటర్లను గందర గోళంలో పడేటట్లు చేయడం కన్నా అన్ని విధాలా సహకరిస్తే ఎన్నికల కమిషన్ బాధ్యతలో సమగ్ర జాబితా రూపొందించగలుగుతుంది.

నాయకత్వం అనేది హోదా కాదు ఒక బాధ్యత. ఇక క్రియ, నాలుకకి కళ్లెం వేయగలిగితే శాంతికి భంగం కలుగదు.



జి. ఎలియట్

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

# రాబోయే కులగణన దేశ సమగ్రతకు సవాలు?

**సైంటిఫిక్ కులగణన మన దేశంలో ఇప్పటి వరకూ జరగలేదు. ఇప్పుడు జరగబోయే కులగణన (రెండవ ఫేజ్) రాజకీయాల నేపథ్యంలో జరగబోతున్నదన్న అపప్రద గూడా వుంది! ఫార్వర్డ్ కులాలు ఎన్ని? బాక్వర్డ్ కులాలు ఎన్ని, ఇతర బాక్వర్డ్ కులాలు ఎన్ని? షెడ్యూలు కాస్ట్స్, షెడ్యూల్ ట్రైబ్స్ ఏ లెక్కల్లో ఈనాటి సామాజిక రాజకీయ నేపథ్యంలో చూపించబడుతాయి? పార్వర్డ్ కులాలకు సంబంధించి ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు తేల్చగలుగుతారా? అదే ఆర్థిక అంశం బి.సి, ఓబిసి, షెడ్యూల్డ్ కులాలు, తెగలకూ వర్తిస్తుంది! క్రీమీ లేయర్, సబ్ కాటగరైజేషన్ కులాలు రిజర్వేషన్ల వల్ల లాభాలు పొందుతున్నాయని కొందరు లేవనెత్తుతున్నారు! వాటి మాటేమిటి? అందరికీ ఆమోదయోగ్యంగా వుండే విధంగా ప్రారంభించబోతున్న కులగణన వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కానీ ఈ కులగణన వల్ల దేశం విఛ్ఛిన్నం కాకుండా వుంటే చాలు అదే పదివేలు అని ఈ విషయాల పరిజ్ఞానంలో ఆరితేరిన అనుభవజ్ఞులు ఆశించటంలో తప్పులేదేమో!**



రావులపాటి సీతారాంరావు

భారత దేశంలో సమస్యలు లెక్కపెట్టలేము. ఏళ్ళతరబడి చూరును పట్టుకొని వ్రేలాడుతున్నసమస్యలు ఎన్నో రోజుల తరబడి పెరుగుతున్న సమస్యలు ఎన్నెన్నో! అన్నిటిని తలదన్నేలా రోజుకొక సమస్య మన దేశంలో ఉత్పన్నం కాబడుతున్నదా? ఉత్పన్నమవుతున్నవా? అని ఆలోచించటానికి ప్రభుత్వాలకూ, అధికారులకూ, రాజకీయ నాయకులకూ తీరిక దొరక లేనతంగా సమస్యలు ఎదురవుతున్న మాట వాస్తవం! ఇవ్వన్నీ అంటే పాత సమస్యలతో పాటు పుట్టుకొస్తున్న కొత్త సమస్యలకు తోడుగా సమస్యలు తక్కువవుతున్నట్టుగా సామాజిక ఉద్యమకారులూ, రాజకీయ వేత్తలూ, ప్రభుత్వాలు కొన్నాళ్ళు జనాభాను లెక్కించాలి 'సర్' అంటారు మరికొన్నాళ్ళు ఓటర్ల నిగ్గు తేల్చాలి 'సర్' అంటారు! కులాల, మతాల, ప్రాంతాల సమస్యలకు తోడు పరస్పరం పోరాడుకొనేట్లు 'రాముడేం చేసాడు? చాతగాక అడవుల్లోకి పోయాడు' అని ఆ రాముని పుట్టు పూర్వోత్తరాలతో సంబంధం లేని వ్యక్తులు మాట్లాడుతే మాట్లాడకు! మా రాముడు దేవుడు కళ్ళు పోతాయి. మా మతాన్ని రాముని పేరు పెట్టి ద్వేషిస్తున్నావా?' అని మరొకరు మాట్లాడుతూ చినికి చినికి గాలివాన అయిన తీరులో అసహజమైన పోట్లాటలను ప్రోత్సహించటం మొదలు పెట్టారు! ఎంత విషాదకరం? అభివృద్ధి సాధిస్తున్న దేశానికి 'స్పీడ్ బ్రేకర్స్' వేసే పనిలో కొందరు ఉండటం ఎంత దురదృష్టకరం! ఈ నేపథ్యంలో 2027 జులై 6 నుండి సెన్సెసు 2027 సెకండ్ ఫేజ్ రిహార్సల్స్ ప్రారంభం కాబోతున్నది! ఈ ప్రక్రియ ప్రకంపనలు సృష్టిస్తుందా లేకపోతే సాదా సీదాగా గడిచిపోతుందా అని స్వాతంత్ర్యం తర్వాత మన దేశ చరిత్ర స్థితి గతులను అధ్యయనం చేస్తున్న విజ్ఞానులు ఎదురు చూస్తున్నారు! ఈ కార్యక్రమం దేశ మంతటా యూనియన్ టెరిటరీతో సహా మొదలు కాబోతున్నది! ఈ రెండవ 'సర్' ముఖ్యాంశంగా ఒక 'ఓపెన్ కాలం' ఎన్యూమరేషన్లో పాల్గొనే వారు పూరించాలి! నీ కులం ఏమిటి అన్న విషయం నీవు చెబుతే ఆ 'కాలం' ద్వారా రికార్డుల్లోకి ఎక్కుతుంది. 2011లో జరిగిన సోషియో ఎకనామిక్, కాస్ట్ సెన్సెస్ (ఎస్.ఇ.సి.సి)కు ఈ కాలం వున్నా, చట్టం ఊతంగా లేదు. ఇప్పుడు జరగబోయే 'కాస్ట్' సెన్సెస్ (కుల గణన) చట్ట ప్రకారం జరుగుతున్నట్లుగా పరిగణించబడుతుంది. 2011 సెన్సెసుకు 2027 సెన్సెస్కు వున్న ముఖ్యమైన తేడాతో కూడిన కీలకాంశం చట్టం! 2027 కులగణన వెనక చట్టం వుంది! జులై 20కి సెన్సెసు ప్రక్రియ పూర్తవుతుంది. అటు తర్వాత కులగణన



లెక్కలు ప్రభుత్వం తేలుస్తుంది. 2011 కులగణనలో లెక్కకు మించిన కులాలు లెక్కలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ కులగణన ఆచరణ యోగ్యంగా కనపడ లేదు! దానికి కారణం 1931 సెన్సెస్లో కేవలం 4,147 కులాల పేర్లు లెక్కల్లో తేలుతే, 2011 ఎస్.ఇ.సి.సి ప్రకారం 46 లక్షల కులాల పేర్లు పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది! ఆ లెక్కలు పనికి రాకుండా పోవటానికి కారణం ఇంటి పేర్లు ఉపకులాలు, తెగల పేర్లు గూడా కులాల పేర్ల మీద వచ్చి పడ్డాయి! అందుకనే కేంద్రం సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్న ఒక ఉదంతంలో ఈ సెన్సెస్ లెక్కలు తేలేవిగా లేవు, తప్పుల తడకగా మారాయి అని చెప్పక తప్పలేదు! అందుకనే ఈసారి తప్పులు లేని కులగణన చేయగలుగుతేనే ఆ రికార్డుకు హేతుబద్ధత వచ్చినట్లవుతుంది! 2023లో జరిగిన బీహార్ రాష్ట్ర కులాల సర్వే ఒక విధంగా తప్పులు లేని రికార్డును పొందుపర్చగలిగింది! దానికి కారణం ఎన్యూమరేటర్స్ సహనంతో ఎన్యూమరేట్ చేయబడ్తున్న వ్యక్తిది ఏ కులమేమిటో క్షుణ్ణంగా తెల్చుకున్న తర్వాతనే లెక్కలోకి తీసుకోవటం వల్ల అది సాధ్యపడిందని కొందరు అభిప్రాయపడ్డారు! జరగబోయే కులగణనకు పూల్ ప్రూఫ్ మెథడ్స్ అవసరమని అందరూ చెప్తున్నారు కానీ మెథడ్స్ ఏమిటో ఏ పద్ధతులలో కుల నిర్ధారణ చేయాల్నో ప్రభుత్వాలూ, అధికారులూ అర్థం కాని పరిస్థితిలోనే వున్నారు! నిజం మాట్లాడితే స్వాతంత్ర్యం మునుపు అనేక కారణాల వల్ల ఉదాహరణకు సామాజికంగా కులాలు అన్నీ అందరికీ తెలియకపోవటం, కొండల్లో నివసించే వారికి, ట్రైబ్‌లకూ కులాల అవగాహన లేకపోవటంతో, తెలిసిన కులాల వారి లెక్కలే చెలామణిలో వుండేవి! నాలుగు వర్ణాల విభజన మంచికో చెడుకో కుల విభజన లెక్కల్లో పెద్ద పీటను అలంకరింప చేసి నోరెత్తనీయని రీతిలో అప్పటి పెత్తందార్లు, పెద్దలూ సమర్థించటం వల్ల,1931 సెన్సెస్లో కేవలం 4,149 కులాలు మాత్రమే గుర్తించబడాయి! లిట్రసీ రేటు పెరగటం వల్ల 2011 నాటికి ఆ లెక్క మారి 46 లక్షల్లోకి వాయు వేగంతో చేరుకుంది! సైంటిఫిక్ కులగణన మన దేశంలో ఇప్పటి వరకూ జరగలేదు.ఇప్పుడు జరగబోయే కులగణన (రెండవ ఫేజ్) రాజకీయాల నేపథ్యంలో జరగబోతున్నదన్న అపప్రద గూడా వుంది! ఫార్వర్డ్ కులాలు ఎన్ని? బాక్వర్డ్ కులాలు ఎన్ని ఇతర బాక్వర్డ్ కులాలు ఎన్ని? షెడ్యూలు కాస్ట్స్, షెడ్యూల్ ట్రైబ్స్ ఏ లెక్కల్లో ఈనాటి సామాజిక రాజకీయ నేపథ్యంలో చూపించబడుతాయి? పార్వర్డ్ కులాలకు సంబంధించి ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు తేల్చగలుగుతారా? అదే ఆర్థిక అంశం బి.సి ఓబిసి షెడ్యూల్డ్ కులాలు, తెగలకూ వర్తిస్తుంది! క్రీమీ లేయర్, సబ్ కాటగరైజేషన్ కులాలు రిజర్వేషన్ల వల్ల లాభాలు పొందుతున్నాయని కొందరు లేవనెత్తుతున్నారు! వాటి మాటేమిటి? అందరికీ ఆమోదయోగ్యంగా వుండే విధంగా ప్రారంభించబోతున్న కులగణన వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కానీ ఈ కులగణన వల్ల దేశం విచ్ఛిన్నం కాకుండా వుంటే చాలు అదే పదివేలు అని ఈ విషయాల పరిజ్ఞానంలో ఆరితేరిన అనుభవజ్ఞులు ఆశించటంలో తప్పులేదేమో! ●

# పేదవాడి పొట్టను కొడుతున్న ప్రపంచ పరిణామాలు

పి.వి.వి.సత్యనారాయణ

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ భూగోళం పై ఏ చిన్న పరిణామం సంభవించినా, దాని ప్రభావం మొత్తం దాదాపు 850 కోట్ల మానవులపై ఉంటుంది అంటే అతిశయోక్తి కాదు. ప్రకృతి కన్నెర్ర చేసినా, ఆధిపత్య పోరులో సామ్రాజ్యవాద దాడులైనా, కల్తీలైన సామాన్య మానవుల జీవితాలపై పెను ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా పేద మధ్యతరగతి ఆ మాటకు వస్తే, సబ్ సహారా, ఆసియా, ఆఫ్రికా ఖండ ప్రజల జీవితాలు అల్లకల్లోలం అవుతున్నాయి.ముఖ్యంగా 1991 తరువాత సరళీకృత ఆర్థిక విధానాలు, సోవియట్ యూనియన్ విడిపోవడం, ప్రపంచీకరణ నేపథ్యంలో అనేకరంగాల్లో గణనీయంగా మార్పులు చోటుచేసుకున్నాయి. దీనికి తోడు వరదలు, భూకంపాలు, సునామీలు, అగ్ని ప్రమాదాలు, తరచూ యుద్ధాలు, కోవిడ్ విలయతాండవం మొత్తం ప్రపంచాన్ని ఏ సమయానికి ఏ వైపుకు నెడుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. 1990 వరకూ సోవియట్ యూనియన్ (రష్యా) బలంగా ఒకవైపు, మరోవైపు అమెరికా ఒకదానికి ధీటుగా మరొకరు ఉండటం వల్ల దాదాపు ప్రపంచ దేశాలు సమన్వయం చేసుకుంటూ సామరస్యంగా సాగింది.ఎప్పుడైతే రష్యా తన ప్రభావాన్ని కోల్పోయిందో, ఇక తిరుగులేని శక్తిగా అమెరికా ఆవిర్భవించింది.గతంలో ఇరాక్, లిబియా వంటి దేశాలను, తాజాగా వెనుజులా, నేడు ఇరాన్ పై సామ్రాజ్యవాద ఆధిపత్యం ధోరణితో దాడులు, యుద్ధాలు చేస్తూ మొత్తం ప్రపంచాన్ని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేద మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతూ,జీవితాలను చిందరవందరగా చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడుగా రెండొవ సారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే భావనతో మొత్తం ప్రపంచ దేశాలపై'ట్రేడ్ వార్' కు శ్రీకారం చుట్టాడు. తనకు నచ్చిన విధంగా ప్రతీకార సుంకాలు విధిస్తూ ప్రపంచ దేశాలపై అప్రకటిత వాణిజ్య యుద్ధానికి సిద్ధ పడటం వల్ల దాదాపు అన్ని దేశాలు అమెరికాకు దూరం జరిగాయి.చివరికి చిన్న చితకా దేశాలైన కొలంబియా, మెక్సికో వంటి దేశాలు ట్రంప్ విధానాల పట్ల నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.మన దేశం అలీన విధానం విడనాడటం, ట్రంప్ తో సన్నిహితంగా ఉండటం వల్ల పెను సవాళ్లను ఎదుర్కోవడం జరుగుతుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, పర్యావరణ పరిరక్షణ వేదికలు నుంచి అమెరికా బయటకు పోవడం కూడా మొత్తం ప్రపంచాన్ని నివ్వెరపోయేటట్లు చేసింది. దీంతో నిధులు లేక పేద మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా ఆఫ్రికన్ దేశాలు ఆహార కొరత,ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు అందక బహు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. ఇక అమెరికా, ఇజ్రాయెల్ జోడిగా ఇరాన్, లెబనాన్ పై చేస్తున్న యుద్ధం పరాకాష్టకు చేరడంతో మొత్తం ఆ యుద్ధ తీవ్రత మన ఇంటికి, పరిశ్రమలకు, ఎరువులు, మందులు ఫార్మా రంగంతోపాటు మందుబాబులు (మద్యం) గుండెల్లో గుబులు రేపుతోంది. తిరిగి మరల పుల్లల పొయ్యిలు, బొగ్గులు పొయ్యిలు బయటికి తీసి బ్రతుకులు గడిపే సమయం ఆసన్నమైంది. పేద, మధ్య తరగతి ప్రజలు దాచుకున్న సొమ్ములు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులు హుష్ కాకి అవుతున్న పరిస్థితి. అధికధరలు, ద్రవ్యోల్బణం,నిరుద్యోగం, పేదరికం,గాలిలో కలిసిపోతున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవి అన్నీ సామాన్య ప్రజల జీవితాల్లో చీకటి నింపుతున్నాయి. దీనికి తోడు ఆరోగ్య సమస్యలు, వాతావరణ కాలుష్యం చుట్టుముట్టుతున్నది. అక్రమ దందాలు, కల్తీలు, బ్లాక్ మార్కెట్ స్వైరవిహారం చేస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఒకటై, సామ్రాజ్యవాద ఆధిపత్య ధోరణితో వెళుతున్న అమెరికా వంటి దేశానికి ప్రజాస్వామ్య పద్ధతిలోనే గుణపాఠం చెప్పాలి.మనలాంటి దేశాలు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని 'విశ్వగురు' పాత్ర పోషించాలి. ఉత్సవ విగ్రహంగా మారుతున్న ఐక్యరాజ్యసమితికి పునర్జీవం పోయాలి. ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా ఏదో ఒక విషయంలో మరో దేశంపై ఆధారపడి ఉంటుంది అనే వాస్తవాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ఆధిపత్య దేశాలకు తెలియజేయాలి. ఎక్కడో అంతరిక్షంలో మానవ ఉనికికోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ఈదేశాలు,అసలు భూమ్మీద కళ్ళముందు కదలాడే మానవ జాతి నిర్మూలనకు, పసి పిల్లలు ప్రాణాలు సైతం యుద్ధాలు పేరుతో చంపివేయడం ఏరకమైన అభివృద్ధో ఈ అభివృద్ధి చెందిన దేశాలు ఇకనైనాఆలోచన చేయాలి. ●

# ప్రజావాక్కు

### కర్ణాటకరాష్ట్ర మంత్రులను ఆదర్శంగా తీసుకోవాలి

నిన్న కర్ణాటక రవాణా మంత్రి బైరతి సురేష్ సాధారణ ప్రయాణికుని మాదిరి,మూతికి మాస్క్ పెట్టుకొని ప్రయాణికుల కష్టాలనుస్వయంగా ఎదుర్కొన్నారు.బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు కలిగించే ఇబ్బందులను స్వయంగా పరిశీలించేందుకు మారువేషంలో రాగా, చిల్లర లేకపోతే దిగిపో అని కండక్టర్ మంత్రినీ అనడం విశేషం. పూర్వం రాజులు ఇలా మారువేషాలతో రాత్రిళ్ళు తిరుగుతూ దొంగలను కనిపెట్టడం, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేవారు.పాలకులు అలాఉండాలి.గతంలో కర్ణాటకలోనే ఒక మంత్రి దెయ్యాలు లేవని నిరూపించేందుకు, ఒక్కడే అర్ధరాత్రి స్మశానంలో పడుకున్నాడు. అలా ఉండాలి పాలకులు. మనరాష్ట్రంలో కూడా మంత్రులు ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు,అధికారులు ఏరకంగా పనిచేస్తుంది, లంచాలు ఏరకంగా అడుగుతుంది, పనులు ఆలస్యం కావటానికి కారణాలను తెలుసుకునేందుకు ఇలా మారువేషాలతో తిరగాలి.అపుడే ప్రజల మన్ననలు పొందుతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### డంపింగ్ యార్డ్ జీవో రద్దు చేయాలి

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కొరకు విడుదల చేసిన జీఓవెంటనే రద్దు చేయాలి. పచ్చని పొలాల మధ్య చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉంది. భవిష్యత్ పిల్లల జీవితం గురించి ఆలోచించి డంపింగ్ యార్డ్ జీవో వెంటనే రద్దుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి. ప్రజల ఆరోగ్యపరిస్థితులను లెక్కలోకి తీసుకునే నిర్ణయాలు చేయాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈ మధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. యువకుల సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు,సామాజిక స్థితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది.ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి. వృద్ధుల కంటే యువకుల సంఖ్యను పెంచాలి.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలి

ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో 2026-2027 విద్యా సంవత్సరంప్రారంభం నుండి పేరెంట్స్ కమిటీ సమావేశాలు ప్రతినెల క్రమం తప్పకుండా నిర్వ హించాలి. పిల్లల క్రమశిక్షణ, గురువులను గౌరవించే విధానం చర్చించాలి. పరిసరాల శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగడానికి మంచి నీరు సరఫరా చేయాలి. విద్యార్థులకు సెల్‌ఫోన్ వాడకం నిషేధించాలి. హెయిర్ కటింగ్ చిన్నగా శుభ్రంగా ఉండాలి. తరగతి గదిలో చక్కగా కూర్చోవడం. ప్రతిరోజు పాఠాలు వినే విధంగా చూడాలి. విద్యార్థుల హాజరు శాతం తప్పకుండా ఉండాలి.క్లాసులలో నిద్రపోవడం వద్దు.ప్రతినెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### కృత్రిమమేధ అవసరమే..

ప్రపంచ సాంకేతిక రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు వినియోగం అనివార్యంగా మారింది. భారతదేశం ప్రపంచ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను విస్తృత స్థాయిలో స్వీకరించడం అవసరం. అలాగే ఈ కొత్త సాంకేతికతకు అనుగుణంగా మానవవనరులను నైపుణ్యాలతో తీర్చిదిద్దడం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. కొంతమంది భావిస్తున్నట్లుగా కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ముప్పు కాదు. వాస్తవానికి అది ఉత్పాదకతను పెంచే శక్తివంతమైన సాధనంగా నిలుస్తోంది. క్లిష్టమైన సమస్యలను వేగంగా పరిష్కరించడం, కొత్త ఆవిష్కరణలకు దారితీయడం, పనితీరును మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా సంస్థలు తమ వ్యాపార వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సును విస్తృతంగా అనుసంధానిస్తున్నాయి.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెల నెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో,కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలాలేదు అన్నట్లుగా ఉంది ఉద్యోగులపనితీరు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు అందరూ నడుం బిగించాలి.

-ఎన్. మధు, నంద్యాలజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఉచిత విద్యా పథకంతో ఒడిశా కొత్త ఒరవడి



యేచన్ చంద్ర శేఖర్

రెండువేల ఇరవై ఆరు నాటికి, భారతదేశ జాతీయ సగటు అక్షరాస్యత రేటు దాదాపు 80.90 శాతంగా ఉంది. కాగా 98.20 శాతంతో మిజోరాం దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 72.60 శాతం, బీహార్ 74.30శాతం, మధ్యప్రదేశ్ 75.20 శాతాలతో అత్యల్ప సగటులను నమోదు చేశాయి. విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన 'ఉల్లాస్' కార్యక్రమం, 95 శాతం అక్షరాస్యత స్థాయిని దాటిన ఏ రాష్ట్రానైనా 'సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రం'గా గుర్తిస్తున్న నేపథ్యంలో మిజోరాం 98.20, లక్షద్వీప్ 97.30, కేరళ 95.30, త్రిపుర 93.70, గోవా 93.60 శాతం ఈ స్థాయిని సాధించాయి. త్రిపుర, గోవా 2026 అంచనాల ప్రకారం పూర్తి అక్షరాస్యత ప్రమాణాన్ని అధిగమించాయి. మిజోరం అధికారికంగా చారిత్రాత్మక 98.20 శాతం అక్షరాస్యత రేటును సాధించి, భారతదేశంలో మొట్టమొదటి పూర్తి అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా నిలిచింది. గతంలో అగ్రగామిగా ఉన్న కేరళ వంటి రాష్ట్రాలను కూడా వెనక్కి నెట్టి ఇది ప్రస్తుతం జాతీయ అక్షరాస్యత ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. విద్యను తరచుగా జీవితాలను మార్చే అత్యంత శక్తివంతమైన సాధనంగా అభివర్ణిస్తారు. అందుకే దీనిని రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఒడిశా ప్రభుత్వం కిండర్ గార్టెన్ (కెజి) నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) స్థాయి వరకు ఉచిత విద్యను అందించే 'జ్ఞానోదయ -శిక్షయ రు సమృద్ధి' పథకాన్ని ప్రారంభించింది. ఉచిత కెజి టు పిజి పథకాన్ని 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచినప్పటికీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం టిఆర్ఎస్ (ప్రస్తుతం బిఆర్ఎస్) ప్రభుత్వం దానిని అమలుపరచలేదు. దేశవ్యాప్తంగా అక్షరాస్యతా ర్యాంకింగ్‌లో 26వ స్థానంలో ఉన్న ఒడిశా రాష్ట్రం అక్షరాస్యత రేటు సుమారు 79 శాతం కాగా 6 సంవత్సరాల లోపు పిల్లలను మినహాయిస్తే వయోజనులు, యువత అక్షరాస్యత రేటు సుమారు 82.87 శాతంగా ఉంటుంది. అక్షరాస్యతా శాతాన్ని మరింత మెరుగుపరిచేందుకు, ఒడిశా 'ఉల్లాస్' విద్యార్థుల కోసం కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య వంటి పథకాలను అమలు చేస్తోంది. అక్షరాస్యత విషయంలో ఒడిశా రాష్ట్రం గణనీయమైన లింగ, ప్రాంతీయ అసమానతలను ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో మహిళా అక్షరాస్యత 64 శాతం,గిరిజన అక్షరాస్యత ఆందోళనకరంగా 52.24 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యతా శాతం 85.57 శాతానికి చేరుకోగా,గ్రామీణ ప్రాంతాల్లో అది సగటున 70.22 శాతంగా ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల అక్షరాస్యత రేటు కంటే రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ ఉన్న ఖోర్ధా జిల్లాలో అక్షరాస్యత రేటు అత్యధికంగా 86.88 శాతం ఉంది. ఈ నేపథ్యంలో, సమ్మిళిత, అందుబాటులో ఉండే విద్య దిశగా భారతదేశం సాగిస్తున్న ప్రయాణంలో భాగంగా ఒడిశా ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవ ఒక ముఖ్యమైన మైలురాయి అని విద్యావేత్తలు, విద్యార్థులు, విధాన రూపకర్తలు ప్రశంసిస్తున్నారు. ఒడిశా ప్రభుత్వం, కిండర్ గార్టెన్ (కెజి) నుండి పోస్ట్ గ్రాడ్యు



యేషన్ (పిజి)వరకు భారతదేశపు మొట్టమొదటి సార్వత్రిక ఉచిత విద్యా వ్యవస్థను అమలు చేస్తూ, జ్ఞానోదయ - శిక్షారు సమృద్ధి' పథకాన్ని ప్రారంభించింది. 2026-27 విద్యా సంవత్సరం నుండి అమల్లోకి వచ్చిన ఈ పథకం,ప్రభుత్వ, ప్రభుత్వసహాయక సంస్థలలోని విద్యార్థులందరికీ ప్రవేశ, ట్యూషన్ ఫీజులను మాఫీ చేస్తుంది. ఈ ఫీజు మాఫీ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలలు,ప్రభుత్వ సహాయక కళాశాలలలోని రెగ్యులర్ విధానంలోని తరగతులతో పాటు యుజి, పిజి కోర్సులకు కూడా వర్తిస్తుంది. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసం కొనసాగించేందుకు నిర్దేశించిన ఈ పథకం ద్వారా ఏటా 32 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతారని ఒక అంచనా. ఈ పథకం అమలు కోసం ఒడిశా ప్రభుత్వం మొదటి సంవత్సరానికి రూ.895.57 కోట్లు, వచ్చే ఐదేళ్ల కోసం రూ. 5,467.55 కోట్లు కేటాయించింది. అదనంగా, ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలలను, నాలుగు కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారంభించడంతో పాటువచ్చే మూడేళ్లలో 45,000 మంది ఉపాధ్యాయులను నియమిస్తోంది. ఈ పథకం ప్రకటన వెలువడిన తరువాత, ప్రభుత్వేతర సహాయక కళాశాలలు ఆందోళన వెలిబుచ్చాయి. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలైతే, ఫీజుల రూపంలో తాము ఆర్జించే ఆదాయం కోల్పోతామని, ఈ ఆదాయమే మౌలిక సదుపాయాలు,ఉపాధ్యాయుల ప్రత్యక్ష జీతాల కోసం వెచ్చిస్తామని, అకస్మాత్తుగా అది కోల్పోతే తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తమకుఫీజు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశాయి. విద్యను తరచుగా జీవితాలను మార్చే అత్యంత శక్తివంతమైన సాధనంగా అభివర్ణిస్తారు. అందుకే దీనిని రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఒడిశా ప్రభుత్వం కెజి నుండి పిజి స్థాయి వరకు ఉచిత విద్యను అందించేందుకు ఈనిర్ణయం తీసుకుంది. ఈ సాహసోపేతమైన చొరవ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు పెరుగుతున్న విద్యా ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు స్వాంతననిస్తుంది. ఈ కార్యక్రమం కింద, ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రాథమిక పాఠశాల విద్య నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ట్యూషన్ ఫీజులు చెల్లించకుండా విద్యనభ్యసించవచ్చు. విద్యాభ్యాసం కోసం ఆర్థిక అడ్డంకులను తగ్గించడం, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, చదువు మానేసే వారి సంఖ్యను తగ్గించడం,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం, రాష్ట్రవ్యాప్తంగా అక్షరాస్యత,నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు.ఇది విజయవంతమైతే, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఇకపై తమ ఆర్థిక స్థితిగతులపై ఎటువంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా విద్యార్జనపైదృష్టి సారించి వృత్తిపరమైన అభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది. అక్షరాస్యత అనేది సమాజాభివృద్ధికి మూలాధారం. ఇది ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఆరోగ్య గణాంకాలు, లింగసమానతలు, రాజకీయ అవగాహన లాంటి అంశాలలో అత్యవసరం.ప్రజలలో అక్షరాస్యతను పెంపొం దించడంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధిం చింది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలు, కొన్ని నిర్దిష్ట రాష్ట్రాలలో ఇప్పటికీ అనేక సవాళ్లు ఉన్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు ఒడిశా ప్రభుత్వం చేపట్టిన ఈచొరవను ఆదర్శంగా తీసుకుని సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు లేకుండా అన్ని వర్గాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యావకాశాలను కల్పించాలి. ఓటు బ్యాంకు సంక్షేమ పథకాలను సమీక్షి ంచి, హేతుబద్ధత లేని వాటిని అవసరమైతే రద్దుచేసి భావి పౌరు లను తీర్చిదిద్ది భవ్య భారతదేశానికి పునాదులు వేసే ఈ పథకానికి

ong-5_ong-5.qxd 7/14/2026 11:22 PM Page 1



## కరవదిలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




ఒంగోలు మండలం కరవది గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు సంబంధిత శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే, పంచాయతీరాజ్, రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యుత్ శాఖ అధికారులు, ఎంఆర్వో, ఎండీవో, ఏఈలతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయా శాఖల అధికారులకు అక్కడికక్కడే పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రైల్వే అండర్‌పాస్ నిర్మాణానికి తొలుత ప్రతిపాదించిన 3.5 మీటర్ల ఎత్తు భారీ వాహనాలకు అనుకూలంగా ఉండదని పేర్కొంటూ దానిని 4.5 మీటర్లకు పెంచాలని సూచించారు. 7.5 మీటర్ల వెడల్పుతో అండర్‌పాస్ నిర్మించి ఏడు నుంచి ఎనిమిది నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు గ్రామస్తులు, ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా పైపులు వేయాలని అధికారులను ఆదేశించారు. కరవది ప్రధాన రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు లభించాయని, దాని పనులు పూర్తవడానికి సుమారు ఒకటిన్నర నుంచి రెండేళ్ల సమయం పడుతుందని తెలిపారు. నాలుగో రైల్వే లైన్‌తో పాటు ఈ ప్రాజెక్టుల కోసం రైల్వే శాఖ సుమారు రూ.100 కోట్లు వెచ్చిస్తోందని వెల్లడించారు. గ్రామంలో తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా స్పందించిన ఎమ్మెల్యే, 30 ఏళ్ల నాటి పైపులైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. 52 గ్రామాలకు శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.16 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రస్తుతం ఉన్న 4 అంగుళాల పైపులైన్ స్థానంలో 6 అంగుళాల పైపులైన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో బావి కూలిన సమయంలో మూడు రోజుల్లో ప్రత్యామ్నాయ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరించిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామంలో శ్మశానవాటిక కోసం ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి కేటాయించాలని ఎంఆర్వో, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే శ్మశానానికి మెటల్ రోడ్డు, కల్వర్టు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. రాత్రివేళ ప్రజలు, ఆటో డ్రైవర్లు సురక్షితంగా ప్రయాణించేలా విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గత రెండేళ్లలో గ్రామంలోని మూడు వీధుల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనులు, కల్వర్టులు నిర్మించినట్లు తెలిపారు. గ్రామ సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించాలనే ఉద్దేశంతో అన్ని శాఖల అధికారులను క్షేత్రస్థాయికి తీసుకువచ్చామని ఎమ్మెల్యే పేర్కొంటూ, ప్రజలకు శాశ్వత పరిష్కారాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## క్షుద్ర పూజల మాయలో దివ్యాంగ బాలుడి బలి..

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ఒంగోలు నగరంలోని గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో క్షుద్ర పూజల పేరుతో ఆర్నెళ్ల వికలాంగ బాలుడు మృతి చెందిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఒంగోలుకు చెందిన కిరణ్, లత దంపతుల కుమారుడు రుత్విక్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతుండగా, నెల్లూరు జిల్లా కొడవలూరుకు







చెందిన మొబీనా అనే మహిళ తాను మంత్ర విద్యల ద్వారా బాలుడి వైకల్యాన్ని నయం చేస్తానని తల్లిదండ్రులను నమ్మించినట్లు సమాచారం. ఆమె సూచనల మేరకు కుటుంబ సభ్యులు నెలన్నర క్రితం గోపాల్ నగర్ ఎక్స్టెన్షన్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రారంభించారు. చికిత్స పేరుతో బాలుడిని తాళ్లతో కట్టేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసినట్లు, ఛార్జింగ్ వైర్‌తో కొట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాలుడి అరుపులు బయటకు వినిపించకుండా పెద్ద శబ్దంతో అమ్మవారి పాటలు పెట్టేవారని స్థానికులు తెలిపారు. ఇంట్లో రక్తపు చేతి ముద్రలు, వింత ఆకారాలు, విగ్రహాలు, వేపాకులు, తాయెత్తులు, పగిలిన గాజులు, పూజా సామగ్రి లభించడంతో క్షుద్ర పూజలు నిర్వహించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడు రోజుల క్రితమే బాలుడు మృతి చెందినప్పటికీ, తిరిగి బతికిస్తానని మొబీనా కుటుంబ సభ్యులను నమ్మించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలి పాత్రతో పాటు ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం బాలుడి మరణానికి గల ఖచ్చితమైన కారణాలను నిర్ధారించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాలు, క్షుద్ర పూజల పేరుతో అమాయక చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. అనారోగ్య సమస్యలకు శాస్త్రీయ వైద్య చికిత్సనే ఆశ్రయించాలని, మంత్రాలు, క్షుద్ర పూజల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తులను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గ్రంథాలయ సెస్ బకాయిలు వెంటనే జమ చేయాలి: జెసి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు సకాలంలో అందేలా గ్రంథాలయ సెస్ బకాయిలను వెంటనే జమ చేసి గ్రంథాలయాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సెస్ అభివృద్ధి సమావేశంలో గ్రంథాలయ సెస్ వసూళ్లు, పెండింగ్ బకాయిలు, నిధుల జమ ప్రక్రియ, వసూళ్ల పురోగతిపై విస్తృతంగా సమీక్షించారు. గ్రంథాలయ సెస్ రూపంలో రావలసిన బకాయిలను సంబంధిత స్థానిక సంస్థలు, శాఖలు ఆలస్యం చేయకుండా త్వరితగతిన జమ చేయాలని సూచించారు. గ్రంథాలయాలకు నిధులు సకాలంలో అందితే పాఠకులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు కొత్త పుస్తకాల కొనుగోలు, డిజిటల్ గ్రంథాలయ సేవల విస్తరణ, భవనాల నిర్వహణ, మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులు మరియు పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి స్థానిక సంస్థ గ్రంథాలయ సెస్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా నిధులను జమ చేయాలని, భవిష్యత్తులో బకాయిలు పేరుకుపోకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. గ్రంథాలయాల అభివృద్ధి విద్యా వికాసానికి కీలకమని, ఈ విషయంలో అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, ఏపీఐఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. సుధాకర్ రావు కన్వీనర్‌గా వ్యవహరించి గ్రంథాలయ సెస్ వసూళ్లు, బకాయిలు, నిధుల జమకు సంబంధించిన వివరాలను సభ్యులకు వివరించారు. సమావేశంలో అధికారులు తమ శాఖల పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

## పరిశ్రమలకు రూ.13.43 కోట్ల ప్రోత్సాహకాలు మంజూరు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమివ్వాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పాంశన్ అండ్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని పరిశ్రమలకు సంబంధించిన వివిధ రకాల రాయితీల కోసం అందిన 44 క్లెయిమ్‌లను పరిశీలించి మొత్తం రూ.13.43 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డీఆర్‌డీఏ, ఎంఈపీఎంఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక పారిశ్రామికవేత్త తయారయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల అనుమతుల కోసం అందిన దరఖాస్తులను నిర్ణీత గడువు వరకు వేచి ఉండకుండా వేగంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 22న నిర్వహించిన బిజినెస్ ఎలైట్ మీట్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సమర్పించిన పెట్టుబడి ప్రతిపాదనలను ప్రాధాన్యతతో అమలు చేయాలని, పరిశ్రమల స్థాపన, అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఏపీలో సర్ గడువు తేదీ పొడిగింపు.. ఈసీఐ ఆదేశాలు జారీ

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(ఎస్ఐఆర్) షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) సవరించింది. సర్ గడువును ఈనెల 24వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2026జులై 1ను అర్హత తేదీగా నిర్ణయించి సవరణ పక్రియను కొనసాగించనున్నట్లు వెల్లడించింది. సవరించిన షెడ్యూల్‌ను రాష్ట్రంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం జున్ 15నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు(బీఎల్ఓలు) ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను(డ్రాఫ్ట్) ప్రచురించనున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత జులై 31 నుంచి ఆగష్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అనంతరం అక్టోబర్ 3, 2026న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రచురించనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణలు వంటి పక్రియలు నిర్ధేశిత గడువులో పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# ఆస్తికోసం.. ఐదుగురిని చిదిమేసిన దురాశ..

- ఆస్తి కోసం బావను కడచేర్చి..ఓ నిందితుడు కుటుంబంతో కలిసి ఆత్మహత్య
- కలకలం రేపిన శ్రీహరి హత్య కేసులోని ప్రధాన నిందితుడు హరికృష్ణ కుటుంబం ఆత్మహత్య

**ఒంగోలు, ప్రభాతవార్త ప్రతినిధి**

ఆస్తి కోసం దురాశతో సొంత బావనే కడతేర్చి.. కేసులో ఇరుక్కొని మనస్థాపంతో కుటుంబంతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన వ్యవసాయ అధికారి శ్రీహరి హత్య కేసులోని ప్రధాన నిందితుడు హరికృష్ణ దుర్ఘటన ఇది.. వివరాల్లోకెళ్తే .. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం వ్యవసాయ అధికారి శ్రీహరి, నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం ఆర్. వి కండ్రిక కు చెందిన స్వయాన బావమరిది హరికృష్ణ లు కలిసి భూములు కొనుగోలు చేశారు. ఇరువురు కొనుగోలు చేసిన భూములకు ధరలు విపరీతంగా పెరిగాయి. ఉమ్మడిగా కొనుగోలు చేసిన భూములను అమ్ము అమ్ముకోవాలని ఆలోచనను వ్యవసాయ అధికారి శ్రీహరి హరికృష్ణ కు చెప్పారు.. అప్పటికే ఆస్తిపై కన్నేసిన హరికృష్ణ తీర్థయాత్ర పేరుతో శ్రీహరిని తీసుకువెళ్లాడు.. పథకం ప్రకారం ఇరువురు వ్యక్తులతో వ్యక్తులతో కలిసి వ్యవసాయ అధికారి శ్రీహరిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఆ నోట ఈ నోట పడి శ్రీహరి హత్యకు గురయ్యారన్న అనుమానం రావడంతో శ్రీహరి మొదటి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదటి భార్యకు సంతానం కలగకపోవడంతో స్వయాన అక్క కూతురు, హరికృష్ణ సోదరిని వ్యవసాయ అధికారి శ్రీహరి రెండో వివాహం చేసుకున్నారు. ఈమెకు ఇరువురు సంతానం కలిగింది. దీంతో బావ, బామ్మర్దులు ఇరువురు వ్యాపారాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి కావడంతో కొనుగోలు చేసిన ఆస్తులకు బినామీగా శ్రీహరి హరికృష్ణ పేరుతో రిజిస్టర్ చేయించారు. భూములను అమ్మివేసి సొంత భవనం నిర్మించుకోవాలన్న కోరికను వ్యవసాయ అధికారి





శ్రీహరి, బావమరిది హరికృష్ణను పిలిచి వాటిని విక్రయించాలని చెప్పాడు. పెద్ద ఎత్తున భూములకు ధర పలుకుతుండడంతో వాటిని తానే కాజేయాలన్న దురాశతో వ్యవసాయ అధికారి శ్రీహరిని బావమరిది హరికృష్ణ కడ తీర్చాడు. ఇరువురు వ్యక్తులతో కలిసి శ్రీహరిని హత్య చేసిన హరికృష్ణ కుట్టి చెప్పుడు కాకుండా దాన సంస్కారాలు కూడా నిర్వహించారు. సొంత సోదరికి అనుమానం రాకుండా అన్ని చక్కదిద్దుకున్నాడు. అయితే ఆ నోట ఈ నోట పడి శ్రీహరి మృతిపై అనుమానం రావడంతో మొదటి భార్య ఫిర్యాదు ఫిర్యాదు చేశారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శ్రీహరి మృతి ఘటనపై లోతైన దర్యాప్తుకు పోలీసులు శ్రీకారం చుట్టడంతో వాస్తవాలు బయటకు వచ్చాయి. ఆస్తికోసం పథకం ప్రకారం హరికృష్ణ సొంత బావను కడతేర్చారని పోలీసులు విచారణలో వెల్లడి కావడంతో కేసులో ప్రధాన నిందితుడిగా హరికృష్ణ, మరో ఇరువురి వ్యక్తులను చేర్చారు. శ్రీహరి హత్య కేసులోని ప్రధాన నిందితుడైన హరికృష్ణ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేసులో ఇరుక్కోవడంతో మనస్థాపానికి గురైన హరికృష్ణ తాను తనువు చాలించాలన్న ఆలోచనలో కుటుంబంతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారుజామున సొంత గ్రామమైన కండ్రికకు వచ్చి భార్యా పిల్లలను వెంటబెట్టుకొని ప్రకాశం జిల్లా సింగరాయకొండ స్టేషన్ కు చేరుకున్నారు. తీవ్ర మనస్థాపంతో హరికృష్ణ భార్య, ఇరువురు పిల్లలతో కలిసి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. గూడ్స్ రైలు కింద పిల్లలను విసిరేసి భార్య తాను ఒకేసారి ట్రాక్ పైకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కలకలం రేపిన శ్రీహరి హత్య కేసులోని ప్రధాన నిందితుడైన హరికృష్ణ కుటుంబం రైలు కిందపడి దుర్మరణం పాలైన ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. శ్రీహరి హత్య కేసులో పోలీసులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారన్న ఆరోపణపై పోలీసు ఉన్నతాధికారులు రెడ్డిపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు. సీఐ ఎస్ఐలతో పాటు కానిస్టేబుల్స్ ను సస్పెండ్ చేశారు ప్రధాన నిందితుడు హరికృష్ణ కుటుంబంతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. శ్రీహరి హత్య కేసులో ప్రధాన నిందితుడైన హరికృష్ణ కుటుంబంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన.. కేవలం ఆస్తి కాజేయాలన్న దురాశ యే ఐదుగురు వ్యక్తులను బలి తీసుకుంది.

## ఎట్టకేలకు నేడే డీఆర్సీ సమావేశం

- 8 ప్రధాన అంశాలతో అజెండా - నివేదికలను సిద్ధం చేసిన అధికారులు
- 8 నెలలు దాటింది.. ప్రతి మూడు నెలలకొకసారి డీఆర్సీ సమావేవం నిర్వహించాలి

**ఒంగోలు, ప్రభాతవార్త**

అత్యంత కీలకమైన జిల్లా సమీక్షా మండలి(డీఆర్సీ) పాలక వర్గం గాలికొదిలేసింది. ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించాల్సిన ఈ సమావేశం గురించి పట్టించుకున్న వారు లేరు. గతంలో జరిగి ఎనిమిది నెలలు దాటినా నేటికి మోక్షం లభించింది. జిల్లాలో పునర్విభజన జరిగి ఐదు మాసాలు పూర్తయినా ఇంత వరకు ఉమ్మడిగాని, విడివిడిగా గాని డీఆర్సీ సమావేశం నిర్వహించాలన్న ఆలోచనే నేతలకు రాలేదు. అసలు కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు జిల్లాఇన్‌చార్జి మంత్రి ఉన్నారా లేదో కూడా తెలియని పరిస్థితి. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు ముగిసినప్పటికి ఇంత వరకు డీఆర్సీ సమావేశాలు మూడు మాత్రమే నిర్వహించడం పాలకపక్ష ఉదాసీనతను పట్టి చూపుతుంది. పాలక వ్యవస్థలో రాష్ట్ర స్థాయిలో అసెంబ్లీ, శాసనమండలి వంటి చట్టసభల తరువాత జిల్లా స్థాయిలో డీఆర్సీ అత్యంత కీలకమైంది. ప్రభుత్వం తరపున పొరుగు జిల్లాలకు చెందిన మంత్రి ఈ కమిటీ చైర్మన్ హోదాలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తారు. జడ్పీచైర్మన్, కమిటీ వైస్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా స్థాయి సంస్థల చైర్మన్‌లు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి మూడు మాసాలకు ఒక సారి సమావేశమై జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించి లోటుపాట్లను సవరించి మరింత పారదర్శకంగా వేగవంతంగా అవి అమలయ్యేలా యంత్రాంగానికి మార్గనిర్దేశం చేయాలి. అదే సమయంలో తక్షణ దీర్ఘకాలిక ప్రజాసమస్యలపై చర్చించడం, అవకాశం ఉన్న వాటిని స్థానికంగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. అవకాశం లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలి. అవసరమైతే మూడు మాసాల్లోపే ఒక సారి డీఆర్సీ సమావేశంనిర్వహించాల్సి వస్తోంది. మొత్తం ఈ పక్రియలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాత్ర అత్యంత కీలకం. జిల్లాలోని ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులు సమన్వయం చేయడం, అధికార యంత్రాంగానికి మార్గనిర్దేశం చేయడం, డీఆర్సీ లక్ష్యం. అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది. నేడు జరగనున్న డీఆర్సీ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. రెండు జిల్లాల డీఆర్సీ సమావేశానికి సంయుక్తంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. రెండు జిల్లాలకు సంబంధించిన అధికారులు కూడా హాజరునున్నారు. ఈ సారి డీఆర్సీ సమావేశానికి ఎనిమిది కీలక శాఖలకు సంబంధించిన మొత్తం 17అంశాలను అజెండాగా నిర్ణయించినట్లు తెలిసింది. అందులో తాగునీరు, వ్యవసాయ అనుబంధ శాఖలు, పంచాయతీ రాజ్, విద్యుత్, డ్వామా, జలవనరుల శాఖ, హైవే, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఆ మేరకు రెండు జిల్లాలకు విడివిడిగా అధికారులు నివేదికలు సిద్ధం చేసినట్లు సమాచారం.

## 16,17న పొగాకుకు గిట్టుబాటు ధర కల్పనకై రైతు దీక్షలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

పొగాకు రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి అని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 16న కనిగిరి, 17న ఒంగోలులో పొగాకు రైతు దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఒంగోలు పార్టీ ఆఫీసులో విలేకర్ల సమావేశంలో పొగాకు రైతు దీక్ష పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, పండించిన పంటకి గిట్టుబాటు ధర లేక కనీసం కూలీలకు డబ్బులు కూడా ఇచ్చే పరిస్థితి లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే రెండు సార్లు అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాలని చెప్పగా కనీసం కంపెనీలు పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. జిల్లాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు పొగాకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి స్వయంగా రైతుల కష్టాలు తెలుసుకున్న వ్యాపారుల నుండి స్పందన లేదని అన్నారు. అందుకే పొగాకు రైతుల కష్టాలు చూసి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతుల నుండి పొగాకు కొనుగోలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1000 కోట్ల రూపాయలు మార్క్‌ఫెడ్‌కు కేటాయించాలని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 30 శాతం మాత్రమే పొగాకు కొనుగోలు చేశారని, ఇంకా 70 శాతం రైతుల వద్దే పొగాకు ఉందన్నారు. అందులో భాగంగా ఈనెల 16వ తేదీ కనిగిరిలో 17న ఒంగోలులో పొగాకు రైతులతో కలిసి దీక్షలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. అప్పటికే రైతులకు న్యాయం జరగకపోతే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఏ విధంగా పోరుబాట చేయాలో నిర్ణయిస్తామన్నారు. కావున జిల్లాలోని రైతులు కనిగిరి, ఒంగోలులో జరిగే పొగాకు రైతు దీక్షలో పాల్గొనాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవి, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, రాష్ట్ర రైతు విభాగ ఉపాధ్యక్షులు మారెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు మారెళ్ల బంగారుబాబు పాల్గొన్నారు.




# ఒంగోలులో నేరాల పరంపర.. శాంతిభద్రతలపై ఆందోళన

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ఇటీవలి రోజులుగా ఒంగోలు నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, రౌడీషీటర్ల ఆగడాలు, హత్యలు, హత్యాయత్నాలు నగర ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు, కత్తులతో దాడులు, క్షణికావేశంలో హత్యాయత్నాలు, బహిరంగ ప్రాంతాల్లో రౌడీల హల్‌చల్ వంటి సంఘటనలు నగర శాంతిభద్రతలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో నేరాలు పెరుగుతుండటంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. నగరంలోని పలు కాలనీల్లో జరిగిన వరుస ఘటనలు పోలీసు వ్యవస్థకు సవాల్‌గా మారాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ముంగమూరు రోడ్, వెంకటేశ్వర కాలనీ, గాంధీ రోడ్, కర్నూలు రోడ్, బైపాస్ రోడ్ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు చోటుచేసుకున్నాయి. తాళం వేసిన ఇళ్లను ముందుగానే గుర్తించి పగటి వేళల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్న ముఠాలు సంచరిస్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన పలు చోరీల్లో భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురికావడం బాధితులను కలవరపెడుతోంది. మరోవైపు బైపాస్ రోడ్, ముంగమూరు రోడ్ ప్రాంతాల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్ ఘటనలు జరగడం ప్రజల్లో భయాన్ని మరింత పెంచుతోంది. నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనతో పాటు, కర్నూలు రోడ్డులోని టీ స్టాల్ వద్ద జరిగిన దాడి వంటి సంఘటనల్లో రౌడీషీటర్ల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగ ప్రదేశాల్లోనే కత్తులు ఊపుతూ ప్రత్యర్థులపై దాడులకు దిగడం,





యువకుల మధ్య ఘర్షణలు పెరగడం వంటి పరిణామాలు శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. క్షణికావేశంలో జరిగే దాడులు ప్రాణాంతకంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ఇప్పటికే ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలుమార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. రౌడీషీటర్లను పోలీసు కార్యాలయాలకు పిలిపించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసినప్పటికీ, వారి ప్రవర్తనలో ఆశించిన మార్పు కనిపించడం లేదని సమాచారం. హెచ్చరికల తర్వాత కూడా నేరాల పరంపర కొనసాగుతుండడం పోలీసులకు సవాల్‌గా మారింది. గత కొంతకాలంగా ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టు ఖాళీగా ఉండడం కూడా నేరాల నియంత్రణపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన పట్టణ పోలీస్ స్టేషన్‌లో పూర్తి స్థాయి అధికారి లేకపోవడం వల్ల నేరాల పర్యవేక్షణ, దర్యాప్తు, రౌడీషీటర్లపై నిఘా వంటి అంశాల్లో ప్రభావం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. పెరుగుతున్న నేరాల నేపథ్యంలో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల నగరంలో చోటుచేసుకున్న నేరాలపై సోషల్ మీడియాలోనూ విస్తృతంగా చర్చ జరుగుతోంది. రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు భయాందోళనల మధ్య ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ప్రధాన కూడలిలో నిఘా పెంచడంతో పాటు సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, పాత నేరస్థులు, బెయిల్‌పై బయటకు వచ్చిన రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాలనీల్లో పోలీసు-ప్రజల సమన్వయ కమిటీలను మరింత చురుకుగా పనిచేయించే చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీసు బీటింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై విస్తృత తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు పలుమార్లు లాడ్జీలు, ప్రధాన కూడళ్లు, రహదారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినప్పటికీ నేరాల సంఖ్య తగ్గలేదని వారు అంటున్నారు. సీసీ కెమెరాల నిఘా మరింత పెంచడం, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, రాత్రి గస్తీని కట్టుదిట్టం చేయడం ద్వారా మాత్రమే ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత కఠిన చర్యలు చేపట్టి నేరాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

6:6.qxd 7/14/2026 11:44 PM Page 1



## రైతులు పంటల భీమా పథకంలో నమోదు చేయించుకోవాలి




**హనుమంతునిపాడు, జులై 14, ప్రభాతవార్త**

ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి మంగళ,బుధవారాల్లో నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని హనుమంతునిపాడు, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులతో కలిసి నిమ్మ తోటలను పరిశీలించి పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి, కంది, సజ్జ, ఎండు మిరప, మినుము సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని వ్యవసాయాధికారి తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.860 రూపాయల ప్రీమియంను ఆగస్టు 15వ తేదీ లోపల చెల్లించినట్లయితే ఎకరానికి 43,000 రూపాయల భీమా పొందుటకు అర్హులని తెలిపారు. అలాగే ఎకరా కంది పంటకు రూ.430, సజ్జ పంటకు రూ.156, మిరప పంటకు రూ.45000, మినుము పంటకు రూ.205 ప్రీమియం చెల్లించి జులై 31వ తేదీ లోపు పీఎంఎఫ్‌బీవై.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకున్నట్లయితే ఒక ఎకరా కంది పంటకి రూ.21,500 రూపాయలు, సజ్జ పంటకి రూ.15,600 రూపాయలు, మిరప పంటకి రూ.90వేలు, మినుముకు రూ.20,500 రూపాయల భీమా పొందవచ్చు అన్నారు. పంటలు సాగులో ఉన్న అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంది, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సహాయకులు రసూల్, గ్రామ వ్యవసాయ సహాయకులు నవ్య, సహజ వ్యవసాయ కోఆర్డినేటర్ వెలిగొండయ్య, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 24 వరకు సర్ కార్యక్రమం పొడిగింపు

**- ఎన్యుమరేషన్ ఫారాలు ఇప్పటికైనా అందించి ఓటు హక్కును కాపాడుకోండి**



**పెద్దదోర్నాల, జులై 14, ప్రభాతవార్త**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు ఇప్పటికైనా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తప్పనిసరిగా తమ బూత్‌లెవల్ ఆఫీసర్(బీఎల్ఓ)కు ఫారాలను అందజేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించడం ద్వారా ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు ఓటు హక్కు పరిరక్షణ అవకాశం ఉంటుంది. గడువులోపు ఫారాలు అందించని వారు భవిష్యత్తులో ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఓటర్లు తమ కుటుంబ సభ్యులు, వృద్ధులు, దివ్యాంగుల ఫారాలు సమర్పించేలా సహకరించాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓ, సచివాలయం లేదా ఎన్నికల అధికారులను సంప్రదించి ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఓటు హక్కును కాపాడుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

## చేవూరులో ఆ నిర్మాణాలు అక్రమమా.. సక్రమమా..?

**- చోద్యం చూస్తున్న అధికారులు**



**గుడ్లూరు, జులై 14, ప్రభాతవార్త**

మండలంలో చేవూరు గ్రామంలో సర్వే నంబర్ 596/1లో నిర్మాణాలు తమవి అంటే తమవి అని నినాదం నెలకొంది. రికార్డులలో ప్రభుత్వ భూమిగా నమోదు అయి ఉంది. ఈ నేపథ్యంలో వంశపారపర్యంగా ఆ స్థలం మా ఆధీనంలో ఉందని మొగిలి వెంకటేశ్వర్లు, బాబు అనే వారు అధికారులకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. రామాయపట్నం పోర్టు రావడంతో అక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో కొందరు రెవెన్యూ అధికారులు సహకారంతో రికార్డులు మార్చి తమ ఆధీనంలో ఉన్న స్థలం ఆక్రమించుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఆ స్థలం ఎవరికి చెందినది అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు నిర్ధారించకుండా చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన ఆ స్థలంలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారా లేక ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్నారా అనే విషయం రెవెన్యూ అధికారులు తేల్చాల్సి ఉంది. ఒక వేళ ప్రభుత్వం భూమి అయితే అధికారులు ఎందుకు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు అనే విషయం తెలియాల్సి ఉంది.

## 17న లింగసముద్రంలో ఉచిత వైద్య శిబిరం

**లింగసముద్రం, జులై 14, ప్రభాతవార్త**

రమేష్ హాస్పిటల్ వారి 38వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 17న లింగసముద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రో బంకు ఎదురుగా ఉన్న డాక్టర్ కృష్ణ మోహన్ హాస్పిటల్‌లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందని అన్నారు. మెదడు, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు, జీర్ణవ్యవస్థ వైద్య నిపుణులు హాజరవుతారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారు. గుండె దడ, ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తలనొప్పి, నడుము, మోకాళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉన్నావారు, అలాగే 40 ఏళ్లు పైబడిన వారు, మధుమేహం, రక్తపోటు ఉన్న వారు, సాధారణ ఆరోగ్య పరీక్ష చేయించుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ శిబిరానికి హాజరు కావచ్చన్నారు. గత వైద్య పరీక్షా రిపోర్టులు తీసుకురావాలన్నారు. ఖాళీ కడుపుతో రావాల్సిన అవసరం లేదని, సాధారణంగా వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చు అన్నారు. ఈ శిబిరాన్ని చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలతో పాటు, స్థానిక వాసులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పర్చూరు పోలీసుల అవగాహన కార్యక్రమం



**పర్చూరు, జులై 14, ప్రభాతవార్త**

పర్చూరు ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. పర్చూరు ఎస్సై పులి గోపి మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సోషల్‌మీడియాను ఆధ్యతాయుతంగా ఉపయోగించడం, డ్రగ్స్ ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్చూరులో బాలల హక్కుల కమీషన్ తనిఖీలు



**పర్చూరు, జులై 14, ప్రభాతవార్త**

పర్చూరు ప్రభుత్వ వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు పద్మలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందుతున్న సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో రక్తహీనత నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తే మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చున్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన

### ఎమ్మెల్యే కందుల తనయుడు విగ్నేష్‌రెడ్డి



**పొదిలి, జులై 14, ప్రభాతవార్త**

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కుమారుడు విగ్నేష్‌రెడ్డి పొదిలి పట్టణం, మండలంలోని 17 మందికి సీఎం సహాయనిధి చెక్కులను స్వయంగా మంగళవారం వారింటికి వెళ్లి అందజేశారు. పొదిలి మండలంలో 13 మందికి, 4,50,300లు పొదిలి పట్టణంలో నలుగురికి రూ.2,36,855లు నగర చెక్కులను లబ్ధిదారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఆప్యాయంగా ప్రతి ఒక్కరిని పలకరించి వారి కుటుంబ యోగక్షేమాలు కనుక్కొని భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్నా తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు పొందిన పొదిలి మండలంలోని అక్క చెరువు గ్రామానికి చెందిన ఒకరికి, ఈగలపాడు 1,కాటూరి వారిపాలెం-1, కొండయ్యపాలెం-1, మాదాలవారిపాలెం-1, మల్లవరం-1, మునగపాడు-1, నాగరాజుకుంట-1, సూదనగుంట-1, తలమల్ల-1, తీగదుర్తిపాడు-1, ఉప్పలపాడు-1, ఏలూరు-1 చొప్పున మొత్తం 4,50,103 రూపాయల నగదు చెక్కులు పంపిణీ చేశారు. అదే విధంగా పొదిలి పట్టణ పరిధిలోని ఓబులశెట్టి రాజ్యలక్ష్మికి రూ.30,028 రూపాయలు, గొంగటి గిరికుమారికి రూ.56,441 రూపాయలు, ముళ్ళ జమీలకి 24,001 రూపాయలు, షమీనా సుల్తానాకి 1,26,385 రూపాయలు చొప్పున నగదు చెక్కులను ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐఎస్‌రావు నగర్ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

**- సాయినగర్‌లో పారిశుధ్యం అధ్వానం**

**- పట్టించుకోని అధికారులు - ఇబ్బందుల్లో ప్రజలు**



**కందుకూరు జూలై 14, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణం ఐఎస్‌రావు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం,మునిసిపల్ అధికారుల అశ్రద్ధ కారణంగా పట్టణంలోని సాయినగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గత కొంతకాలంగా సైడుకాలువలు నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. చెత్తసేకరణ ,డ్రైనేజి క్లీనింగ్ సిబ్బంది ఇష్టాఇష్టాలపై ఆధారపడిఉంది. అపుడుపుడు వచ్చికాలం గడుపుతుంటారు. ప్రభుత్వం పారిశుధ్యనిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో బాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఏర్పాటుచేసింది. నిధులు, విధులు కేటాయించింది. ఇందులో బాగంగా ప్రతి 3వశనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే క్షేత్రస్ధాయిలో సంబందిత అధికారుల అశ్రద్ధ, సిబ్బంది నిర్లక్ష్యంతో పారిశుధ్యం అద్వానంగా ఉంది. కోవూరు రోడ్ 6,7,8లైన్‌ల ప్రాంతాలలో మురుగుకాలువలు వ్యర్ధపదార్ధాలతో ఉన్నాయి. మురుగునీటి ప్రవాహంనిలిచిపోయింది. కాలువులు నిండి పోతున్నాయి. దుర్వాసన వస్తుంది. అయినా గత వారం రోజులుకి పైగా పారిశుధ్య సిబ్బంది ఆచూకి అడ్రసులేరు. దీంతో ఆయా నివాస ప్రాంతాల ప్రజలు అధికారులును నిందిస్తున్నారు. అదేవిధంగా నివాసాల మద్య ఖాళీప్లాట్లు పిచ్చిచెట్లుతో నిండిపోతున్నాయి. రోడ్డుకు అడ్డం వస్తున్నాయి. విషపురుగులకు నిలయాలుగా మారాయి. అయినా సంబందిత యజమానులు వదిలేశారు. ప్లాట్ల ధరలు పెరుగుతాయని ఖాళీగా ఉంచారు. వాస్తవానికి ఖాళీప్లాట్లు సైతం మునిసిపల్ పర్యవేక్షణలో ఉండాలి. మునిసిపాలిటీకి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలి. ఇతరులకు అసౌకర్యం కలగకుండా చూడాలి. ఇలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. స్పందించకపోతే మునిసిపాలిటీ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా ఆలోచించే నాధుడే లేరు. గతంలో మునిసిపల్ యాప్‌లో సైతం సమస్యను పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరించినట్లు తప్పుడు సమాచారంతో సమస్యను క్లోజ్ చేశారు. సమస్యమాత్రం యధాతధంగా కొనసాగుతుందని బాధితులు వివరిస్తున్నారు. ఈ విషయంలో మునిసిపల్ అధికారులు పలు ప్రలోభాలకు లోనైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపర చర్యలు

**- సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ**



**కందుకూరు జూలై 14, ప్రభాతవార్త**

ఇసుక తరలింపులో నిబందనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరచర్యలుంటాయని కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ అన్నారు. మంగళవారం స్ధానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇసుక తరలింపుకు సంబంధించి రామనాథపురం, వెంకన్నపాలెం, దావ గూడూరు, చింతలపాలెం గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటుచేశారు. గత కొంతకాలంగా ఇసుక అక్రమరవాణా జరుగుతున్నట్లు పలు ఆరోపణలున్నాయి. ఈ నేపద్యంలో ప్రభుత్వం విధివిధానాల మేరకు ఇసుకను తీసుకోవాలని సబ్‌కలెక్టర్ అన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా జెసిబిలు, మిషన్లు ఉపయోగించి ఇసుకను తీసినట్లైతే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ విషయమై ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకరావాలన్నారు. అనంతరం డీఎస్పీ సిహెచ్‌వి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిబందనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషా, రూరల్‌ఎస్సై బాలక్రిష్ణ, జరుగుమల్లితహసిల్దార్, ఎస్సైతోపాటు మైనింగ్‌అధికారులు పాల్గొన్నారు.

## కందుకూరులో దస్తావేజు లేఖరుల నిరసన

**- రిజిస్ట్రేషన్ స్టాంప్‌శాఖ ప్రైవేటీకరణ ఆపండి**

**- వైసీపీ రాష్ట్రనేత గంగిరెడ్డి**



**కందుకూరు జూలై 14, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కందుకూరులో మంగళవారం దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం నిరసన చేపట్టింది. ఇందుకు వైసీపీ తమ సంఘీభావాన్ని తెలిపింది. ఇందులో బాగంగా రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్‌లు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వలన వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రానుందన్నారు. తక్షణమే సంబందిత జీవో 396ను రద్దుచేయాలని గంగిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు వైసీపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఉచ్చులూరి రవీంద్ర, పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రహీం, గౌడ సంఘం అధ్యక్షులు కానాల శివప్రసాద్, సీనియర్ నాయకులు షేక్ నయీమ్, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రి, సీఎస్, సీసీఎల్‌ఏతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ



**పర్చూరు, జులై 14, ప్రభాతవార్త**

ఇనాం ఎస్టేట్ భూములకు సంబంధించిన సమస్యలపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రెవెన్యూశాఖ మంత్రి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సాయి ప్రసాద్, సీసీఎల్‌ఏలతో సచివాలయంలో సమావేశమయ్యారు. వలపర్ల జంగమేశ్వరపురం, ఏదుబాడు, అగ్రహారం గ్రామాల్లో దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న ఇనాం ఎస్టేట్ భూముల సమస్యపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు. ఈ నాలుగు గ్రామాల్లో ఇనాం ఎస్టేట్ భూములకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమాలోచనలు జరిపారు. రైతుల భూ హక్కులకు సంబంధించిన ఈ వివాదాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు.

**16న రైతులతో ముఖాముఖి :**

ఈ సమస్యపై బాధిత రైతులతో నేరుగా చర్చించేందుకు ఈనెల 16న సచివాలయంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. వలపర్ల, జంగమేశ్వరపురం, ఏదుబాడు, అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు ముఖాముఖిలో పాల్గొని సమస్యలను నేరుగా అధికారులకు వివరించేలా ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరువ చూపారు. ఈ భేటీ ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## దోర్నాలలో ఎరువుల దుకాణాల తనిఖీ

**- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కేటాయించాలి**

**- సహాయ వ్యవసాయ సంచాలకులు ఈవీ రమణ**



**పెద్దదోర్నాల, జులై 14, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల్లోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్‌తో కలిసి యర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు ఈవీ రమణ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందుతున్నాయా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల వివరాలను పరిశీలించిన ఆయన రైతుల నుంచి అదనపు ధరలు వసూళ్లు చేయరాదని డీలర్లకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా అనుమతించిన యూరియా, డీఏపీ అమ్మకాలు జరపాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని డీలర్లను ఆదేశించారు. యూరియా రూ.266.50, డీఏపీ రూ.1350 లకే అమ్మాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో శ్రీశ్రీ గురు సాయి ట్రేడర్స్ నందు గురువులకు సంబంధించిన ఒరిజినల్ లైసెన్స్ నందు ఫారం ఓ నమోదు కానందున 3 లక్షల 28 వేల 500 రూపాయల విలువ గల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏడీఏ రమణ తెలిపారు. అలాగే శ్రీ లక్ష్మి సాయి బాబా ట్రేడర్స్ నందు 3 లక్షల 46 వేల 600 రూపాయల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు. ఎరువులను ఇతర వస్తువులతో కలిపి బలవంతపువిక్రయాలను చేయడం, నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలు మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దోర్నాల్లోనూ, ఇతర గ్రామాల్లోనూ ఎరువులను అనధికారిక గోడౌన్లలో అక్రమ నిల్వలు పెట్టి దాచి ఉంచారు. వ్యవసాయాధికారులు మాత్రం కేవలం ఎరువుల దుకాణాలను మాత్రమే తనిఖీ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దోర్నాల్లో పలు చోట్ల అక్రమంగా నిల్వలు ఉంచిన అక్రమ గోడౌన్లలో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేసి వాటని సీజ్ చేసి కృత్రిమ ఎరువులక కొరత సృష్టించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## ఖరీఫ్‌కు రైతులు సిద్ధం కావాలి




**పొన్నలూరు, జూలై 14, ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్లో వేసే పంటల పట్ల అవగాహన కలిగి,సరైన పంటల సాగుకు రైతులు సిద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి వి.రాము రైతులను కోరారు. ఖరీఫ్ 2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని ముప్పాళ్ల, సింగరబోట్లపాలెం గ్రామాల్లో మంగళవారం ఖరీఫ్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డీఏపీ ఎరువుల కొనుగోలు, విక్రయాలు ఇకపై ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ముందుగా యాప్‌లో నమోదు చేసుకోవాలని, వ్యవసాయ సిబ్బంది రైతుల వివరాలను నమోదు చేసి ఎరువుల దుకాణాలను అనుసంధానం చేస్తారని అన్నారు.. ఈ విధానం ద్వారా ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, పక్కదారి మళ్లింపును అరికట్టి అర్హులైన రైతులకు పారదర్శకంగా ఎరువులు అందించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ కాలపరిమితి గల పంటలతో పాటు సజ్జ, జొన్న, కొర్ర, రాగి వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, బుధవారం పొన్నలూరు, పైరెడ్డిపాలెం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వి. రాకేష్ కుమార్ రెడ్డి, కే. చంద్రిక, పశువైద్య సహాయకురాలు ఏ. తేజస్విని, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## బహిరంగంగా మద్యం తాగితే చర్యలు



**తాళ్లూరు, జులై 14,ప్రభాతవార్త**

బహిరంగ ప్రదేశాలు, శివారు ప్రాంతాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్సై ఎస్. మల్లికార్జునరావు హెచ్చరించారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధి లోని గుంటి గంగ ఆలయ సమీపం తో పాటు పలు శివారు ప్రాంతాలు బహిరంగంగా మద్యం తాగే ప్రదేశాలను గుర్తించి మంగళవారం వాటిని శుభ్రం చేయించారు. ఆ ప్రదేశంలో పడి ఉన్న మద్యం, ప్లాస్టిక్ సీసాలను తొలగించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై పోలీసులకు ప్రజలు వివరాలు అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎస్ఐ వెంట కానిస్టేబులు మాల కొండయ్య, వాసు ఉన్నారు.

## ఎక్సైజ్ సీఐని కలిసిన చందన



**తాళ్లూరు,జూలై 14,ప్రభాతవార్త**

దర్శి ఎక్సైజ్ సీఐ గా బాధ్యతలు చేపట్టిన బి.అశోక్ కుమార్‌ను మంగళవారం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (చందన) మర్యాదపూర్వకంగా కలిసి, శాల్వతో సత్కరించి ,స్వీట్లు అందజేశారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న కందుల శ్రీనివాసులరెడ్డి



**పామూరు, జులై 14, ప్రభాతవార్త**

దూబగుంటపంచాయతీ సచివాలయంలో మంగళ వారం సర్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకులు, మాజీ గ్రామ సర్పంచ్ కందుల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌ఏ పసుపులేటి అనూషకు అందజేశారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు పోకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ సురేష్, రాచకొండ మహేంద్ర, చింతం రాజేష్, మోరబోయిన ఆదినారాయణ, పిన్నిబోయిన నరసింహారావు, చెరుకుల మధు, చెరుకుల వెంకటేశ్వరరెడ్డి, మాలెం కిరణ్, గడ్డం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపు కోసం డాక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డికి విజ్ఞప్తి



**పామూరు, జులై 14, ప్రభాతవార్త**

తమ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి పేద రోగులను ఆరోగ్య సమస్యల నుండి విముక్తి కలిగించాలని కనిగిరి మండలానికి చెందిన తక్కెళ్ళపాడు, బల్లిపల్లి యువ నాయకుడు ఎస్.మహేష్, ఎన్.మధులు మంగళవారం నాడు డాక్టర్ పులిమేర మల్లిఖార్జున్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో కనిగిరి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో తన వైద్య సేవలను విస్తృత పరుస్తున్న నేపథ్యంలో కనిగిరి మండలానికి చెందిన వారు తమ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి శనివారం పామూరులో నిరుపేదల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామని అభినందించారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ పొలిమేర మల్లిఖార్జునరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ భగవంతుడు మనకిచ్చిన సంపదలో ఎంతో కొంత పేదల కోసం ఖర్చు పెట్టాలన్న ధ్యేయంతో తమ తల్లి రమణమ్మ ఆశయాలకు అనుగుణంగా సేవ కార్యక్రమంలో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు.

### కాపు ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముద్రగడ మృతిపై ఆకుపాటి సంతాపం



**పామూరు, జులై 14, ప్రభాతవార్త**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకే కాకుండా యావత్ రాష్ట్రం తన వైపు తిప్పుకునేలా అనేక సార్లు ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు ముద్రగడ పద్మనాభం మృతి యావత్ రాష్ట్రానికే తీరని లోటని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. ఏ పని తలపెట్టిన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని తను అనుకున్నదే న్యాయమని దాని కోసం ఎంత దూరమైన ఎంత త్యాగానికైనా తెగించి ముందుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు రాష్ట్రంలో కాపుల్లో ముఖ్యమంత్రి హోదా చేసే అర్హత ఆయనకు ఉండేది, ఏది ఏమైనా ముద్రగడ మరణం రాష్ట్రానికి కాపు జాతికి తీరని లోటని ఆకుపాటి వెంకటేష్ ముద్రగడ అభిమానులు, రాజకీయ నాయకులు, పలువురు అభిప్రాయపడ్డారు.

## గార్లదిన్నె ,నాగంపల్లిలో పొలం పిలుస్తోంది



**కొనకనమిట్ల, జులై 14, ప్రభాతవార్త**

మండలంలోని గార్లదిన్నె, నాగంపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, రైతులందరూ తక్కువ నీటితో పండించే పంటలను ఎంచుకోవాలని, ఫామ్ పాండ్‌లను, సూక్ష్మ సేద్య పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఖచ్చితంగా ఈ- పంట నమోదు చేసుకోవాలని, తద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. పంటలు వేసే రైతులందరూ పంటల భీమా పథకంకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ప్రతి పంటకు జులై 15 ఆఖరు తేదీ అని, కంది, మిరప, సజ్జ, నువ్వులకు జులై 31, వరికి ఆగస్టు 15 ఆఖరి తేదీ అని తెలిపారు. యూరియా, డీఏపీ ఎరువులకు ప్రభుత్వం ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే కావాల్సిన రైతులకు వారు వేసే పంటల విస్తీర్ణం ఆధారంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణ అధికారి బి.విక్రమ్, గార్లదిన్నె, నాగంపల్లి వ్యవసాయ సహాయకులు శివశంకర్, రమేష్, సుబ్బమ్మ, ఆయా గ్రామరైతులు పాల్గొన్నారు.

## కుంకలమర్రు ఆర్‌జేఎస్‌జెడీపీ హైస్కూల్‌కు దాతల చేయూత



**పర్చూరు, జులై 14, ప్రభాతవార్త**

పర్చూరు నియోజకవర్గంలోని కుంకలమర్రు ఆర్‌జేఎస్‌జెడ్‌పీ హైస్కూల్ అభివృద్ధికి దాతల నుంచి విశేష సహకారం లభిస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రావి సుధాకర్ - రావి శ్రీకాంత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు దాతలు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్టు చైర్మన్ గడిపర్తి శ్రీనివాసరావు బీఈ నేతృత్వంలో పాఠశాలలో రూ.42 లక్షల వ్యయంతో కంప్యూటర్ గది, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, స్మార్ట్ తరగతి గదులు, మౌలిక సదుపాయల కల్పన చేపట్టడం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఆదర్శకంగా నిలుస్తోందని ఆయన అన్నారు. 17వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

7:7.qxd 7/14/2026 11:42 PM Page 1



# డీఈఓ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల శిక్షణ

**- ఆధునిక బోధనా విధానాలపై సమగ్ర శిక్షణ**

**- మార్కాపురం డీఈఓ సామా సుబ్బారావు**



**మార్కాపురం, జులై 14, ప్రభాతవార్త**

మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా జిల్లా స్థాయి ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాభివృద్ధి (డిస్ట్రిక్ట్ లెవెల్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాము ) రెండురోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రిసోర్స్ పర్సన్స్ (డీఆర్పీలు)ను ఉద్దేశించి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) సామా సుబ్బారావు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, శారీరక విద్య ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా విధానాలపై సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అకడమిక్ క్యాలెండర్, పాఠ్యపుస్తకాల నవీకరణలు, టీచర్స్ హ్యాండ్‌బుక్, అసెస్‌మెంట్ బుక్‌లెట్లు, లీప్ యాప్, సమ్మరీ వీడియోలు, విద్యలో కృత్రిమ మేధస్సు (ఏఐ ), ఎన్‌పీఎస్‌టీ, ఎన్‌ఎంఎం ప్రొఫెషనల్ స్టాండర్డ్స్, క్లిక్కర్స్, విలువల విద్య, పీఎంఈ విద్య, దీక్ష, పాల్ ల్యాబ్స్, వారధి విద్యాశక్తి, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, బ్రిడ్జ్ కోర్సులు, సీబీఈ విధానం, నూతన బోధనా పద్ధతులు, క్లాస్‌రూమ్ ట్రాన్స్‌ఫర్మేషన్, 100 రోజుల యాక్షన్ ప్లాన్, ఇంటిగ్రేటెడ్ క్లాస్‌రూమ్ ప్లానింగ్ వంటి అంశాలపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. శారీరక విద్య ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ ఇంజురీస్, బీఎంఐ, అథ్లెటిక్స్, యోగా, కబడ్డీ, ఫండమెంటల్ మోటార్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. గత నెల కేఎల్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన స్టేట్ రిసోర్స్ పర్సన్స్ ఈ శిక్షణను అందిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా డీసీఈబీ కార్యదర్శి ఎం సుధాకర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాణావత్ రాందాస్ నాయక్, స్థానిక ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి, ఏసీఈ ఆర్ కొండారెడ్డి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ఎం సజీవరాజు, రిసోర్స్ పర్సన్స్ ఆర్ విప్లవ్ కుమార్, మండ్ల రామాంజనేయులు, వేణుగోపాల్, బాలచందర్, మొర్రి పిచ్చయ్య, మణిరాజ్, ఆదినారాయణ, భోజ నాయక్, శివాంజనేయులు, మల్లికార్జున్, శ్రీనివాసులు, దామోదర్ రెడ్డి, బీఆర్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకవీడు అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఐసిడిఎస్ పి డి పద్మావతి



**రాచర్ల, జులై 14 ప్రభాతవార్త**

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా కల్పిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలోని ఆకవీడు అంగన్వాడి కేంద్రం - 3 ని మార్కాపురం జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం పద్మావతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడి కేంద్రాల చిన్నారుల తల్లులతో ప్రత్యేక సమావేశమై చర్చించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సదుపాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందుతున్న సేవల గురించి ప్రభుత్వం నుండి ఫోన్ కాల్స్ వస్తాయని వాటికి సరైన రీతిలో సమాధానం ఇవ్వాలని వారికి అవగాహన కల్పించారు అంగన్వాడి కార్యకర్తలు చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు క్రమం తప్పకుండా అందించవలసిన అన్ని సేవలు అందించాలన్నారు. సేవల్లో లోటుపాట్లు జరిగిన ప్రజల నుండి ఫిర్యాదులు అందిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బి జ్యోతి కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు : (ఎస్ఐ శివ)



**రాచర్ల, జులై 14 ప్రభాతవార్త**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని రాచర్ల ఎస్సై శివ అన్నారు. రాచర్ల పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లోని పలు బహిరంగ ప్రదేశాలను మంగళవారం ఆయన తమసిబ్బందితో పరిశీలించారు. కొందరు యువకులు నిత్యం ఆ ప్రాంతాల్లో మద్యం సేవించి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డ ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరించిన చర్యలు తీసుకుంటామన్నారు.అనంతరం ఆయన స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తమ సిబ్బందితో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



**గిద్దలూరు, జులై 14, ప్రభాతవార్త**

రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా తమ పొలాలకు ఎరువులు వాడాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉయ్యాలవాడ, గడికోట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ కాలం, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.అనంతరం పత్తి పంటలను పరిశీలించి చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామసుబ్బయ్య, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'షీ' చిత్రం షూటింగ్ పూర్తి



**గిద్దలూరు, జులై 14, ప్రభాతవార్త**

సన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న "షీ" సినిమా చిత్రీకరణ విజయవంతంగా పూర్తయిందని నిర్మాత దీపశెట్టి తెలిపారు. గిద్దలూరుకు చెందిన బృందం నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభం నుంచే సామాజిక అంశాలతో కూడిన కథాంశం కారణంగా ఆసక్తిని రేకెత్తించిందని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రానికి కొ మ్మునూరి సునేష్ దర్శకత్వం వహించగా, కొమ్మునూరి నందిని డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ (డీఓపీ)గా పనిచేశారు. సాంకేతిక నిపుణులు, నటీనటుల సమిష్టి కృషితో సినిమా చిత్రీకరణ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయిందని నిర్మాత తెలిపారు.ఈ చిత్రంలో ప్రసాద్ రావు, బి. వెంకటేశ్వర్లు, కోటయ్య, సునీత, ప్రమీల, శోభారాణి, విజయ్ దేవ్, అజీజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రతి పాత్ర కథకు బలాన్ని చేకూర్చే విధంగా ఉండనుందని చిత్ర బృందం వెల్లడించింది. చిత్రీకరణ పూర్తయిన నేపథ్యంలో ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నట్లు నిర్మాత దీప శెట్టి తెలిపారు. ఎడిటింగ్, డబ్బింగ్, రీరికార్డింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఆగస్టు నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు."షీ" చిత్రం ప్రేక్షకులకు మంచి సందేశంతో పాటు వినోదాన్ని అందించేలా రూపొందించామని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఖరీఫ్‌లో పొలం పిలుస్తోందికు శ్రీకారం..

**- పంట భీమాపై రైతులకు అవగాహన**



**కనిగిరి, జులై 14, ప్రభాతవార్త**

ఖరీఫ్-2026 సీజన్‌లో రైతులకు శాస్త్రీయ సాగు విధానాలు,పంటభీమా,వ్యవసాయ సలహాలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం కనిగిరి మండలంలో ప్రారంభించారు.తొలి విడతలో వంగపాడు,గురువాజిపేట గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి షేక్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల కారణంగా అనావృష్టి లేదా అసమాన వర్షపాతం సంభవించే అవకాశాలు ఉన్నందున రైతులు తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవాలని సూచించారు. సాగు చేసిన వెంటనే రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకుంటేనే భీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. రైతు వాటా ప్రీమియంగా కందికి ఎకరానికి రూ.435, సజ్జకు రూ.158, వరికి రూ.870, మిరపకు రూ.4,553 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వరి పంటకు ఆగష్టు 15 వరకు, మిగిలిన పంటలకు జులై 31 వరకు భీమా నమోదు గడువు ఉందన్నారు. భీమా నమోదు కోసం పట్టాదారు పాస్ బుక్, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లతో కామన్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఉస్తుంవారిపల్లి గ్రామంలో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత దుకాణాల లైసెన్సులు రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన మేర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, అధిక ధరలు వసూళ్లు చేసినట్లయితే వెంటనే వ్యవసాయశాఖకు ఫిర్యాదులు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి పి.విష్ణు ప్రియ, గ్రామ వ్యవసాయ సహాయకులు డి.శారద, పి.రవి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# మార్కాపురం వార్త



## సర్ పక్రియ వందశాతం పూర్తి

**- ఈ నెల 24వ తేదీ వరకు పొడిగింపు**

**యర్రగొండపాలెం, జులై 14, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గం సర్ ఎన్యుమరేషన్ పక్రియ కార్యక్రమంలో యర్రగొండ పాలెం నియోజకవర్గం రెండవ స్థానంలో ఉందని మంగళవారం యర్రగొండపాలెం మండల రెవెన్యూ కార్యాలయం,ఎన్నికల కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బీవీభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గంలో సర్ ఎన్యుమరేషన్ పక్రియ100 శాతం పూర్తయిందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో అలాగే యర్రగొండపాలెం పట్టణం,మండల పరిధిలో సర్ పక్రియ విజయవంతం అయిందని తెలిపారు. పుల్లలచెరువు మండలంలోని బీఎల్‌వోలు 100శాతం సర్ పక్రియ పూర్తి చేశారని అన్నారు. అదే విధంగా త్రిపురాంతకం మండలంనకు 100 శాతం సర్ పక్రియ అయిందని,దోర్నాల మండలం 100శాతం సర్ పక్రియ జరిగిందని ఎన్నికల డీటీ పేర్కొన్నారు.పెద్దారవీడు మండలంనకు100 శాతంసర్ పక్రియ జరిగిందని, ఓ టర్లు బీఎల్‌ఓలకు భాగా సహకరించాలని భాస్కర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో సర్ ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకుని ఎలాంటి ఆధారాలతో ఫారాలు తిరిగి ఇవ్వని వారు 7926 మంది అని అదే విధంగా గ్రామంలో లేకుండగా పోయినవారు 4516 మంది అని రెండు చోట్ల వేర్వేరుగా ఓటు ఉన్న వారు 2116 మందిగా ఉన్నారు. మరణించిన వారు 4444 మంది ఉన్నారని పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో సర్ గడువు 24వరకు పొడిగింపు :**

రాష్ట్రంలో సర్‌గడువును పొడిగిస్తున్నట్లు ఎన్నికల కమీషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఇవాల్టితో గడువు ముగియనుండగా అన్నిపార్టీల విజ్ఞప్తుల మేరకు ఈనెల 24వ తేదీ వరకు ఎన్నికల కమీషన్ పొడిగిస్తున్నట్లు తెలిపింది. దీంతో సర్ హడావుడి బీఎల్‌ఓలపై ఒత్తిడి తగ్గినట్లేనంటు సంతోషం వ్యక్తం అవుతుంది.



## రెచ్చగొట్టే ఫ్లెక్సీలు ముద్రిస్తే కఠిన చర్యలు

**- డీఎస్పీ యు నాగరాజు హెచ్చరిక**



**మార్కాపురం, జులై 14,ప్రభాతవార్త**

మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపుల యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కాపురం సీఐ ఎండి అల్తాఫ్ హుస్సేన్, వై.పాలెం సీఐ అజయ్ బాబు, మార్కాపురం ఎస్ఐ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టే, సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ముద్రించరాదని ప్రింటింగ్ షాపుల యజమానులకు స్పష్టం చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తూ ఇటువంటి ఫ్లెక్సీలను ముద్రించినా,సరఫరా చేసినా సంబంధిత యజమానులు, నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

## పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు వేగవంతం చేయాలి : కలెక్టర్ విజయ సునీత

**- ఆగస్టు చివరి నాటికి అన్ని కాలనీలు సిద్ధం చేయాలని ఆదేశం**

**మార్కాపురం, జులై 14, ప్రభాతవార్త**

వెలుగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసి ఆగస్టు నెలాఖరు నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ, వెలుగొండ ప్రాజెక్టు అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పునరావాస కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, పైపులైన్లు తదితర మౌలిక వసతుల ఏర్పాటు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే పునరావాసం పొందాల్సిన కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం కింద ఇంకా ఎంతమందికి చెల్లింపులు చేయాల్సి ఉందో పూర్తి వివరాలతో వారం రోజుల్లో జాబితా సిద్ధం చేసి సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూతాలిం, ఈఈ శ్రీనివాసరావు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి,కంభం ఎస్‌డీసీ సత్యనారాయణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## వెలుగొండ నిర్వాసిత యువతకు భరోసా కల్పించాలి

**- 2019 కటాఫ్‌తో నిర్వాసిత యువతకు అన్యాయం వద్దు - డి.రమాదేవి**

**మార్కాపురం, జులై 14, ప్రభాతవార్త**

శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో 2026 జులై నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులందరినీ ప్రత్యేక కుటుంబాలుగా పరిగణించి ఆర్‌అండ్‌ఆర్ (పునరావాసం-పునర్నిర్మాణం) ప్యాకేజీ అందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మార్కాపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఉషా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తై నీరు విడుదల కావాలని నాలుగు జిల్లాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, 2026లో ప్రాజెక్టు పూర్తి చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమని అన్నారు.అయితే నిర్వాసితుల జాబితాకు 2019 సంవత్సరాన్ని కటాఫ్ తేదీగా నిర్ణయించడం వల్ల 18 సంవత్సరాలు నిండిన అనేక మంది యువతీ, యువకులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారందరినీ ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించి ప్యాకేజీ వర్తింపజేసి, నిర్వాసితులందరికీ పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతోందని పేర్కొన్న డి రమాదేవి, కుల వివక్ష నిర్మూలన కోసం జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సర్వేలు, అధ్యయనాలు, ప్రజా కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, అంబేద్కర్ వాదులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మార్కాపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో దేవాదాయ భూముల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేద కుటుంబాల ఇళ్లను క్రమబద్ధీకరించాలని, సుందరయ్య నగర్, విజయ టాకీస్ ప్రాంతం, మంగలి మాన్యం తదితర ప్రాంతాల్లో తాగునీరు, మౌలిక వసతులు, స్మశానవాటిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సుందరయ్య కాలనీలో పాఠశాల నిర్మాణం చేపట్టాలని కూడా డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం మార్కాపురం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య, జిల్లాకమిటీ సభ్యులు ఊసా రాజ్యలక్ష్మి, డీకేఎం రఫీ, గుమ్మా బాలనాగయ్య, తొలిచూరి ఆవులయ్య, పీసీ కేశవరావు, కొమ్మాలపాటి మాల్యాద్రి, పార్టీ కార్యాలయ కార్యదర్శి డి. వందన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రేపు మూడు మండలాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గిద్దలూరు, జులై 14 ప్రభాతవార్త**

గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాలలో జులై 15వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. గిద్దలూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈ విషయాన్ని ప్రజలు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చెబుతున్నారు.

## సర్ పక్రియను పరిశీలించిన టీడీపీ నాయకులు



**కనిగిరి, జులై 14, ప్రభాతవార్త**

కనిగిరి మండలం బుడ్డాయపల్లి గ్రామంలోని బూత్ నంబర్-187లో మంగళవారం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. పార్టీ సీనియర్ నాయకులు గంజిగుంట శ్రీనివాసులు, గంగవరపు నాగిరెడ్డి బూత్‌ను సందర్శించి ఓటర్ల జాబితా పరిశీలన,సవరణల పక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదై ఉండేలా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు లేదా లోపాలు ఉన్నట్లయితే వాటిని వెంటనే గుర్తించి సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయించాలని తెలిపారు. బూత్ స్థాయిలో సర్ పక్రియను సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి అర్హ ఓటరికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొగాకు రైతుల పోరాటానికి వైఎస్సార్‌సీపీ శ్రీకారం

**- ఒంగోలులో రైతు దీక్ష పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న దద్దాల**



**కనిగిరి, జులై 14, ప్రభాతవార్త**

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న కనిగిరిలో 17న ఒంగోలులో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న రైతు దీక్షలను సంబంధించి వైఎస్సార్‌సీపీ మంగళవారం ఒంగోలుల జిల్లా పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించింది. దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో పోసర్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ దీక్షలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవి, రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మారెళ్ల బంగారు బాబు పాల్గొన్నారు. కనిగిరి నియోజకవర్గం నుంచి మడతల కస్తూరిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి హాజరయ్యారు.

## మత్స్యకార కుటుంబాలకు జగన్ భరోసా

**- పరామర్శలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు**



**కనిగిరి, జులై 14, ప్రభాతవార్త**

విశాఖపట్నం జిల్లాలో ఇటీవల జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావు ఆయన వెంట పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకోగా కదిరి బాబురావు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం జబ్బర్‌తోట ప్రాంతానికి వెళ్లి బోటు ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఒక్కో కుటుంబానికి రూ.7లక్షల చొప్పున మొత్తం ఏడు కుటుంబాలకు రూ.49లక్షల ఆర్థిక సహాయం అందజేసినట్లు కదిరి బాబురావు తెలిపారు. ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించినట్లు పేర్కొన్నారు. కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 20 నుంచి పెన్‌డౌన్ సమ్మె



**గిద్దలూరు, జులై 14, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం. 396 ద్వారా రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖలో ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ, రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పెన్‌డౌన్ సమ్మెను విజయవంతం చేయాలని గిద్దలూరు దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు కోరే సుబ్బారావు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం సంఘం కార్యదర్శి గర్రె రామ్‌ప్రసాద్ కార్యాలయంలో జరిగిన దస్తావేజు లేఖరులు, సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 396 అమలుతో దస్తావేజు లేఖరులు, వారి సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్ల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం వల్ల ప్రజల ఆస్తుల భద్రతకూ ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 20 నుంచి 31 వరకు జరిగే సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రజలకు, కక్షిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో దస్తావేజు లేఖరులు, సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

## నంద్యాల ఘాట్‌రోడ్డులో ప్రమాదవశాత్తు లోయలో పడిన టిప్పర్



**గిద్దలూరు, జులై 14, ప్రభాతవార్త**

నంద్యాల - గిద్దలూరు ప్రధాన రహదారిలోని శ్రీ సర్వ నరసింహ స్వామి, పచ్చర్ల గ్రామం వద్ద ప్రమాదవశాత్తు టిప్పర్ అదుపుతప్పి లోయలో పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు నంద్యాల - గిద్దలూరు మధ్య నల్లమల అరణ్యంలో మంగళవారం 11 గంటల సమయంలో నంద్యాల వైపు నుంచి గిద్దలూరు వైపు వెళుతున్న టిప్పర్, మార్కాపురం ఆర్టీసి బస్సు నంద్యాల వైపు వస్తు కల్వర్ట్ వద్ద రెండు వాహనాలు ఎదురు పడగా బస్సును తప్పించే క్రమంలో పక్కనే ఉన్న మోరిని ఢీ కొట్టి టిప్పర్ లోయలో పడిపోయింది. దీంతో బస్సులోని సుమారు 60 మంది ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. లోయలో పడ్డ టిప్పర్ డ్రైవర్ క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.

## పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు

**- ఐదుగురిని అదుపులోకి**



**నాగులుప్పలపాడు, జులై 14, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్ పరిధిలో ముప్పాల గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.8,460, ఐదుసెల్ ఫోన్లను ఎస్సై మహేంద్ర స్వాధీనం చేసుకున్నారు. జూద కార్యకలాపాలు, బహిరంగ మద్యపానం, బైక్ రైసింగ్ ఎక్కడ జరిగినా డ్రోన్ టెక్నాలజీతో పసిగట్టి ఇలాంటి కార్యక్రమాలను ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. సమాజ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై,జూదం, బహిరంగ మద్యపానం, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా జూదం బహిరంగ మద్యపానం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి సమాచారం తెలిస్తే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సప్ నంబర్ 9121102266కు మేసేజ్ ద్వారా తెలియజేయలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



**మార్టూరు, జులై 14, ప్రభాతవార్త**

మార్టూరు మండలం వలపర్ల గ్రామంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి ఎంసీహెచ్ వస్రామ్ నాయక్ సందర్శించారు. మొదటిగా పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందించిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల నాణ్యతను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి ఉపాధ్యాయులకు విద్యాశాఖ జారి చేసిన అకాడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ong-8_ong-8.qxd 7/14/2026 11:14 PM Page 1



## డిపాజిట్లుపై అత్యధిక వడ్డీ ఇచ్చేది సహకార బ్యాంకులే : బియం విజయకృష్ణ

**కొరిసపాడు, జులై 14, ప్రభాతవార్త :**



ఖాతాదారులకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిచ్చేది సహకార బ్యాంకు లేనని అద్దంకి పిడిసిసి బ్యాంకు మేనేజర్ విజయ్ కృష్ణ తెలియజేశారు. మంగళవారం మేదరమెట్ల గ్రామంలో ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అద్దంకి ఆధ్వర్యంలో డిపాజిట్ మేళ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మేనేజర్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ తమ బ్యాంకు లోని ఖాతాదారులకు అత్యధిక వడ్డీ చెల్లించడమే కాకుండా, బ్యాంకుల లోని డిపాజిట్లకు 5 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడాఉంటుందన్నారు. తమ బ్యాంకులలో ముద్ర రుణాలు గోల్డ్ , కార్, హోమ్, అగ్రికల్చరల్ వంటి అవసరాలకు తక్కువ ప్రాసెస్ తో రుణాలను మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాలను ఖాతాదారులు, ప్రజలు వినియోగించుకోవలసినదిగా ఆయన కోరారు .ఈ డిపాజిట్ రుణమేలా కార్యక్రమంలో ఆయనతోపాటు ఏజీఎం శైలజ, ఫీల్డ్ ఆఫీసర్ పాలపర్తి శరత్, గ్రామమాజీ ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు ,తిమ్మన పాలెం సొసైటీ కార్యదర్శి సాదినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం

**అద్దంకి, జులై 14, ప్రభాతవార్త :**



శ్రీరామ జన్మ నక్షత్రం పునర్వసు సందర్భంగా సింగరకొండలోని శ్రీరామనవృద్ధుల ఆశ్రమంలో, 500 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం ఛైర్మన్ రావూరి రంగయ్య, నిర్వాహకులు పూర్ణయ్య, వెంకటరావు, వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. దాతల సహకారంతో ప్రతి నెలలో పునర్వస్తు నక్షత్రం రోజున భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు రావూరి రంగయ్య తెలిపారు.

## ప్రసన్నాంజనేయస్వామికి కదళీఫలపూజ

**అద్దంకి, జులై 14,ప్రభాతవార్త :**



సింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి జేష్ట బహుళ అమావాస్య సందర్భంగా దశ సహస్ర కదళీ ఫలార్చన అత్యంత వైభవంగా జరిగింది. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం రావివారిపాలెం గ్రామ వాస్తవ్యులు అడుసుమల్లి శ్రీనివాస శర్మ, మంజుల దంపతులు ఉభయ దాతలుగా



వ్యవహరించారు. మంగళవారం అమావాస్య కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో సింగరకొండ విచ్చేసి స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకరరావు, ఎసి మదమంచి తిమ్మానాయుడు, వేదపండితులు పాల్గొన్నారు.

## రామాంజనేయులుకు చింతలపూడి పరామర్శ

**అద్దంకి, జులై 14, ప్రభాతవార్త :**



మద్దిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అద్దంకి పట్టణానికి చెందిన మామిడికాయల వ్యాపారి యరచెట్ల రామాంజనేయులు గాయపడ్డాడు. చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతిలో వుండగా అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ మంగళవారం వారి గృహానికి వెళ్ళి రామాంజనేయులను పరామర్శించి, ఆర్థిక సహాయన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఈదా శ్రీనివాసరెడ్డి, మొరసా సుబ్బారావు, కరిముల్లా తోపాటు పట్టణానికి చెందిన పలువురు నాయకులు వున్నారు.

## పశుగ్రాసం కొరకు 15వేలు వితరణ

**అద్దంకి, జులై 14, ప్రభాతవార్త :**



శ్రీ హరి హర గో క్షేత్రం పశువుల దాణా కొరకు 15వేల రూపాయలను రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో నిర్వాహకులు సుబ్బారావుకు అందజేశారు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు మిత్ర బృందం 6వేలు, వలేటివారిపాలెం కోదండరామస్వామి దేవస్థానం తరుపున 5వేలు, రోటరీ సభ్యులు 4వేలు, వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చుండూరి మురళీ సుధాకరరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, బాచిన శివధర పూర్ణచంద్రరరావు, టి.శ్రీనివాసరావు, పి.ఆంజనేయులు, పి.హరిబాబు, రోటరీ అధ్యక్ష,కార్యదర్శి,ట్రెజరర్‌లు పువ్వాడ రామకోటేశ్వరరావు, కరి రామయ్య, జి.లక్ష్మీరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

## జయరాజ్ స్టీల్ దృఢమైనది

**అద్దంకి, జులై 14, ప్రభాతవార్త :**



జయరాజ్ స్టీల్ భవన నిర్మాణంలో మేలైనది, దృఢమైనది అని ఆ కంపెనీ సేల్స్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానీ ట్రెడర్స్ ప్రొప్రైటర్ గూడ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బిల్డర్స్, తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణాల ప్లానర్స్, రియల్ ఎస్టేట్ వారికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎపిలోని కర్నూల్‌లో జయరాజ్ స్టీల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసి, భవన నిర్మాణ విషయంలో నాణ్యతలోను, మన్నిక లోను, దృఢమైనదిగా జయరాజ్ స్టీల్‌ను మార్కెట్‌లో నిలుస్తుందని ఆయన వివరించారు. ఎపిలో స్టీల్ తయారీ విషయంలో ఇటీవల కాలంలో ఈ ప్రాజెక్టును కర్నూల్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. క్వాలిటీలో జయరాజ్ స్టీల్ తనకుతానే సాటిని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో భవానీ ట్రెడర్స్, సేల్స్ మేనేజర్, వినోద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 17లోపు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయాలి

### - చింతలపూడి డిమాండ్

**అద్దంకి, జులై 14, ప్రభాతవార్త :**



అద్దంకి నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ బోర్ విద్యుత్ కనక్షన్‌లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు, ఈనెల 17లోపు సంబంధిత అధికారులు రైతులకు సమకూర్చాలని, అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్‌చింతలపూడి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ మాట్లాడుతూ 17వరకు అధికారులకు సమయం మిస్తున్నామని, దాదాపు 126మంది రైతులు నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనక్షన్‌లకు సంబంధించి, ట్రాన్స్‌ఫార్మర్ల కొరకు ఎదురు చూస్తున్నారని ఆయన వివరించారు. 17 తరువాత అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా గాంధీ పద్దతిలో నిరసన తెలియజేస్తామని, ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 3వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లు రైతులకు ఇచ్చినట్లు సంబంధిత మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెపుతున్న విషయాలలో వాస్తవికత లేదని ఆయన అన్నారు. 2024 నుండి విద్యుత్ కనెక్షన్‌ల కొరకు ఎదురు చూస్తున్న రైతులు గ్రీవెన్స్‌ను ఆశ్రయించిన వారికి నేటికి కనెక్షన్‌లు ఇవ్వలేదని అన్నారు. ఏకంగా కొందరు రైతులు కోర్టును ఆశ్రయించిన సంఘటనలు వున్నాయని, కోర్టు ధిక్కకరణపై రైతులు తిరిగి కోర్టును ఆశ్రయిస్తేకాని కనెక్షన్‌లు ఇవ్వని పరిస్థితి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితి నిజం కాద అని ఆయన ప్రశ్నియించారు. టిడిపి ఆఫీసులనుండి సిఫార్సు లేటర్లు వుంటేనే, విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చే పరిస్థితి నియోజకవర్గంలో నెలకొని వుండటం రైతులను అవమాన పరచడమేనని ఆయన విమర్శించారు. సాక్షాతూ సిఎం చంద్రబాబు నాయుడే వైసిపి వాళ్ళకు పనులు చేయవద్దని, ప్రత్యక్షంగా ప్రకటించడం ఈ ప్రభుత్వం తీరుకు నిదర్శనం అన్నారు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5ఏళ్ళ పాలనలో పార్టీ, ప్రాంతం, కులం, మతం, చూడకుండా రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ పరంగా ప్రతి పథకాన్ని అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా, ప్రస్తుతం పక్షపాత ధోరణితో పాలనచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంకు ఎక్కడ పోలిక అని చింతలపూడి ఏద్దేవా చేశారు. ఇప్పటికైనా రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతులు వర్షాభావంతో ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చి ఆదుకోవాలని సూచించారు. ఈ విషయంలో రైతుల కొరకు ఎవరి పాదాలకైనా, మొక్కుతానని, ఆయన ప్రకటించారు. అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్‌శాఖ అధికారులు రైతులపట్ల సానుభూతితో వ్యవహరించాలని చింతలపూడి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి, రైతులు గూడ ప్రకాష్‌రెడ్డి, బాలు, ప్రశాంతి రెడ్డి, గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, మాకినేని శ్రీనివాసరావు, రోశయ్య, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**దర్శి, జులై 14, ప్రభాతవార్త**

పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్- ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. ప్రజలు, కార్యకర్తలు నుంచి వినతులను స్వీకరించడం జరిగింది. ప్రతి ఒక్కరి సమస్యను విని.. సమస్యలు పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేస్తూ అర్జీదారులకు భరోసా కల్పించారు.

## నమస్తే ఫోగ్రామును సమీక్షించిన డీపీవో అనుపమ

**సంతనూతలపాడు, జులై 14, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమస్తే ఫోగ్రామంను మంగళవారం సంతనూతలపాడులో జిల్లా పంచాయతీ అధికారిణి ఎం.అనుపమ సమీక్షించారు. చెత్త సేకరణ పారిశుధ్య కార్మికులకు, విడిగా పేపర్ వగైరా వాటిని ఏరుకునే కార్మికులకే కేంద్ర ప్రభుత్వం నమస్తే ఫోగ్రా కింద రూ.5లక్షల రూపాయలను ప్రమాద భీమా పథకం కింద ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించినట్లు డీపీవో అనుపమ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నమస్తే ఫోగ్రాం యాప్‌లో నమోదు పక్రియను ప్రారంభించారు. తదుపరి స్వచ్ఛ రథంను పరిశీలించి ప్రజలకు డీపీవో అనుపమ అవగాహన కల్పించారు. కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా భరోసా కల్పించినట్లు డీపీవో అనుపమ వెల్లడించారు. తదుపరి పారిశుధ్య కార్మికులను డీపీవో అనుపమ సత్కరించి వారికి కూరగాయలను తదితర వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో యు.అరుణ కుమారి, సెక్రటరీ ఆర్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి సేవా సంకల్ప్ ట్రస్టు ఆధ్వర్యంలో చేయూత

**సంతనూతలపాడు, జులై 14, ప్రభాతవార్త**



సంతనూతలపాడు వడ్డెరపాలెంలో ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉంటున్న తన్నీరు అంకమ్మకు దాత కందుల బ్రహ్మయ్య అందించిన నిత్యవసర వస్తువులు, బియ్యంను సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. తన్నీరు అంకమ్మ బేల్దారి పని చేస్తూ గోడకూలి మీద పడి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కుటుంబానికి చేయూతనందించారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండేర్, ఎన్నారై, పాతూరి సంపత్ ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ ఛైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల రాంగోపాల్, ట్రస్టు సభ్యులు శీలం మల్లారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్‌ను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు

**సంతనూతలపాడు, జులై 14, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో మంగళ వారం నాడు డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్‌ను ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు. స్వచ్ఛ రథం కార్యక్రమాలు, ఐవీఆర్ కాల్స్‌పై ఎంపీడీవో సురేష్‌బాబు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆవులయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ భూములకు తగ్గిన వేలం ధరలు

**బల్లికురవ జులై 14( ప్రభాతవార్త)**



ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మండలంలోనికొని దేన గ్రామంలో వేంచేసి ఉన్న శంకర స్వామి ఆలయ భూముల కవులు ధర గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది తగ్గిపోయాయి.మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఈ.వో కృష్ణారెడ్డి పర్యవేక్షణలో భూముల వేలం నిర్వహించారు. మొత్తం ఎనిమిది బిట్లుగా భూముల వేల నిర్వహించగా రూ 1,38,000 ధర పలికింది. గత ఏడాది ఇదే భూములకు రూ 1,96 వేలు ధర పలికింది. మల్లాయపాలెంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో భూముల వేలం నిర్వహించగా ఐదు బిట్లలోని 19 ఎకరాల భూములకు రూ 62,000 కవులు ధర పలికింది. ఇవే భూములకు గతేడాది 96,000 ధర పలకటం గమనార్హం.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం

**ఉలవపాడు, జూలై 14, ప్రభాతవార్త**




మండలంలోని కేరాజుపాలెం, కొల్లూరుపాడు గ్రామాలలో పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలోఉలవపాడు మండల వ్యవసాయాధికారి డి. విజయకుమార్ మాట్లాడు తూ ఖరీఫ్ లో పంట వేసిన ప్రతి రైతు యూరియా, డిఏపి గురించి తమ పొలం వివరాలు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలన్నారు. వరి, కంది సజ్జ, మిరప, మినుములు, నువ్వులు, ప్రత్తి పంటలకు పంటల భీమా నమోదుకు అవకాశం ఇవ్వడం జరిగిందని, వరి పంటకు ఆగష్టు 15,వరకు మిగతా పంటలకు జూలై 31 లోగా పంటల బీమా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో విఏఏ సాజిద్, కందుకూరు ఏఎంసి అధికారి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## జులై 7వ తేదీ వరకు ఎస్ఐఆర్ పక్రియ పొడిగింపు

### - ఎన్నికల అధికారి ఏ.శాంతి లక్ష్మీ

**దర్శి, జులై 14, ప్రభాతవార్త**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమంలో భాగంగా 14వ తేదీ వరకు ఎస్ఐఆర్ పక్రియలో డిజిటలైజేషన్ 100 శాతం పూర్తయిందని దర్శి నియోజకవర్గ ఈఆర్వోని శాంతి లక్ష్మీ తెలిపారు. అదే విధంగా ఈనెల జులై 7వ తేదీ వరకు ఎస్ఐఆర్ పక్రియ తొలగించడం జరిగిందని, ఇప్పటి వరకు ఎవరైనా ఓటర్ సంబంధించి ఇవ్వకపోతే వెంటనే బీఎల్‌వోలను సంప్రదించి ఆ ఓటర్ పక్రియను పూర్తి చేసుకోవాలని ఆమె తెలిపారు. దర్శి నియోజకవర్గంలో మొత్తం 2,25254 మంది ఓటర్లకు బీఎల్‌వోలు డిజిటల్ పక్రియ పూర్తి చేశారన్నారు. ఎస్ఐఆర్ పక్రియ పొడిగించడం జరిగిందని, దీనిని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లాలో ఎస్ఐఆర్ పక్రియ దర్శి నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను సందర్శించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, జులై 14, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పరిశీలించారు. భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ ద్వారా నిరుపేదలకు రూ.5లకే పరిశుభ్రమైన వాతావరణం - ఆరోగ్యకరమైన భోజనం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. అన్న క్యాంటీలన్లో ప్రతి రోజు ఎంతో నాణ్యమైన,రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనాన్ని గౌరవంతో అందించడానికి మా సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. అందుకే, మన కోసం ఏర్పాటు చేసిన ఈ అన్నా క్యాంటీన్‌ను పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత, మనమందరం కలిసికట్టుగా మన అన్న క్యాంటీన్‌ను శుభ్రంగా ఉంచుకుందామని తెలియజేశారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ

**ముండ్లమూరు, జులై 14, ప్రభాతవార్త**



ముండ్లమూరులో టీడీపీ నాయకులు మేదర మెట్ల వీరనారాయణ లక్ష్మీదేవిల నూతన గృహ ప్రవేశ వేడుకలో దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరణః అనంతరం ముండ్లమూరులో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు, కార్యకర్తల నుండి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామస్వామి కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ లలిత్ సాగర్

**ముండ్లమూరు, జులై 14, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామంలో టీడీపీ కార్యకర్త బత్తుల రామస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. మృతి సంతాపంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పరామర్శించారు. అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, టీడీపీ నాయకులు దేవినేని కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ వేముల జానకి రామయ్య, బేతపూడి రామారావు, సొసైటీ అధ్యక్షులు కాటూరి గురవయ్య, సోమేపల్లి కొండయ్య, మేనక సాంబయ్య పాల్గొన్నారు.

## క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు "బీ" సర్టిఫికెట్లు అందజేత

**ఒంగోలు, జులై 14, ప్రభాతవార్త**



ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 13 మంది ఎన్ సీసీ క్యాడెట్లు బీ సర్టిఫికెట్ లో ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 13 మంది క్యాడెట్లకు ప్రశంసపత్రాలు అందజేశారు. 34 ఆంధ్రా బెటాలియన్ ఎన్ సీసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పరీక్షల్లో భాగంగా నిర్వహించిన డ్రిల్, రాతపరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు అందిచినట్లు బెటాలియన్ సభ్యులు తెలియజేశారు. ఈ సర్టిఫికెట్లు అగ్నివీర్, ఆర్మీ సెలక్షన్స్ కి ఎంతగానో ఉపయోగపడతాయని, క్యాడెట్లకు ప్రత్యేక పాయింట్లు కలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ సీసీ క్యాడెట్లకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణ, దేశసేవ అలవాటు చేసుకోవడంలో ఎన్ సీసీ ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్, సిబ్బంది, 34 ఆంధ్రా బెటాలియన్ ఎన్ సీసీ కి చెందిన పర్మినెంట్ ఇన్ స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటలకు బీమా చేసుకోవాలి

**కొండపి, జులై 14, ప్రభాతవార్త**




ఖరీఫ్ సీజన్లో సాగు చేసే పంటలకు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని కొండపి వ్యవసాయ అధికారి మాల్యాద్రి రైతులకు సూచించారుమంగళవారం కొండపి మండలం పెట్లూరు, మూగచింతల గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేచించి మాట్లాడుతూ కొండపి మండల పరిధిలో కంది మరియు వరి సాగు చేయు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియపరిచారు. దీనికి సంబందించిన పూర్తి వివరాలు పొందుపరచడం అయినది.ఈ కార్యక్రమం ఏ ఈ ఓ కుమార్ సునీత పాల్గొన్నారు

## సూపర్ ఈనారి యాప్‌లో డౌన్లోడ్ శిక్షణ కార్యక్రమాలు: ఏపీఎం సిహెచ్ కోటేశ్వరావు

**జె. పంగులూరు, జూలై 14, ప్రభాతవార్త**



స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారుల ఆధ్వర్యంలో బుధవారం మన డబ్బులుమన లెక్కలు గురించి సూపర్ ఈనారి యాప్ డౌన్లోడ్ గురించి శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని ఏపీఎం సి.హెచ్ కోటేశ్వరరావు మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీఎంసీహెచ్ కోడ్ తో మాట్లాడుతూ మండలంలోని ముగ్గురు సీసీ ల పరిధిలో మన డబ్బులుమన లెక్కలు గురించి సూపర్ ఈనారి యాప్ డౌన్లోడ్ శిక్షణ కార్యక్రమం సీసీ, ఎం చంద్రశేఖర్ పరిధిలో చందలూరు గ్రామంలోని పాత పంచాయతీ భవనం లో ఉదయం :10:30 గంటలకు, సీసీ సి.హెచ్. సాల్మన్ పరిధిలో పంగులూరు వెలుగు కార్యాలయం లో ఉదయం 11:00 కు, సీసీ జి. సురేష్ పరిధిలో రేణింగవరం లో ఎంపీపీ స్కూల్ లో ఉదయం 11:00కి ఈ శిక్షణా కార్యక్రమాలకు నిర్వహిస్తారన్నారు.

## పాఠశాలను డిప్యూటీ డిఇఓ గంగాధర్ ఆకస్మిక తనిఖీ

**జె. పంగులూరు, జూలై 14, ప్రభాతవార్త**



మండలలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చీరాల ఉప విద్యాశాఖ అధికారి గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపవిద్యా శాఖ అధికారి గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన మిసన్ టెన్త్-2027 అమలు తీరును ప్రతిరోజు పెట్టవలసిన స్లిప్ టెస్ట్ లను, క్లాసులు జరిగే పనితీరును పరిశీలించడం జరిగింది. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టు వారీగా వారు ఫేస్ చేసే సమస్యలను అడిగి తెలుసుకొని తగు సూచనలు ప్రధానోపాధ్యాయులు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు డిప్యూటేషన్ ప్రధానోపాధ్యాయులు వై. వనిత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం


**వలేటివారిపాలెం.జూలై 14. ప్రభాతవార్త**



మండలంలోని బడేవారిపాలెం మరియు పోకూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంద కార్యక్రమాన్ని ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.వి.ఎల్. దుర్గ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ ని నో ప్రభావం గురించి మరియు సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.వి.ఎల్. దుర్గ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చరణ్ సాయి, అఫ్రీన్, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ ఉచిత సేవలు

**వలేటివారిపాలెం, జులై 14, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోఎంపీపీ ఎస్ స్కూలు పరిధిలోని దివ్యాంగ పిల్లలకు బోధించే భవితా స్కూల్లో మంగళవారం ఫిజియోథెరపీ సేవలను ఉచితంగా అందించారు. ఇది ప్రతి మంగళవారం భవిత సెంటర్లో సిపి పిల్లలకు, లోకో మోటర్ డిజాబిలిటీ పిల్లలకు అలాగే ఇతర దివ్యాంగులు పిల్లలకు ఉచితంగా అందిస్తున్నారు. కావున ప్రభుత్వ స్కూలులో ఉండే దివ్యాంగులైన పిల్లలకి ప్రతి ఎంపీపీ ఎస్ స్కూల్ పరిధిలోని భవితా స్కూల్లో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలో అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఫిజియోథెరపీ సురేష్ బాబు ఐఈ టీచర్ వెన్నపూసరవి. పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సంరక్షణకు పారిశుధ్య కార్మికులు గ్రీన్ అంబాసిడర్లు :ఎంపీడీవో


**సంతమాగులూరు, జూలై 14, ప్రభాతవార్త**



పారిశుధ్య కార్మికులు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమాజ ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు వెన్నెముకలుగా నిలుస్తూ గ్రీన్ అంబాసిడర్లుగా సేవలందిస్తున్నారని సంతమాగులూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గద్దల జ్యోతిర్మయి అన్నారు. నమస్తే కార్యక్రమం సందర్భంగాఅన్ని గ్రామాలలో తడి చెత్త, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్న గ్రీన్ అంబాసిడర్లను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవల వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపగలుగుతున్నారని, అందుకే వారు ఆరోగ్యకర సమాజ నిర్మాతలుగా గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లకు పండ్లు, టీ అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి నల్లూరి శివరాం ప్రసాద్, గ్రామ కార్యదర్శి దేగల రాజేశ్వరి, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## దళితవాడ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**సంతమాగులూరు, జులై 14, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన సంతమాగులూరు గ్రామంలోని దళితవాడలో దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామాల సమగ్రాభివృద్ధిలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న మంత్రి రవికుమార్ మార్గదర్శకత్వంలో సుమారు 25 నుంచి 35 లక్షల రూపాయల వ్యయంతో 600 మీటర్ల పొడవున రెండు అడుగుల వెడల్పు, మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తుతో మురుగునీటి కాల్వ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈ సందర్భంగా సంతమాగులూరు మండల టిడిపి అధ్యక్షులు చేవూరి వాసిరెడ్డి, మండల నాయకులు గడ్డం నాగిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రమైన సంతమాగులూరు సమగ్ర అభివృద్ధికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రణాళికాబద్ధంగా సహకరిస్తున్నారని తెలిపారు. దళితవాడలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడంలో మంత్రి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపడం ప్రజాప్రతినిధుల బాధ్యతాయుత వైఖరికి నిదర్శనం గా నిలిచిందని గ్రామస్తులు కొనియాడారు.

15-7Pg5_15-7Pg5.qxd 14/Jul/26 11:37 PM Page 1



# మరణశయ్యపై ముజ్తబా ఖమేనీ!



## ప్రస్తుత ఇరాన్ సుప్రీం లీడర్ 90% ప్రాణాలు కోల్పోయినట్లే..

### ఆదేశ సైనిక సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యం : ట్రంప్

**వాషింగ్టన్,జులై 14:** అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఆ దేశ సైనిక సామర్థం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, అగ్ర కమాండర్లందరూ హతమయ్యారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కూడా 90 శాతం ప్రాణాలు కోల్పోయినట్లే అని పేర్కొనడం అంతర్జాతీయంగా పెను సంచలనం రేపుతోంది. ఇరాన్ సైనిక పరిస్థితిపై ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఇరాన్ వద్ద నావికాదళం లేదు, వైమానిక దళం లేదు అంతా శూన్యం. వారి యాంటీఎయిర్‌క్రాఫ్ట్ నిఘా వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వారి అగ్రనాయకులు, అత్యంత ప్రతిభావంతులైన కమాండర్లు అందరూ హతమయ్యారని ట్రంప్ వివరించారు. ఈ క్రమంలో ఆయన 1989లో మరణించిన ఇరాన్ విప్లవ నేత ఖొమేనీ పేరును ప్రస్తావించినప్పటికీ ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరు దేశాల (అమెరికా, ఇజ్రాయెల్) దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశించే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. తండ్రి మరణించిన అదే దాడుల్లో తీవ్రంగా గాయపడి, గత వారం జరిగిన అంత్యక్రియలకు కూడా హాజరుకాని ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ 90 శాతం మరణ శయ్యపై ఉన్నారంటూ ట్రంప్ సంచలన విషయాలు బయటపెట్టారు. కొన్ని నెలల తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత, గత వారంనుండి అమెరికాతిరిగి ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపిస్తోంది. ఈ మిలిటరీ యాక్షన్‌పై ట్రంప్ అధికారికంగా యుఎస్ కాంగ్రెస్‌కు కూడా నోటిఫికేషన్ పంపారు. ఇదే సమయంలో అంతర్జాతీయ నౌకల రాకపోకల విషయంలో వందల సంవత్సరాలుగా వస్తున్న అమెరికా స్వేచ్ఛా నౌకాయాన విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ ఇకపై అమెరికా సురక్షిత ప్రయాణ రుసుము వసూలు చేస్తుందని స్పష్టం చేశారు. అమెరికా చర్యలను ఇరాన్ కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తోంది. బహ్రెయిన్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన రెండు చమురు రవాణా నౌకలపై ఇరాన్‌క్షిపణి దాడులు చేయడంతో, ఒక భారతీయ పౌరుడు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఘటనతో అబుదాబి, దుబాయ్ వంటి సంపన్న నగరాలు కలిగిన యూఎఇసైతం ఇరాన్‌పై ప్రతీకార చర్యలకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచ ముడిచమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు అమెరికా-ఇరాన్ పట్టుబడుతుండటంతో పశ్చిమాసియా ఇప్పుడు ఒక పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా మారింది.



## హర్మూజ్‌లో ఎమిరేట్స్ నౌకపై దాడి..

# భారతీయుని మృతి

### మరో 8 మందికి తీవ్ర గాయాలు

**సనా,జులై 14:** పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికాల మధ్య రేగిన ఉద్రిక్తతలు ఇప్పుడు ఇతర దేశాల పౌరుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ)కి చెందిన రెండు జాతీయ చమురు నౌకలపై ఇరాన్ జరిపిన భారీ క్షిపణి దాడిలో ఒక భారతీయ నౌకా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారని, వారిలో నలుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ దాడిని యుఎఇ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని, ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పని పేర్కొంది. తమ దేశ సార్వభౌమత్వాన్ని, పౌరులను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని, ఈ దుశ్చర్యకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని యుఎఇ స్పష్టం చేసింది. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే అమెరికా సేనలు ఇరాన్‌పై వైమానిక దాడులను మరింత తీవ్రం చేశాయి. ఇరాన్ దాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు తాము సరికొత్త వైమానిక దాడులను ప్రారంభించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. మేం ఇరాన్‌ను చాలా బలంగా దెబ్బతీస్తున్నాం. వారి దాడి చేసే శక్తినంతటినీ తుడిచిపెడుతున్నాం. హర్మూజ్ జలసంధిని మా అదుపులోకి తెచ్చుకుని, దిగ్బంధాన్ని కఠినతరం చేస్తున్నాం అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్ నుండి ప్రకటించారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల రక్షణ బాధ్యతను తామే చూసుకుంటున్నందున, దానికి ప్రతిఫలంగా ఆయా నౌకల నుంచి రక్షణ రుసుము వసూలు చేయబోతున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు.




## కొవిడ్ వ్యాక్సిన్‌తో రక్తం గడ్డకట్టే కేసులు పెరగలేదు - ఐసిఎంఆర్ నివేదిక

**న్యూఢిల్లీ,జులై 14:** కొవిడ్ వ్యాక్సిన్ వల్ల రక్తం గడ్డకట్టే కేసులు కానీ, గుండెపోటు కేసులు కానీ పెరగలేదని ఐసిఎంఆర్ తన స్టడీ నివేదిక విడుదల చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్, నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఎపిడమాలజీ దేశ వ్యాప్తంగా సుమారు 25 ఆస్పత్రుల్లో ఆ స్టడీ నిర్వహించారు. కోవిడ్19 టీకాకు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే సంఘటనలతో ఎటువంటి సంబంధంలేదని ఐసిఎంఆర్ తన అధ్యయనంలో తేల్చింది. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారిలో కోవిడ్ టీకాలతో గుండెపోటు కానీ రక్తం గడ్డకట్టే కేసులు నమోదు కాలేదని ఐసిఎంఆర్ తన రిపోర్టులో చెప్పింది. 2021-23 మధ్య కాలంలో భారత్‌లో చోటుచేసుకున్న త్రాంబాటిక్ సంఘటనలు, ఆస్పత్రుల్లో కేస్ స్టడీ అన్న టైటిల్‌తో సర్వే చేపట్టారు. త్రాంబాసిస్ అంటే రక్తం గడ్డకట్టే ప్రక్రియ. ఈ పరిస్థితి చాలా వరకు కేసుల్లో మెడికల్ లేదా లైఫ్ స్టైయిల్ రిస్క్ ఫ్యాక్టర్ల వల్ల వస్తున్నట్లు గుర్తించారు. కోవిడ్ కన్నా ముందు నుంచి సిగరేట్ అలవాటు ఉండడం కానీ, గతంలో ఏవైనా వ్యాధులు ఉండడం వల్లకానీ, కుటుంబీకుల్లో రక్త సమస్యలు ఉన్నవారిలో టీకా రిస్క్ ఉన్నట్లు గుర్తించారని స్టడీలోతెలిపారు. మే 2023 నాటికి సుమారు 97 శాతం అర్హులైన వారికి ఇండియాలో ఓ డోసు కోవిడ్ 19 వ్యాక్సిన్ ఇచ్చారు. ఇక అప్పటికే 90 శాతం మందికి రెండు దశల డోసు తీసుకున్నారు. ముందస్తుజాగ్రత్తగా హెల్త్‌కేర్ సిబ్బందికి మూడవ డోసు ఇచ్చారు. 60 యేళ్ల దాటిన వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా మూడో డోసు ఇచ్చారు. వ్యాక్సినేషన్ వల్ల బెనిఫిట్స్ జరిగినట్లు స్టడీలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి భారత్‌తోపాటు విదేశాల్లోనూ విస్తృత ఆధారాలు ఉన్నట్లు స్టడీలో తెలిపారు.

## ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహ్మదీ నెజాద్‌తో ఇజ్రాయెల్ కుట్ర!



### ఖమేనీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు వ్యూహం లీక్

**టెహ్రాన్,జులై 14:** ఇరాన్‌లో ప్రస్తుత ఇస్లామిక్ ప్రభుత్వాన్ని కూలదోసి, ఆ స్థానంలో అహ్మదీ నెజాద్‌ను ఇరాన్ అధినేతగా కూర్చోబెట్టేందుకు ఇజ్రాయెల్ ఒక భారీ రహస్య వ్యూహాన్ని రచించినట్లు అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ గూఢచారి వర్గాల ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం ప్రచురించింది. ప్రస్తుతం ఈ కుట్ర ఇరాన్ నిఘావర్గాలకు తెలిసిపోవడంతో అహ్మదీ నెజాద్‌ను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) గృహనిర్బంధంలో ఉంచినట్లు తెలుస్తోంది. ఇరాన్ అత్యున్నత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీతో వచ్చిన విభేదాలు, దేశ పతనంపై ఉన్న అసంతృప్తితోనే అహ్మదీనెజాద్ ఇజ్రాయెల్ ప్రతిపాదనలకు తలొగ్గినట్లు సమాచారం.

2024లో హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లోని లుడోవికా యూనివర్సిటీలో జరిగిన పర్యావరణ సదస్సు కేవలం ఒక ముసుగు మాత్రమేనని, అక్కడే ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ అప్పటి చీఫ్ డేవిడ్ బార్నియా నేరుగా అహ్మదీనెజాద్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారని కథనంలో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ అధికారులతో చర్చలు జరిపేందుకు అహ్మదీ నెజాద్ ప్రయాణ, వసతి ఖర్చులను కూడా ఇజ్రాయెలే భరించిందని,

ఈ విషయాన్ని మొసాద్ సంస్థ అమెరికా సిఐఎకి కూడా చేరవేసిందని సమాచారం. ఇటీవల ఇరాన్ -అమెరికా మధ్య జరిగిన దాడుల సమయంలో ఈ వ్యూహం పతాక స్థాయికి చేరింది. ఇరాన్‌లోని అహ్మదీ నెజాద్ నివాసంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిగి ఆయన రక్షణ వాహనాలు ధ్వంసమైన వెంటనే, ఒక నల్లటి ప్యుజో కారు అక్కడికి చేరుకుని ఆయనను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆ కారును నడిపింది మొసాద్ ఏజెంట్లని సమాచారం. ఇజ్రాయెల్ తనను మళ్లీ అధికారంలోకి తెస్తుందనే నమ్మకం సడలడం, ఆ రక్షణ చర్యలపై అనుమానాలు రావడంతో అహ్మదీ నెజాద్ ఆ సేఫ్ హౌస్ నుండి బయటకు వచ్చేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి నుండి ప్రజల కంటపడని ఆయన గత వారం దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియల వేళ మాత్రమే కొద్దిసేపు కనిపించారు.

2005 నుండి 2013 వరకు ఇరాన్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అహ్మదీనెజాద్ ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడేవారు. కానీ పదవి నుంచి దిగిపోయాక అవినీతిని వ్యతిరేకిస్తూ తన గొంతు మార్చారు. ప్రస్తుత ఇస్లామిక్ వ్యవస్థ కుప్పకూలితే తాను దేశాన్ని నడిపించగలనని, ట్రంప్ హయాంలో కుదిరిన అబ్రహం ఒప్పందాల తరహాలోనే ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెస్తానని ఆయన సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంచలన ఆరోపణలపై అటు ఇరాన్ కానీ, ఇటు ఇజ్రాయెల్ కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# హర్మూజ్ టాక్స్ విత్‌డ్రా

### గల్ఫ్ దేశాలతో పెట్టుబడి, వాణిజ్య ఒప్పందాలకే ట్రంప్ మొగ్గు

**వాషింగ్టన్,జులై 14:** హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే సరుకు రవాణాపై 20 శాతం రుసుము విధిస్తామని చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకున్నారు. దానికి బదులుగా మధ్యప్రాచ్యంలోని గల్ఫ్ దేశాలు అమెరికాలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రయోజనం పొందాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్ మధ్యప్రాచ్య దేశాల నాయకులతో అత్యంత ఫలప్రదమైన చర్చలు జరిపిన అనంతరం, అమెరికాకు చెల్లించాల్సిన 20 శాతం రీయింబర్స్‌మెంట్ ఫీజును రద్దు చేసి, దాని స్థానంలో గల్ఫ్ దేశాలతో భారీ పెట్టుబడి, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించానని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు అపార స్థాయిలో ఉంటాయని, అవి అమెరికాతో పాటు గల్ఫ్ దేశాల భవిష్యత్తుకూ ఎంతో ప్రయోజనకరంగా మారతాయని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో కొత్త పరిశ్రమలు, తయారీ యూనిట్లు, ప్లాంట్లు, ఆధునిక పరికరాల తయారీ కేంద్రాలు చారిత్రక స్థాయిలో ఏర్పడతాయని, దాంతో లక్షలాది అధిక వేతనాల ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన చెప్పారు. అంతకుముందురోజే ట్రంప్ హర్మూజ్ జలసంధి గుండా రవాణా అయ్యే ప్రతి సరుకుపై 20శాతం రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు. ప్రపంచంలోని అత్యంత కీలక సముద్ర మార్గాల్లో ఒకటైన హర్మూజ్ జలసంధి భద్రత కోసం అమెరికా భారీ వ్యయం చేస్తోందని, ఆ ఖర్చును భర్తీ చేసేందుకు ఈ రుసుము అవసరమని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఇకపై హర్మూజ్ జలసంధి సంరక్షక దేశంగా వ్యవహరిస్తుందని, ఆ ప్రాంతంలో భద్రత, రక్షణ కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని సరుకు రవాణాపై 20 శాతం రుసుము రూపంలో వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌పై కఠిన వైఖరిహోర్ముజ్ జలసంధి ఇతరదేశాలకు తెరిచి ఉన్నప్పటికీ, ఇరాన్‌కు మాత్రం అందుబాటులో ఉండదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నాయకత్వం హింసాత్మక, మోసపూరిత విధానాలను అనుసరిస్తోందని ఆరోపించిన ఆయన, ఇరాన్‌కు సంబంధించిన నౌకలు లేదా ఇరాన్ సరుకు రవాణా చేసే నౌకలపై పూర్తి దిగ్బంధనం అమలు చేస్తామని హెచ్చరించారు.


## కోడలికి మామ ఆస్తిలో పోషణహక్కు: సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ,జులై 14:** హిందూ కుటుంబాలలో కోడళ్ల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది.మామ మరణించిన తర్వాత భర్త మరణించినప్పటికీ, కోడలు తన మామ ఆస్తి నుండి భరణం పొందేందుకు అర్హురాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ హక్కు హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, (1956) ప్రకారం వర్తిస్తుందని కోర్టు పేర్కొంది. జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ధర్మాసనం ఈ తీర్పునువెలువరించింది. తీర్పులో కుటుంబ సభ్యులను ఆదుకోవడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక, నైతిక బాధ్యత కూడా అని పేర్కొంది. మనుస్మృతిలోని తల్లి, తండ్రి, భార్య మరియు కుమారుడినిఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదు. వారిని విస్మరించడం నైతిక నేరం అనే భావనను కూడా ప్రస్తావించింది. భర్త మరణించిన సమయాన్ని ఆధారంగా తీసుకుని కోడలికి భరణం నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. మామ బతికున్నప్పుడే భర్త మరణించి ఉండాలనే నిబంధన విధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (గౌరవప్రదమైన జీవన హక్కు)లకు విరుద్ధమని స్పష్టం చేసింది. మహేంద్ర ప్రసాద్ 2021లో మరణించారు. అనంతరం ఆయన కుమారుడు రంజిత్ శర్మ 2023లో (తండ్రి మరణించిన తర్వాత) మరణించారు. రంజిత్ శర్మ భార్య గీతా శర్మ తన పోషణ కోసం మామ ఆస్తి నుండి భరణం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దిగువ కోర్టు, గీతా శర్మ మామ జీవించి ఉన్న సమయంలో విధవరాలు కాలేదనే కారణంతో ఆమె పిటిషన్‌ను తిరస్కరించింది. సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేస్తూ, భర్త మరణించిన సమయాన్ని ఆధారంగా తీసుకుని భరణం నిరాకరించడం చట్టబద్ధం కాదని పేర్కొంది. గీతా శర్మకు మామ ఆస్తి నుండి భరణం పొందే హక్కు ఉందని తీర్పు ఇచ్చింది. మామ ఆస్తిని పొందిన వారసులు, చట్టం ప్రకారం ఆధారపడిన కోడలి పోషణ బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది భర్తకు స్వంత ఆస్తి లేకపోయినా, తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్న కోడలికి భరణం కోరే హక్కు ఉంటుంది మహిళల గౌరవం, జీవన భద్రతను కాపాడే విధంగా చట్టాలను విస్తృతంగా అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# సంక్షిప్త వార్తలు

## అభా విమానాశ్రయంపై హూతీల దాడి



**రియాద్, జులై 14:** అమెరికా - ఇరాన్ ఉద్రిక్తతలు సరిపోనట్లు.. ఇప్పుడు సౌదీ అరేబియా-హూతీల మధ్య మరోసారి ఘర్షణలు చెలరేగాయి. సౌదీలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీ తిరుగు బాటుదారులు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఇరాన్ నుంచి హూతీ ప్రతినిధుల బృందాన్ని తీసుకువస్తున్న విమానాన్ని అడ్డుకునేందుకు సోమవారం సౌదీ మద్దతున్న యెమెన్ ప్రభుత్వం సనా అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేపై బాంబు దాడి చేయడంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగేళ్లుగా సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతు ఉన్న హూతీ మధ్య ఉన్న ప్రశాంతతకు ఈ దాడులతో బ్రేకులు పడినట్లయింది.

## మూడు లక్షలకుపైగా అమర్‌నాథ్‌ను సందర్శించిన భక్తులు



**శ్రీనగర్,జులై 14:** పవిత్ర అమర్‌నాథ్ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధలతో విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే దర్శించుకున్న భక్తుల సంఖ్య 2.75 లక్షలు దాటి మూడు లక్షలకు చేరువైంది. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉంది. మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్‌కు బయలుదేరింది.

## భోజ్‌శాలలో శుక్రవారం ప్రార్థనలకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ, జులై 14:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాలలో ఉన్న వివాదాస్పద సరస్వతీ దేవి గుడి స్థలం వద్ద శుక్రవారం పూట ప్రార్థనలు జరుపుకునేందుకు ముస్లింలకు సుప్రీంకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. వివాదాస్పద ప్రాంతానికి పక్కలో ముస్లింలకు కొంత స్థలాన్ని ప్రార్థనల కోసం కేటాయించాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆ స్థలంలో శుక్రవారం మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య ముస్లింలు నమాజ్ చేసుకోవాలని కోర్టు సూచించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

## అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ ఆకస్మిక బదిలీ



**చెన్నై,జులై 14:** తమిళనాడు రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపిఎస్ అధికారి ఎ. అరుణ్‌ను నియమించిన రెండు నెలల్లోనే విజయ్ ప్రభుత్వం ఆ పోస్టు నుంచి బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ర్యాంక్ అధికారిణి సి.మహేశ్వరిని డివిఎసి పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో కొత్త చీఫ్‌గా నియమిస్తూ అడిషనల్ చీఫ్ సెక్రటరీ కె.మణివాసన్ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడిజిపి ర్యాంక్ అధికారి అయిన అరుణ్‌ను చెన్నైలోని తమిళనాడు పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా పంపారు. ఈ యేడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత మే నెల చివరి వారంలో విజయ్ ప్రభుత్వం అరుణ్‌ను డివిఏపి చీఫ్‌గా నియమించింది.

## ప్రశాంత్ కిశోర్ ఆస్తులు రూ. 96 కోట్లు!

**బంకిపూర్,జులై 14:** బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.96 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.22.19 కోట్ల విలువైన చరాస్తులు, రూ.73.87 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు. ఆయన భార్య జాహ్నవి దాస్ పేరిట రూ.89.51 కోట్ల చరాస్తులు, రూ.12.42 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడైంది. నామినేషన్ దాఖలు చేసే ముందు సోన్‌పూర్‌లోని బాబా హరిహర్‌నాథ్ ఆలయంలో ప్రశాంత్ కిశోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## లష్కరేచీఫ్ హఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారంట్

**న్యూఢిల్లీ,జులై 14:**లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌పై జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పెహల్గామ్ ఉగ్రదాడితో లింకున్న కేసులో కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. జులై 8వ తేదీన ఎన్ఐఎ కోర్టు ప్రత్యేక జడ్జీ ఆ ఆదేశాలు జారీ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో హఫీజ్ సయీద్‌పై ఎన్ఐఏ నేరాభియోగం నమోదు చేసిన తర్వాత కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. భారత్, అమెరికా దేశాలు హఫీజ్ సయీద్‌ను గ్లోబల్ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తతెలిసిందే. 2008 ముంబై ఉగ్రదాడి కేసులో మాస్టర్‌మైండ్ కూడా. 76 ఏళ్ల సయీద్‌పై సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

భారతీయ న్యాయ సంహితో పాటు యుఎపిఎ సెక్షన్ల కింద అతనిపై కేసు బుక్ చేశారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులోఉన్న సరోగ్దాలో సయీద్ ఉంటున్నట్లు ఎన్ఐఎ కోర్టుకు చెప్పింది. పెహల్గామ్ ఉగ్రదాడి నిందితుడైన హఫీజ్.. ప్రస్తుతం అరెస్టు నుంచి తప్పించు కున్నట్లు కోర్టు పేర్కొన్నది. హఫీజ్ అరెస్టు కోసం నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎన్ఐఎ.. ఎట్టి పరిస్థితుల్లో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో నిష్పాక్షిక దర్యాప్తు కోసం సయీద్‌ను కస్టడీలోకి తీసుకోవాలని ఎన్ఐఎ పేర్కొన్నది. నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ ఆదేశాలను జమ్మూ డీఐజీకి పంపినట్లు ఎన్ఐఎ కోర్టు తెలిపింది. 2025 ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

## ప్రధానిమోడీకి కేతన్ అగర్వాల్ తల్లి సుదీర్ఘలేఖ




**పూణె,జులై 14:** పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ ఆయన తల్లి రాఖీ అగర్వాల్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి భావోద్వేగభరితమైన లేఖ రాశారు. తన కుమారుడి మరణంతో తమ ప్రపంచం శూన్యమైందని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ కేసును కేవలం మరో ఫైల్‌గా పరిగణించవద్దని ప్రధానిని వేడుకున్నారు. గత నెల 18న 26 యేళ్ల కేతన్ అగర్వాల్‌ను లోహగడ్ కోటపై నుంచి తోసి హత్య చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా నిర్ధారించిన పోలీసులు, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రధానమంత్రికి పంపిన ఈమెయిల్‌లో రాఖీ అగర్వాల్ తన మనోవేదనను పంచుకున్నారు. ప్రతి తల్లిలాగే, నా కుమారుడు వివాహం చేసుకుని మా కళ్ల ముందే సంతోషంగా జీవించాలని కలలు కన్నాను. కానీ, విధి వైపరీత్యం వల్ల నా బిడ్డకు నేనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ కేసులో మరో విషాదం కూడా చోటుచేసుకుంది. కేతన్ మరణాన్ని తట్టుకోలేక, సుమారు 20 రోజుల తర్వాత అతని తాత దేవీచంద్ అగర్వాల్ (71) గుండెపోటుతో మరణించారు. కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే మా కుటుంబం రెండు తరాలను కోల్పోయిందని రాఖీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎలాంటి సానుభూతిని లేదా ప్రత్యేక సహాయాన్ని కోరడం లేదని స్పష్టం చేసిన రాఖీ, న్యాయం జరగడంలో జాప్యం జరిగే కొద్దీ తమ బాధ రెట్టింపు అవుతోందని పేర్కొన్నారు. దయచేసి కేతన్ కేసును మరో ఫైల్‌గా మిగిలిపోనివ్వకండి. నాకు అతనే సర్వస్వం. ఏదో ఒకరోజు నా కుమారుడి చిత్రపటం ముందు నిలబడి నీకున్యాయం జరిగిందని చెప్పాలనుకుంటున్నానని ఆమె తన లేఖను ముగించారు. గత వారం కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, విచారణను వేగవంతం చేయాలని విన్నవించారు.

## 14 యేళ్లకు.. పగతీర్చుకున్న ఏనుగు!



### ఓ కుటుంబాన్ని అంతం చేసిన నేపాల్ 'ధ్రుబే'

**ఖాట్మండు,జులై 14:** నేపాల్‌కు చెందిన ఒక ఏనుగు పగబట్టి ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పగబట్టి వెంటాడింది. ఈ క్రమంలో 14 యేళ్ల క్రితమే ఇద్దరిని చంపేసింది. దాంతో భయపడిన ఆ కుటుంబం ఊరి వదిలిపోయి వేరే ఊళ్లో మకాం పెట్టింది. అయినా ఆ కుటుంబాన్ని పసిగట్టి మరో ఇద్దరిని చంపేసింది. దాంతో ఆ ఏనుగు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లు అయ్యింది. ఈ హృదయవిదారక ఘటన నేపాల్‌లో చోటుచేసుకుంది. నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్ సమీపంలో నివసించే శనిచర బోటే కుటుంబానికి ధ్రుబే అనే ఏనుగు రూపంలో మృత్యువు వేటాడింది. 2012 డిసెంబర్‌లో మాడి అనే పట్టణంలో ధ్రుబే ఏనుగు దాడిచేసి శనిచర తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన శనిచర తన కుటుంబాన్ని ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాప్తి నది దాటి దాదాపు 9 మైళ్ల దూరంలోని జగత్‌పూర్‌కు తన నివాసాన్ని మార్చాడు. ఇకతమకు ఆ ఏనుగు నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని భావించాడు. అయితే విధి వారిని వెక్కిరించింది. 14 యేళ్ల తర్వాత అదే ధ్రుబే ఏనుగువాసనతో పసిగట్టి వారిని వెతుక్కుంటూ వచ్చింది.

ఈ నెల ఆరంభంలో జగత్‌పూర్‌లోని శనిచర ఇంటిపై దాడిచేసి, అతని 25 ఏళ్ల కోడలు ఆషికాబోటేను, 4 ఏళ్ల మనవడు భరత్ బోటేను అతి కిరాతకంగా చంపేసింది. నదులుదాటి ఇంత దూరం వస్తే మమ్మల్ని ఏమీ చేయలేదని అనుకున్నాం. కానీ ఇన్ని సంవత్స రాల తర్వాత అదే ఏనుగు మమ్మల్ని వెతుక్కుంటూవచ్చి నా కోడలిని, మనవడిని బలిగొంది. ఇక పారిపోవడానికి చోటు కూడాలేదు అంటూ ఆయన కన్నీరు మున్నీరయ్యారు. ధ్రుబే ఏనుగు నేపాల్‌లో అత్యంత ప్రమాదకరమైనదిగా పేరుగాంచింది. 2010 నుంచి ఇప్పటివరకు ఈ ఒక్క ఏనుగే 25 మందిని చంపినట్లు చిత్వాన్ నేషనల్ పార్క్ అధికారులు ధ్రువీకరించారు.

15-7Pg6exHMNWJQE_15-7Pg6exHMNWJQE.qxd 14/Jul/26 11:56 PM Page 1



# అమరావతితోనే వైసిపి అంతం

## మతిపోయి 'మావిగన్' అంటున్న జగన్

### రాష్ట్ర సామాజిక సంక్షేమబోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య



**విజయవాడ.జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా రాజధాని అమరా వతిపై విషప్రచారం చేసినంత కాలం వైసీపీ పార్టీకి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయ మనుగడ ఉండదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాల కోటయ్య వ్యాఖ్యానించారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని చెరలు పెట్టినట్లు, ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాజధానిని, రాజధాని రైతులను చెరలు పెట్టి, చెరశాలల పాలు చేసి, మళ్లీ ఏమీ ఎరుగని రీతిలో అమ రావతిలో రైతులకు అన్యాయం అంటూ విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 28,881 మంది రైతులు 34,348 ఎకరాలను ఇస్తే, రైతులను స్వార్థపరులని, ఒక సామాజిక వర్గం అని, ఎడారి అని, స్మశానం అని, వార్తలొస్తాయి అని తప్పుడు ప్రచారం చేసి, ఇప్పుడు ఏ రైతుల గూర్చి మాట్లాడతారు? అని ప్రశ్నించారు. గత పన్నెండేళ్ళుగా భూ సమీకరణకు సహకరించకుడా కోర్టులకు వెళ్ళిన కొద్దిపాటి రైతులను ఆసరా చేసుకొని మళ్ళీ అమరావతిపై కొత్త దాడి చేసేం దుకు కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, అనారోగ్యంతో మృతి చెందిన గుంటక పద్మనాభ రెడ్డి మృతిని రాజధానిలో ఆగిన రైతు గుండెగా సొంత మీడియాలో బాకా ఊదటం పట్ల మండి పడ్డారు. రాజధాని పనుల వేగవంతం కోసమే, ప్రభుత్వం భూ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చిందని, కోర్టులకు వెళ్ళిన రైతులు ప్రభుత్వానికి సహ కరించాలని కోరారు. భూములు ఇవ్వాల్సి న ఉండ వల్లి , నవులూరు గ్రామాలలోని కొద్దిమంది వైసీపీని నమ్ముకుంటే, కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్లే అన్నారు. రాజధానికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటంతో మతిపోయి జగన్ మావిగన్ మాట ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. చింత చచ్చినా పులుపు చావలేదు అన్నట్లు అమ రావతి చేతిలో ఓడి చతికిల పడినా జగన్‌కు జ్ఞానోదయం కాలేదని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు.



## అధికారులు సమన్వయంతో పని చేయాలి: కలెక్టర్

**విజయనగరం,జులై 14 ప్రభాతవార్త:** రెవెన్యూ, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో, సమిష్టి బాధ్యతతో పని చేయడం వల్లే విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టరు అండ్ జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.రామసుందర రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వ హించిన జిల్లా అర్ధ సంవత్సర నేర సమీక్షా సమా వేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వ యంతో ఒకే తాటిపై పనిచేస్తున్నాయని అభినం దించారు. అధికారులు ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగిస్తూ, జిల్లాను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి మాట్లాడుతూ రాబోయే 5 నుండి 10 ఏళ్లలో నేరాల సరళి పూర్తిగా మారిపోతుందని భవిష్యత్తులో 60 శాతం సైబర్, సోషల్ మీడియా నేరాలే ఉంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎం.బబిత మాట్లాడుతూ, జిల్లాలో పోక్సో కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మాట్లాడుతూ గత ఆరు నెలల్లో జిల్లా పోలీసు శాఖ సాధించిన ప్రగతిని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే మహిళలపై దాడులు, గ్రేవ్ కేసులు మరియు రహదారి ప్రమాదాలు తగ్గాయన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూ రూ.3.50 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశామని, నిందితులపై నిఘాకు 360డిగ్రీస్ యాప్, సిసి కెమెరాలు, డ్రోన్లను వాడుతున్నామని ఎస్పీ వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎక్సైజ్, రవాణ, ఆర్టీసి, మున్సిపాల్టీ, విద్యుత్, మహిళా శిశు సంక్షేమ శాఖ, మెడికల్ అండ్ హెల్త్ తదితర వివిధ శాఖల ముఖ్య అధికారులు, డిఎస్పీలు ఎస్.రాఘవులు, ఆర్.గోవిందరావు, పివివి నర్సింహారావు, ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు ఇన్‌స్పెక్టర్లు మరియు ఎస్ఐలు పాల్గొన్నారు.




## వర్షిత సౌమ్య, విజయశ్రీలకు తృతీయ బహుమతి

**చీపురుపల్లి, జులై 14 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ పురుషుల మరియు మహిళల ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలలో చీపురుపల్లికి చెందిన టి.వర్షిత సౌమ్య 69 కేజీల విభాగంలోనూ, 63 కేజీల విభాగంలో కె.విజయశ్రీలు తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ నెల 11, 12 తేదీలలో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొన్నారు. చీపురుపల్లికి చెందిన రెపెక్స్ ట్రిమ్ జిమ్ కోచ్ వైవి ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న వీరిద్దరూ రాష్ట్రస్థాయిలో రజిత పథకాలు సాధించడం పట్లపలువురు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో చీపురుపల్లికి గుర్తింపు తీసు కు వచ్చిన వీరిని పలువురు అభినందించారు.

# జగన్ విలువలతో కూడిన మాటలు మాట్లాడాలి : మంత్రి కొండపల్లి



**విజయనగరం, జులై 14 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవా సాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ బోటు గల్లంతులో అదృశ్యమైన వారి కుటుంబ ాలను పరామర్శకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయటం జగన్ రెడ్డికే చెల్లుబాటు అయిందన్నారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులు, వారి సమస్యలు ఏనాడు గుర్తుకు రాలేదని కేవలం రాజకీయ లబ్ధి కోసమే జగన్‌కు ఇప్పుడు మత్స్యకారులు గుర్తుకు రావడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. అబద్ధాలు ఆడడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని బోటు గల్లంతైన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నాలుగు రోజులు పాటు హెలీకాప్టర్లు, మెరైన్ బోట్లతో సిబ్బంది విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల రూపంలో కాకుండా చేతలతో బాధిత కుటుంబాలకు తక్షణమే రు.10లక్షలు అందించిందని.. అదే గత వైసీపీ ప్రభుత్వంలో ఎందరో బాధితులకు పరిహారం ప్రకటించి ఎగ్గొట్టిన ఘనత కూడా జగన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి విమర్శించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించడం హర్షణీయం

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును జులై 24 వరకు పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తున్నది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. ఓటర్లకు తగిన అవగాహన లేకపోవడం, అవసరమైన పత్రాలు సమర్పించడానికి తగిన సమయం కావాలని, గడువు పొడిగించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ గతంలోనే ఎన్నికల సంఘాన్ని కోరింది. అందుకనుగుణంగా గడువు పొడిగించడం వలన ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడానికి మరింత వీలు కలుగుతుందని సిపిఐ(యం) భావిస్తున్నది. ఇప్పటికీ లక్షల ఫారాలు తిరిగి రావాల్సి ఉన్నందున అవసరమైతే మరికొంత కాలం గడువు పొడిగించాలని కోరుతున్నది.

# పొగాకు రైతుకు అండెవరు?

### ధరలు పెంచుతామన్న ప్రభుత్వ హామీలు ఏమయ్యాయి

### స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం

### డీసీపల్లి వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన విక్రమ్ రెడ్డి



డిసిపల్లి పొగాకు వేలం కేంద్రాని సందర్శించిన మాజీ శాసన సభ్యులు విక్రమ్ రెడ్డి

**మర్రిపాడు (నెల్లూరు), జులై 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వర్జీనియా పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని, ముఖ్యమంత్రి ధరలు పెంచాలని, తిరస్కరణలు ఉండకూడదని ఆదేశించిన కొద్ది రోజులకే పరిస్థితి మరింత దిగజారడం ఆందోళన కలిగిస్తోందని ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చెబుతున్న కనీస ధర రూ.200 కూడా రైతులకు అందని పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం విక్రమ్‌రెడ్డి సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలం కేంద్రంలో రైతులతో నేరుగా మాట్లాడి పొగాకు ధరలు పడిపోవడం, అధిక తిరస్కరణలు, కొనుగోళ్ల మందగమనంతో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అంతకు ముందుగా డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి సునీల్ కుమార్‌తో వేలం ప్రక్రియ జరుగుతున్న విధానం, ధరల తగ్గుముఖం తదితర విషయాలపై చర్చించారు. పొగాకు రైతులను ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం తీసుకునేలా చూడాలంటూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పొగాకు ఉత్పత్తిలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని, అయినా దానిని పండించే రైతు మాత్రం నష్టాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. డీసీపల్లి వేలం కేంద్రంలో 100 రోజులు పూర్తయినా కేవలం 17% శాతం పొగాకు మాత్రమే కొనుగోలు చేయడం ఆందోళనకరమన్నారు. ఇంకా 83% శాతం పొగాకు రైతుల గోదాముల్లోనే ఉండిపోవడం చూస్తే కొనుగోలు ప్రక్రియ ఎంత మందగించిందో అర్థమవుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు నెలల్లో కేవలం 32 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. వేలం కేంద్రాల్లో 50 శాతానికి పైగా బేళ్లను నో బిడ్ పేరుతో తిరస్కరి స్తున్నారని, రైతు శ్రమకు తగిన విలువ ఎందుకు దక్కడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ఏడాది బ్రైట్ పొగాకుకు రూ.280 నుంచి రూ.360 వరకు ధర లభించగా, ప్రస్తుతం రూ.160 వరకు పడిపోవడం రైతులను తీవ్రంగా నష్టపరుస్తోందన్నారు. ప్రస్తుతం బ్రైట్‌కు సగటున రూ.243, మీడియంకు రూ.216, లో గ్రేడ్‌కు రూ.187 మాత్రమే వస్తోందని, కనీసం బ్రైట్‌కు రూ.300, మీడియంకు రూ.280, లో గ్రేడ్‌కు రూ.250 ధర వస్తేనే రైతు గట్టెక్కే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.1,000 కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి ప్రభుత్వమే లేదా రైతుల సహకార సంఘాల ద్వారా నేరుగా పొగాకు కొనుగోలు చేయాలని విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## 3గ్రీన్ ఫీల్డ్ పోర్టుల విస్తరణకు ఆమోదం: మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి



**సచివాలయం,జులై 14,ప్రభాతవార్త :** రాష్ట్రంలో తీరప్రాంతాభివృద్ధిలో భాగంగా భవిష్యత్ అవసరాలు,పోర్టుల విస్తరణను దృష్టిలో పెట్టుకొని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 3గ్రీన్ ఫీల్డ్ పోర్టుల అభివృద్ధికి ఫేజ్-2లో భాగంగా భూసేకరణకు ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర పెట్టుబడులు,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. రామాయపట్నం, మూలాపేట,మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుల రెండో దశ విస్తరణకు మొత్తంగా 6,248.54ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.1638.52కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు సచివాలయంలోని ఆర్ అండ్ బి,ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో మం త్రి వెల్లడించారు. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్-2 అభివృద్ధిలో భాగంగా 1420.70 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.347కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మూలాపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్-2 అభివృద్ధిలో భాగంగా 1903.39ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.440.50 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇచ్చామన్నారు. ఉప్పు భూములతో కలపి దాదాపుగా ఈ 1903ఎకరాల భూముల్లో భూసేకరణ చేయనున్నామన్నారు. అలాగే ఆర్ అండ్ ఆర్ కూడా ఇందులోనే చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్ 2 అభివృద్ధిలో భాగంగా 2924.45 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.851కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామ న్నారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో రాజకీయ కుట్ర

### నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్




**తిరుపతి హెల్త్, జులై 14, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల పై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతున్నదని, దీనిని రద్దు చేయాలనినేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాజ్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుంది అన్నారు. ఎస్సీ వర్గీకరణను మొదటగా పంజాబ్, హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణకు బీజం వేస్తే, దేశం మొత్తం చేసిన వ్యక్తి నరేంద్ర మోడీ జీ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వల్ల వంద మందిలో ఒకరికి లేదా ఇద్దరికి న్యాయం జరుగుతోంది, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ? అని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు,రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా? అన్నారు. సామాజిక న్యాయం దళితులకు ఇచ్చే రిజర్వేషన్లలో మాత్రమేనా! దేశ సంపదలో అక్కర్లేదా? మోడీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి, క్యాబినెట్లో మంత్రి పదవుల విషయంలో సామాజిక న్యాయం అక్కర్లేదా? మాల వర్గం పై కుట్ర చేస్తుంటే,ఎస్సీ వర్గీకరణ చట్టాలు దేనికి అని,ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే! తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దేనికని ప్రశ్నించారు. మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప, జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కులం తన ఉనికిని కోల్పోఇందిని, శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పెరా చిన చెన్నయ్య, దాసరి చిన్న లింగామయ్య, మహేష్, గణేష్, నానీ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమకు జగన్ చేసిందేమిటో చెప్పాలి

### టిడిపి ఎన్ఆర్ఐ వింగ్ వేణుగోపాల్‌రెడ్డి

**విజయవాడ, జులై 14, ప్రభాతవార్త :** రాయలసీమబిడ్డని అని చెప్పుకునే మాజీముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమలో ఏఅభివృద్ధి చేసారో చెప్పాలని టిడిపి ఎన్ఆర్ఐ వింగ్ కార్యనిర్వాహక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తండ్రీకుమారులు ఇద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేసినా రాష్ట్రానికి, రాయలసీమకు చేసింది శూన్యమన్నారు. మూడుసార్లు స్టీల్‌ప్లాంట్‌కు శంఖుస్థాపన చేసినా ఒక్క ఇటుక కూడా పెట్టలేదని మండిపడ్డారు. సీమ బిడ్డలమని చెపుతూ ప్రకృతి వనరులను దోచుకున్నారని ఆరోపించారు. అన్నమయ్య ప్రాజెక్టును ఏంచేసారో రాష్ట్రమంతా చూసారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తుంటే జగన్ ఓర్చుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఇటీవల చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేసారని 2028నాటికి స్టీల్‌ప్లాంట్ పూర్తిచేస్తామన్నారు. జమ్మలమడుగులో గ్రీన్‌సిమెంటు కర్మాగారాన్ని లోకేష్ ప్రారంభించబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 20లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తుంటే జగన్ ఆండ్‌కో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నటం దారుణమన్నారు. దేశానికి వచ్చే పెట్టుబడులలో మన రాష్ట్రానికి 25శాతం పెట్టుబడులు వస్తున్నాయని జగన్‌మోహన్‌రెడ్డి తన కుట్రలు, కుతంత్రాలు మానేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, రాష్ట్రఅభివృద్ధి ఇష్టం లేకపోతే చూస్తూ కూర్చోవాలని హితవు పలికారు. జగన్ చేసే కుట్రలకు అడ్డుకట్టవేస్తామని వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు.

## ముద్రగడ పద్మనాభం మరణవార్త నన్ను తీవ్రంగా కలచివేసింది: వైఎస్ జగన్

**విజయవాడ.జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** పితృ సమానులైన ముద్రగడ పద్మనాభంమరణవార్త నన్ను తీవ్రంగా కలచివేసిందని వైసిపి నేత. మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు.,'ఎక్స్' వేదికగా ఆయన ముద్రగడ మృతికి సంతాపం ప్రకటించారు.ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన క్రమంగా కోలుకుంటున్నారనే వార్త మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి మన మధ్యకు వస్తారని ఆశిస్తున్న సమయంలోనే ఆయన ఇలా శాశ్వతంగా దూరం కావడం అత్యంత బాధాకరం. ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు చిరస్మరణీయమైన సేవలందించిన ముద్రగడ విలువలకు కట్టుబడి రాజకీయాలు చేశారు. పదవులకన్నా ప్రజలనే గొప్పగా భావించారు. తనజీవితాంతం పేదలబతుకుల్లో మార్పు కోసం తపించారు. ముఖ్యంగా కాపుసామా జికవర్గానికి పెద్దదిక్కుగా నిలిచి,వారి సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేశారు. తాను నమ్మిన మాటకు కట్టుబడి నిలబడేతత్వం, మంచికోసం ఎంతదూరమైనా వెళ్లే ధైర్యం ఆయన సొంతం. ఆత్మగౌరవానికి, నిజాయితీకి, వ్యక్తిత్వా నికి ఆయన నిలువెత్తురూపం. ముద్రగడ మర ణం ఆయన కుటుంబానికేకాదు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆయనను అభిమానించే లక్ష లాది మందికి తీరనిలోటు.ఈ విషాద సమ యంలో ఆయన కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని,ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానన్నారు.


# జిల్లా టిడిపి కార్యాలయానికి లీజుకు ప్రభుత్వ స్థలం కేటాయింపు

### ఆయిల్ ఫెడ్ స్థలాన్ని 66 యేళ్లకు రెండు ఎకరాలు కేటాయింపు

### ఎకరాకు యేడాదికి రూ.1000

### నారాయణపురం వద్ద నేషనల్ హైవేకు ఆనుకునే ప్రభుత్వ స్థలం కేటాయింపు



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Agricultural Marketing Department - Allotment of 2.00 Acres of APOILFED land located at Narayanapuram Village, Anantapuramu Urban, Ananthapuramu District on long lease basis for Construction of Telugu Desam Party District office - Orders - Issued.

AGRICULTURE & COOPERATION (MKTG.III) DEPARTMENT

G.O.Ms.No:38. Dated:14.07.2026. Read:

From the VC&MD, APOILFED, Vijayawada, Lr.No.APOILFED/PU/ATP/ADMIN/2018-19/7232, dt:25.05.2026.

ORDER:

In the reference read above, the Vice Chairman & Managing Director, Andhra Pradesh Oilseeds Growers' Federation Ltd., (APOILFED), Vijayawada has requested the Government for appropriate orders on the request of the District Collector, Ananthapuramu, for allotment land in Sy.No.211-2A1 extent 0.81 Acres and Sy.No.211-1A2 extent 1.19 Acres, total 2.00 Acres at Narayanapuram Village, Anantapuramu Urban, Ananthapuramu District, which is under the disposal of APOILFED, on long lease basis for construction of Telugu Desam party District office.

2. The Government after careful examination, hereby issued orders for allotment of land at Sy.No.211-2A1 extent 0.81 Acres and Sy.No.211-1A2 extent 1.19 Acres, total 2.00 Acres of land at Narayanapuram Village, Anantapuramu Urban, Ananthapuramu District which is under the disposal of APOILFED, for construction of Telugu Desam party District office, on lease basis for a period of (66) years, on payment of lease rent of Rs.1,000/- per acre per annum as per G.O.Ms.No.340, Revenue (Assign-I) Department, dated:21.07.2016 read with G.O.Ms.No.282, Revenue(Lands-I) Department, dated:15.05.2026 subject to the following conditions in addition to the normal conditions under Board Standing Orders:-

**అనంతపురం, జులై 14 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిని ఆనుకుని నారాయణపురం వద్ద కోట్లు విలువ చేసే ఆయిల్ ఫెడ్ స్థలంలో రెండు ఎకరాలను టిడిపి కార్యాలయం నిర్మాణానికి 66 ఏళ్ల లీజ్‌కింద రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరాకు రూ.1000 లీజు ప్రకారం చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జీఓ ఎంఎస్ నెంబర్ 38 కింద ఈ నెల 14వ తేదిన రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్ అఫిస్కో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ సీడ్స్ గ్రోహెడ్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపి ఆయిల్ ఫెడ్) కార్యాలయం అనంతపురంలో జాతీయ రహదారి పక్కన ఉంది. ఎన్నో ఏళ్ల ఆ కార్యాలయం తరుపున రైతులతో వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేయడం, ఆయిల్ ఉత్పత్తి చేయడంలో గుర్తింపు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ ఫెడ్‌కు మంచి గుర్తింపు ఉండేది. అయితే కాల క్రమేనా, ఆయిల్ ఫెడ్ వ్యవహార శైలి, సరిగా లేక పోవడం, అవినీతి అక్రమాలు ఎక్కువ కావడం తదితర కారణాల వల్ల ఆయిల్ ఫెడ్ కార్యాలయం కొన్నేళ్లుగా మూతపడిందని చెప్ప వచ్చు. గతంలో ఆయిల్ ఫెడ్ స్థలాలను అమ్మకాలు చేస్తారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనంతపురంలో ఆయిల్ ఫెడ్ స్థలంలో రెండు ఎకరాలను టీడీపీ జిల్లా కార్యాలయం కోసం దీర్ఘకాలిక లీజు కింద కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. సర్వే నెంబర్ 211-2ఎ కింద 0.81 ఎకరాలు, సర్వే నెంబర్ 211-ఎ2 కింద 1.19 ఎకరాలు కలిపి రెండు ఎకరాలను అనంతపురం అర్బన్ లోని నారాయణ పురం గ్రామం వద్ద ఆయిల్ ఫెడ్ స్థలాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లా టిడిపి కార్యాలయం నిర్మాణం కోసం 66 ఏళ్ల పాటు పర్మినెంట్ లీజు, ఎకరా రూ.1000 లీజుతో కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2016 సంవత్సరం జులై 21వ తేదిన రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 340 ప్రకారం, 2026 సంవత్సరం మే 15వ తేదిన రెవెన్యూ శాఖ కింద జీఓ ఎంఎస్ నెంబర్ 282 ప్రకారం ఈ స్థలాన్ని లీజు కింద కేటాయించినట్లు జీవోలో పేర్కొన్నారు. కోట్లు విలువ చేసే స్థలాన్ని నగరం నడి బొడ్డున జాతీయ రహదారికి ఆనుకుని రెండు ఎకరాల స్థలాన్ని జిల్లా టిడిపి కార్యాలయానికి కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఇదే విధంగా రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ స్థలాలను లీజు కింద టిడిపి కార్యాలయానికి యిచ్చినట్లు తెలియవచ్చింది. వైసిపి ప్రభుత్వంలో అక్కడక్కడ వైసిపి జిల్లాకార్యాలయాలకు కోట్లు విలువ చేసే స్థలాలను లీజు కింద యిచ్చింది.

అనంతపురం లోని హెచ్ఎల్‌సి కాలనీలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని లీజు కింద కేటాయించి వైసిపి జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు. ఈ విధంగా ఎంతో విలువైన స్థలాలను పార్టీ కార్యాలయాలకు కేటాయిస్తూ పోవడం ఎంత వరకు సబబని జనం నుంచి ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

## భక్తులను మోసం చేసిన టిటిడి మాజీ ఉద్యోగి అరెస్ట్



**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి దర్శనం ,వసతి కల్పిస్తానని భక్తులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న తిరుపతికి చెందిన టిటిడి మాజీ ఉద్యోగి టి. అరుణ్ కుమార్‌ను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు గతంలో టిటిడి ఉద్యోగం నుండి తొలగించబడి 2023లో కూడా ఇదే తరహా మోసాల కేసులో అరెస్టైనట్లు తేలింది. ఇటీవల బెంగళూరుకు చెందిన రెండు కుటుంబాల నుంచి శ్రీవాణి, తోమాల సేవ, సుప్రభాత సేవ, విఐపి దర్శనం, గెస్ట్ హౌస్‌పేరుతో 3.20 లక్షలు వసూలు చేసినట్లు గుర్తించారు. నిందితుడి బ్యాంకు ఖాతాల్లో గత ఏడాది కాలంలో సుమారు 85 లక్షల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు గుర్తించి, మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అతని వద్ద నుండి మొబైల్ ఫోన్, 99వేల రూపాయలు నగదు, మూడు బ్యాంక్ పాస్‌బుక్స్ స్వాధీనం చేసుకున్నారు.

## ఐదుగురికి అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతులు

**విశాఖపట్నం, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ లో కీలక విభాగంగా ఉన్న టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఐదుగురు అధికారులకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ పట్టణ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఈనెల 10 తేదీన జీవో విడుదల చేశారు.డిటిసిపి ఆర్ విద్యుల్లత పదోన్నతి పొం దిన అధికారులకు ప్రొసీడింగ్, పోస్టు ఉత్తర్వుల ఆదేశాలను 13వ తేదీ పేరుతో విడుదల చేశారు. అయితే అడిషనల్ డైరెక్టర్ లు గా ఆరుగురు పేర్లు సిఫార్సు చేసినప్పటికీ రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌లో సిటీప్లానర్‌గా పనిచేస్తున్న మూ ర్తికి ప్రస్తుతానికి ఆమోదం లభించలేదు. అక్టోబర్ లో జీవీఎంసీ సిసిపిగా పనిచస్తున్న ఏ ప్రభాకర్ రావు పదవి విరమణ చేశాక మూర్తికి అడిషనల్ డైరెక్టర్ గా అవకాశం లభిస్తుందని తెలిసింది. ప్రస్తుతం సీనియర్ అడిషనల్ డైరెక్టర్ లు గా బి సురేష్ కుమార్, ఏ ప్రభాకర్ రావు, యస్ వరప్ర సాద్ , సునీతలు ఉన్నారు. వీరితోపాటు తాజాగా మరో ఐదు మందికి అడిషనల్ డైరెక్టర్ హోదా లభించింది. వీళ్లకు పనిచేస్తున్న చోటే పదోన్నతి కల్పించి పోస్టింగ్ లను కొనసాగించారు. వి మీనా కుమారి కి అడిషనల్ డైరెక్టర్ హోదా కల్పిస్తూ కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా) చీఫ్ అర్బన్‌ప్లానర్ గానియమించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరే షన్ సిటీ ప్లానర్‌గా పని చేస్తున్న డిరాంబాబుకు అక్కడే పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. విజ యవాడ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ సిటీ ప్లానర్ గా విధులు నిర్వహిస్తున్న కెసంజయ్ రత్నకుమార్‌కు పదోన్నతి కల్పించి అక్కడే కొనసాగించారు. బొబ్బి లి అర్బన్ డెవ లప్మెంట్ అథారిటీ (బడా) లో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా వి శిల్పాకు పదోన్నతి కల్పించి నియమించారు. హిమబిందుకు పదోన్నతి కల్పించి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ గా నియమించారు.

15-7Pg7exHMNWJQE_15-7Pg7exHMNWJQE.qxd 14/Jul/26 11:58 PM Page 1



# వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

**విశాఖ, తిరుపతి జూ పార్కుల అభివృద్ధి, అడవుల సంరక్షణపై సమగ్ర నివేదిక**

**విశాఖ జూ పార్కు అభివృద్ధికి నిధుల సమీకరణ.. ఖాళీల భర్తీకి ప్రత్యేక చర్యలు..**

**విశాఖలో పర్యటించి, అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**విశాఖపట్నం, జూలై 14 ప్రభాత వార్త:** రాష్ట్రంలో వన్యప్రాణులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అవసరమైతే చట్టాల్లో సంస్కరణలు చేపట్టేలా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్న ప్రస్తుత పరిస్థితుల్లో వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ "ఇది అత్యంత ప్రాధాన్యత కలిగిన శాసనసభ కమిటీ. కమిటీ సూచనలతో పాటు అధికారులు, నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో వన్యప్రాణులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు బలోపేతమైన విధానాన్ని రూపొందిస్తాం" అని తెలిపారు. సమగ్ర కార్యాచరణతో పాటు అవసరమైతే చట్టాల్లో మార్పులు, సంస్కరణలు చేపట్టాలని, మేధోపరమైన చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం, ఇందిరాగాంధీ జాతీయ జంతు ప్రదర్శనశాల, ఎనిమల్ రెస్క్యూ సెంటర్లను ప్రత్యక్షంగా సందర్శించి అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమావేశంలో గుర్తు చేశారు. జంతు సంరక్షణ, మౌలిక వసతులు, సిబ్బంది అవసరాలు, సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. 23 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తాను అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కంబాలకొండను వైల్డ్‌లైఫ్ శాంక్చువరీగా ప్రకటించడం వల్ల ఆక్రమణలను అరికట్టగలిగామని గుర్తు చేశారు...ఏడాదికి రూ.10 కోట్లు అవసరం.. ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.3 కోట్లు తెచ్చే బాధ్యత తీసుకుంటానువిశాఖ జూను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంవత్సరానికి కనీసం రూ.10 కోట్ల నిధులు అవసరమని స్పీకర్ అయ్యన్న తెలిపారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని పెంచేందుకు స్థానిక అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని, వినోద కార్యక్రమాలు, ఆదాయార్జనకు దోహదపడే కొత్త కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్ర ఎంపీల ల్యాడ్స్ ద్వారా ఏటా రూ.3 కోట్ల నిధులు సమీకరించే బాధ్యతను తానే తీసుకుంటానని ప్రకటించారు. రోజుకు నాలుగు నుంచి ఐదు వేల మంది సందర్శకులు జూను సందర్శిస్తున్నప్పటికీ కేవలం పది మరుగుదొడ్లు మాత్రమే ఉండటం సరిపోదన్నారు. సందర్శకుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు పెంచాలని, అత్యాధునిక క్యాంటీన్, విశ్రాంతి కేంద్రాలు, ఇతర సౌకర్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. జూలో 81 శాంక్షన్ పోస్టులు ఉండగా 59 పోస్టులు ఖాళీగా ఉండటం, మిగతా వారిని ఔట్ సోర్సింగ్ విధానంలో కొనసాగించటం ఆందోళనకరమని స్పీకర్ అన్నారు. 1,404 జంతువుల సంరక్షణకు కేవలం ఒక పశువైద్యుడు, ఒక సహాయకుడు మాత్రమే ఉండటం సరైన పరిస్థితి కాదన్నారు. దీనిపై కమిటీ తరపున తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. జిల్లాలోని పరిశ్రమలు తమ సీఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధికి వినియోగించాలని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జూ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు సమీకరించాలని సూచించారు. బ్యాంకులు కూడా సామాజిక బాధ్యతతో సహకరించాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం వంటి సంస్థల నుంచి కూడా జంతు సంరక్షణకు నిధులు సమీకరించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. కమిటీ సభ్యుడు నరేంద్ర వర్మ మాట్లాడుతూ విశాఖ, తిరుపతి జూ పార్కులను దేశంలోనే ఆదర్శ జూలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. నిపుణులైన పశువైద్యులను నియమించడం, సీఎస్ఆర్ ద్వారా ప్రతి ఏడాది రూ.10 కోట్ల వరకు నిధులు సమీకరించడం, 2047 విజన్‌కు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గొండు శంకరరావు మాట్లాడుతూ కంబాలకొండ అభయారణ్యాన్ని జూ పార్కుతో అనుసంధానించేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. విశాఖకు వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా జూ పార్కును సందర్శించేలా పర్యాటక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో సింగపూర్ మోడల్ జూ నమూనాపై అధ్యయనం కొనసాగుతోందని, ఆగస్టు చివరి వారంలో నివేదిక సిద్ధమవుతుందని తెలిపారు. పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. సీఎస్ఆర్ ద్వారా రూ.3 కోట్లు సమీకరిస్తాం: జిల్లా కలెక్టర్జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ విశాఖ జూ పార్కు, కంబాలకొండ, బే సిటీ అభివృద్ధి కార్యక్రమాలు విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. జిల్లా తరఫున సీఎస్ఆర్ ద్వారా రూ.3 కోట్ల నిధులు సమీకరించి జూ అభివృద్ధికి వినియోగిస్తామని వెల్లడించారు. ప్రైవేట్ ఈక్విటీ, ఏజెన్సీ మోడల్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఖాళీల భర్తీ అంశాన్ని జాబ్ క్యాలెండర్‌లో చేర్చేందుకు కమిటీ సిఫారసు అవసరమని పేర్కొన్నారు. చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కాశీ విశ్వనాథ రాజు మాట్లాడుతూ వీఎంఆర్డీఏ పరిధిలో చేపడుతున్న రోడ్లకు అనుమతులు రావడం శుభపరిణామమన్నారు. జూ అభివృద్ధికి ఐలాండ్ మోడల్, పీపీపీ మోడల్ వంటి వినూత్న విధానాలను పరిశీలిస్తామని తెలిపారు. కలెక్టరేట్లో అధికారులతో జరిగిన సమావేశం అనంతరం కమిటీ ఛైర్మన్, సభ్యులు వీసీ హాలులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వన్యప్రాణి సంరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు కమిటీ కట్టుబడి ఉందని, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ అసెంబ్లీ కార్యదర్శి ప్రసన్న కుమార్ సూర్యదేవర, జిల్లా కలెక్టర్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కాశీ విశ్వనాథ రాజు, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జిల్లా అటవీశాఖ అధికారి రవీందర్ దామా, జూ క్యురేటర్ డాక్టర్ మంగమ్మ, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్యశాఖ నూతన కార్యదర్శిని కలిసిన సిఇఒ ఆవుల చంద్రశేఖర్

**లండన్ అవార్డు పొందిన సిఈఓకు ప్రశంసలు**

**విజయవాడ, జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ నూతన కార్యదర్శి వీరపాండియన్ ను ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ), రాష్ట్ర అటవీశాఖ సీనియర్ అధికారి ఆవుల చంద్రశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఏపీఎంఏపీ బోర్డు సిఈఓ ఆవుల చంద్రశేఖర్ ను "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" సంస్థ లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్ లో ఇటీవల అంతర్జాతీయ అవార్డుతో సత్కరించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. సీఈవో కృషిని ఈ సందర్భంగా నూతన కార్యదర్శి ప్రత్యేకంగా అభినందించారు. "ది ఇండియన్ ఆయుర్వేద సైన్స్ అండ్ అగ్రి టెక్నాలజీ" అనే శీర్షికతో, 44 వ్యాధులకు సంబంధించిన 729 ఔషధ మొక్కలు, నివారణలతో కూడిన 50 పుస్తకాలను పూర్తి చేయడం ఒక ముఖ్యమైన రికార్డుగా ప్రశంసించారు. ఈ 50 పుస్తకాలన్నీ సహజ నివారణలు, వ్యవసాయ సాంకేతికత, మార్కెటింగ్, వర్గీకరణ, విలువ జోడింపు మొదలైనవాటిని శాస్త్రీయ పద్ధతిలో వివరిస్తాయని పేర్కొన్నారు. కాగా, ఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్, ఎండీగా అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు వీరపాండ్యన్ కు అప్పగిస్తూ ప్రభుత్వ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎంఏపీ బోర్డు సిఈఓ ఆవుల చంద్రశేఖర్ ముఖ్యంగా, కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, హెపటాలజీ, ఫల్మనాలజీ, గైనకాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ, ఆంకాలజీ, బేరియాట్రిక్స్, ఓపియాలజీ, ఆర్కనాలజీ, రుమటాలజీ, మలేరియాలజీ, డయేరియా, హెమటాలజీ, ఎక్స్ క్రిటరీ సిస్టమ్, గ్యాస్ట్రో ఇంటెన్సనల్ సిస్టమ్, ఆప్తమాలజీ, ట్రికాలజీ, యూరాలజీ, ఓష్టియోలజీ, అడంటాలజీ, వంటి ప్రత్యేక వైద్య విభాగాల మీద అధ్యయనం సాగించారు. పలు రకాల వ్యాధులకు భారతీయ ఆయుర్వేద శాస్త్రంలోని విధానాలను వివరించారు. సంబంధిత ఔషధ మొక్కలను గుర్తించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సర్టిఫికేట్, అంతర్జాతీయ అవార్డు ఈ ఏడాది జనవరి 26 న ధ్రువీకరించింది. "ది ఇండియన్ ఆయుర్వేద సైన్స్ అండ్ అగ్రి టెక్నాలజీ" గ్రంథాలను 15 సెప్టెంబర్, 2025 నుండి 16 డిసెంబర్, 2025 వరకు కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలో 468 ఔషధ మొక్కలతో కూడిన 33 పుస్తకాలను పూర్తి చేసినందుకు అవుల చంద్రశేఖర్‌కు ఈ పురస్కారం లభించింది.

# మద్యం రవాణా టెండర్ల కేసులో సిట్ పిటి వారెంట్లకు ఎసిబి కోర్టు అనుమతి

**విజయవాడ,జూలై 14,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో సిట్ పీటీ వారెంట్లకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

ఈనెల 20న ఏసీబీ కోర్టులో హాజరుపరచాలని ఏసీబీ కోర్టు ఆదేశించింది. ఏ1 వాసుదేవరెడ్డి, ఏ4 రాజ్ కెసిరెడ్డి, ఏ8 కారుమూరి సునీల్‌పై పీటీ వారెంట్లకు అనుమతిచ్చింది.

మద్యం రవాణా టెండర్ల కేసులో ఈడీ కేసులో వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్ అరెస్టయ్యారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్ ఉన్నారు.

# మత్స్యకారుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

**బాధిత కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి: వైఎస్ జగన్ డిమాండ్**

**ప్రభుత్వం స్పందించకపోతే అధికారంలోకి వచ్చిన నెలలోనే మేమే ఇస్తాం**

**వైఎస్సార్‌సీపీ తరపున ఒక్కో కుటుంబానికి రూ.7 లక్షల సాయం ప్రకటన**



**విశాఖపట్నం, జూలై 14, ప్రభాతవార్త :** సముద్రంలో పడవ బోల్తా పడి ఆరుగురు మత్స్యకారులు మృతి చెందిన ఘటనలో ప్రభుత్వ నిరక్ష్యమే వారి ప్రాణాలు తీసిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన చిన్నాకు కూడా అదే స్థాయిలో ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం విశాఖలో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కలెక్టర్, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా సమయానికి సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. విశాఖ తీరానికి కేవలం 10 మైళ్ల దూరంలోనే ప్రమాదం జరిగినా స్పందించకపోవడం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ వాస్తవాలను దాచిపెట్టి తప్పుడు నివేదిక ఇచ్చిందని జగన్ ఆరోపించారు. జరిగిన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చేందుకే కమిటీని ఉపయోగించుకున్నారని విమర్శించారు. మత్స్యకారుల కుటుంబాలను ఇప్పటివరకు ఒక్క మంత్రి కూడా పరామర్శించలేదని, ముఖ్యమంత్రి సహా సంబంధిత మంత్రులు కనీస మానవత్వం కూడా చూపలేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల పరిహారం ఏమాత్రం సరిపోదని, ఈ ఘటనలో ప్రభుత్వ బాధ్యత ఉన్నందున రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సముద్రంలో మునిగిపోయిన పడవకు కూడా పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఈ డిమాండ్లను అమలు చేయకపోతే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే బాధిత కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాకు కూడా అదే స్థాయిలో సాయం చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు మాట్లాడుతూ, పార్టీ తరఫున మృతి చెందిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన చిన్నాకు కూడా రూ.7 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు.

# 27 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం

**విజయవాడ. జూలై14,ప్రభాతవార్తప్రతినిది:** విజయవాడ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపాయి. పోలీసుల తనిఖీల్లో 27 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడ్డాయి. బెంగళూరు నుంచి వీటిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ప్రసాదంపాడుకు చెందిన శ్రవణ్ అనే యువకుడిని గవర్నర్‌పేట పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ కేసులో పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# సాయికృష్ణ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ఉపసంహరణ

**విజయవాడ.జూలై 14.ప్రభాతవార్తప్రతినిధి:** సాయికృష్ణ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ఉపసంహరించుకున్నారు. అనుబంధ పిటిషన్ ఉపసంహరించుకుంటామని హైకోర్టులో సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి వ్యాజ్యం దాఖలు చేశారు. కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ గతంలో విజయలక్ష్మి పిటిషన్ వేశారు. పిటిషన్‌పై రేపు హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ భట్టు రమేష్ నియామకం

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** తెలుగు అకాడమీ డైరక్టర్‌గా ప్రొఫెసర్ భట్టు రమేష్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం జారీ చేశారు. సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖకు చెందిన ప్రొఫెసర్ భట్టు రమేష్‌ని తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ఒక సంవత్సరం కాలానికి, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

# 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు**

**95 వేల నుంచి భారీగా పెరిగిన పంపిణీ లక్ష్యం**

**నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు**

**విజయవాడ.జూలై14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్న 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వారిలో 2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని వెల్లడించారు. జూలై 15 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 18ఏళ్ల విద్యార్థులందరినీ పరీక్షించనున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా దీన్ని అమలు చేస్తాయన్నారు. కళ్లద్దాలు పంపిణీకి సుమారు రూ. 7 కోట్ల వరకు వ్యయమవుతుందని తెలి పారు. పథకం అమలు సంతృప్తికరంగా ఉన్నందున గతేడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 95 వేల ఉచిత కళ్లద్దాల పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దాన్ని 2.50 లక్షలకు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, ఆమోదం కోసం కృషి చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో కంటి అద్దాల పంపిణీ సంతృప్తికరంగా ఉండడంతో కేంద్ర ఆమోదం తెలిపిందని చెప్పారు. పాఠశాల స్థాయిలో నిర్వ హించే పరీక్షల్లో దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తామన్నారు. తదుపరి వైద్యం అవసరమైన వారిని ప్రభుత్వ నేత్ర వైద్యశాలలు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వం గుర్తించిన స్వచ్ఛంద సంస్థల ఆసుపత్రులకు పంపించి చికిత్స చేయిస్తామని తెలిపారు. చిన్న వయస్సులోనే కంటిచూపు సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే విద్యార్థుల చదువు, ఏకాగ్రత, మానసిక వికాసం మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. దృష్టిలోపం కారణంగా విద్యార్థులు చదువులో వెనుకబడకుండా చూడడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. కంటి పరీక్షలు ప్రతి విద్యార్థికి జరిగేలా జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచే యాలని సూచించారు. ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి సహ కరించాలని కోరారు. నివారించగల అంధత్వాన్ని అరికట్టి, ప్రతి విద్యార్థికీ మెరుగైన కంటిచూపు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి ఆషాఢం సారె

**ఇఓ వికె శీనా నాయక్ క్షేత్రస్థాయి పరిశీలన**



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జులై 14, ప్రభాతవార్త :** ఈనెల 15 నుండి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ సారె సమర్పణ ఉత్సవాలకు సకల ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన దుర్గమ్మవారి ఘాట్‌రోడ్డు ఎంట్రన్స్ వద్ద నుండి హెడ్ వాటర్‌వర్క్స్ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మవారి ఆలయానికి వస్తున్న ట్రాఫిక్ పెరిగిపోయినందున హెడ్‌వాటర్ వర్క్స్ వరకు భక్తులకు వినియోగించేలా దేవదాయ శాఖ కమీషనర్, జిల్లా కలెక్టర్‌ల ను కోరతామన్నారు. భక్తులకు సంబంధించి ఈ ఉత్సవాల్లో ఏర్పాట్లు గురించి మాట్లాడుతూ శ్రీ కనకదుర్గ నగర్‌లోనే క్లోక్ రూమ్, ఉచిత పాదరక్షల స్టాండ్ (చెప్పుల స్టాండ్), మరియు మొబైల్ ఫోన్లు భద్రపరుచుకునే పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సారె సమర్పించే భక్తుల బృందాలు మొదట శ్రీ కనకదుర్గ నగర్ లో తమ పేర్లను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, నమోదు ఫారం (స్లిప్) తీసుకున్న అనంతరం క్యూ మార్గం ద్వారా మహామండపం ర్యాంప్ మీదుగా 7వ అంతస్తు లోకి ప్రవేశించి అక్కడి నుండి భక్తులను శ్రీ భవాని అనుగ్రహ దర్శన్ (రూ. 100/) క్యూ లైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామన్నారు. దర్శనానంతరం భక్తులు మహామండపం 6వ అంతస్తు లో తాము తెచ్చిన సారెను సమర్పించి, అక్కడ ఆ రిజిస్ట్రేషన్ స్లిప్ చూపించి ఆలయ మర్యాదలతో ఆశీర్వచనం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 2వ అంతస్తు లో అన్నప్రసాదం స్వీకరించి క్రిందికి వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో ఏసిపి దుర్గారావు, వన్‌టౌన్ సిఐ కె గుణరామ్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**శ్రీ అమ్మవారికి ఆలయ అర్చక బృందం మొదటి సారె:** 15 వ తేది ఉదయం 7.30 లకు మహ మండపం వైపు నుండి ఆలయ అర్చక బృందం విచ్చేసి శ్రీ అమ్మవారికి మొదటి సారె సమర్పిస్తామని స్థానాచార్య వి.శివ ప్రసాద్ శర్మ తెలిపారు.

**దుర్గమ్మవారికి బంగారు నెక్లెస్ :** దుర్గమ్మవారికి గుంటూరుజిల్లా తుళ్లూరు మండలం కు చెందిన సిహెచ్ వంశీకృష్ణ రు.3లక్షల విలువైన 20 గ్రాముల బంగారె నెక్లెస్‌ను మంగళవారం కానుకగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన ఎరమిల్లి నాగప్రసాద్, సర్వాన్ కుటుంబీకులు రు.100,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# రాయలసీమకు పెద్దఎత్తున పరిశ్రమల రాక

**కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ**

**నేడు ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్**

**విజయవాడ.జూలై14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా ప్రభుత్వ పాలనలో రాయలసీమకు పెద్దఎత్తున పరిశ్రమలు తరలివస్తున్నాయి. పరిశ్రమల రాకతో ముఖ్యంగా రాయలసీమలోని కడప జిల్లా రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. ఇప్పటికే సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్ లు క్యూ కట్టాయి. ఈ ఏడాది మే 22న జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలంలో సేల్ సౌరవిద్యుత్ ప్రాజెక్టును విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. రెండు నెలల వ్యవధిలోనే కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు బుధవారం విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.

# పోలవరానికి పర్యాటక శోభ

**అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**విజయవాడ, జూలై 14, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ జీవనాడి, బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరానికి పర్యాటక శోభను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. పోలవరం డ్యామ్‌తో పాటు... గోదావరి నదీ తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంతో పాటు....ప్రాజెక్టు దిగువన, ఎగువన టూరిజం డవల్మెంట్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ అంశంపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులుతో పాటు ఏజెన్సీలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. నదీతీరం వెంట టూరిజం ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు వద్ద కేబుల్ బ్రిడ్జ్ డిజైన్, స్పిల్ వే బ్యూటిఫికేషన్ సహా మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిలో అనుభవం ఉన్న నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు ఎగువున భద్రాచలం సమీపం వరకు ఏపీ భూభాగంలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో మంచి పర్యాటక ప్రాంతంగా పోలవరం మారుతుందని సీఎం అన్నారు. ఎకో టూరిజం, రాక్ క్లైంబింగ్, వెల్‌నెస్ సెంటర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వాటికి అనుకూలంగా మార్చాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరాన్ని ప్రత్యేకంగా నిలపేలా చేయాలన్నారు. ఇంజనీరింగ్ టూరిజం, రివర్ ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం డెవల్మెంట్‌కు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమన్న ఏజెన్సీ..వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని వివరించింది. స్పిల్ వే దిగువున నది మధ్యలో 500 ఎకరాల ఐ లాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసే విషయంలో పలు డిజైన్లు ప్రతిపాదనలను అందించారు. అలాగే మధ్యలో ఉండే వాటర్ బాడీలు, కొండలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. స్పిల్ వే దిగువన కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐలాండ్‌గా ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మొత్తం 1,500 ఎకరాల్లో తీసుకురాదగిన ప్రాజెక్టులపై నిప్పాన్ కోయి సంస్థ ప్రజెంటేషన్‌లో పలు ప్రతిపాదనలు చేసింది. ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు...పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, స్థానికంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం అన్నారు. ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఆమేరకు ప్రణాళికలు సిద్దంచేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రి కందుల దుర్గేష్, అధికారులు పాల్గొన్నారు.

# స్కూళ్లలో సెక్స్ ఎడ్యుకేషన్: నిర్ణయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 14:** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో లైంగిక విద్యను ప్రవేశ పెట్టాలని నిర్ణయించినట్టు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. 26 మంది సభ్యులతో కూడిన జాతీయ నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు రూపొందించిన ఈ కార్యక్రమం సుప్రీంకోర్టు ఆమోదం పొందిన తరువాత అమలవుతుంది. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ చట్టం పరిధిలోకి వచ్చే మైనర్లకు సంబంధించిన కేసుల పట్ల పెరుగుతున్న ఆందోళనలను పరిష్కరించడంతో పాటు విద్యార్థుల వయసుకు తగిన అవగాహన, పిల్లల భద్రత, ఆరోగ్యకరమైన వికాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యం. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవ్‌లతో కూడిన ధర్మాసనం ముందు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ వివరాలను వెల్లడించారు. 26 మంది సభ్యుల జాతీయ నిపుణుల కమిటీ సూచించిన సిఫారసులను కేంద్రం ఆమోదించినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదిక ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే వయసుకు తగిన పాఠ్యాంశాలతో 'సమగ్ర లైంగిక విద్య ప్రారంభమవుతుంది. కనీసం వారానికి రెండుసార్లు 15 నుంచి 20 నిమిషాలు తప్పనిసరి తరగతులను నిర్వహించేందుకు ప్రతి పాఠశాల ఒక ప్రత్యేక నిపుణులైన ఉపాధ్యాయుడిని నియమించాలని ఆ కమిటీ సిఫారసు చేసింది.

ప్రతిపాదిత పాఠ్యప్రణాళిక శరీర భద్రత, పరిశుభ్రత, శరీర భాగాలను అర్థం చేసుకోవడం, సురక్షితమైన, అసురక్షితమైన స్పర్శను గుర్తించడం వంటి ముఖ్యమైన అంశాలపై దృష్టి సారిస్తుంది. విద్యార్థులు పెద్దవారయ్యే కొద్దీ పాఠాలు క్రమంగా కౌమార ఆరోగ్యం, సంబంధాలు, జీవిత నైపు ణ్యాల అంశాలను బోధిస్తారు.

15-07pg10_15-07pg10.qxd 14/Jul/26 11:53 PM Page 1





# సెమీస్‌లో సూపర్ క్లాష్

## అర్జెంటీనా, ఇంగ్లాండ్ అమీతుమీ * నేటి అర్ధరాత్రి 12.30 గంటలకు

**అట్లాంటా, జులై 14:** ఫుట్‌బాల్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్ సెమీఫైనల్లో అర్జెంటీనా-ఇంగ్లండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి తర్వాత మ్యాచ్ ప్రారంభమవుతుంది. చరిత్ర, ప్రతిష్ఠ, భావోద్వేగాలు, స్టార్ ఆటగాళ్ల పోరు... ఇలా అన్నీ కలిసిన ఈ మ్యాచ్‌ను టోర్నీలోనే అత్యంత ఉత్కంఠభరిత సమరంగా మారింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరి వరుసగా టైటిల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ప్రపంచకప్ గెలవాలన్న కలతో ఇంగ్లండ్ బరిలోకి దిగుతోంది. ప్రపంచ ఫుట్ బాల్ చరిత్రలో అత్యంత ఉద్విగ్నమైన ప్రత్యర్థులుగా పేరొందిన ఈ రెండు జట్లు మరోసారి ప్రపంచకప్ వేదికపై తలపడుతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజేత నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా, ఓడిన జట్టు మూడో స్థానం కోసం పోరాడాల్సి ఉంటుంది.

**మెస్సీపైనే అర్జెంటీనా ఆశలు**

అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరోసారి జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తున్నాడు. టోర్నీ మొత్తం అతని అనుభవం, నాయకత్వం, కీలక సమయాల్లో గోల్స్ సృష్టించే సామర్థ్యం అర్జెంటీనాను సెమీస్ వరకు తీసుకొచ్చాయి. పాసింగ్, దాడుల్లో వేగం, రక్షణలో క్రమశిక్షణ జట్టుకు ప్రధాన బలాలు. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై సాధించిన విజయంతో అర్జెంటీనా పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ప్రత్యర్థి బలమైన ఇంగ్లండ్ అయినప్పటికీ, పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడిని జయించే అనుభవం తమకు కలిసివస్తుందని అర్జెంటీనా భావిస్తోంది. కోచ్ లియోనెల్ స్కలోనీ వ్యూహాలు కూడా జట్టుకు బలంగా మారాయి.

**బెల్లింగ్‌హామ్, కేన్‌లపై ధీమా**

ఇంగ్లండ్ జట్టు యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల సమన్వయంతో బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ హ్యారీ కేన్ గోల్స్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుండగా, జూడ్ బెల్లింగ్‌హామ్ మిడ్ ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నాడు. వేగవంతమైన కౌంటర్ అటాక్స్, సెట్‌పీస్‌లలో ఇంగ్లండ్ ప్రమాదకరంగా మారుతోంది. క్వార్టర్ ఫైనల్లో నార్వేపై సాధించిన విజయం జట్టులో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. కోచ్ రూపొందించిన వ్యూహాలను ఆటగాళ్లు సమర్థంగా అమలు చేస్తుండటంతో టైటిల్‌పై ఆశలు పెరిగాయి. ఇంగ్లండ్ జట్టు యువ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుత ఫామ్‌లో ఉండగా, కెప్టెన్ హ్యారీ కేన్ అనుభవం జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తోంది.

**హ్యాండ్ ఆఫ్ గాడ్**

అర్జెంటీనా-ఇంగ్లండ్ పోరుకు దశాబ్దాల చరిత్ర ఉంది. 1966 ప్రపంచకప్ వివాదాల నుంచి 1986లో మారడోనా చేసిన "హ్యాండ్ ఆఫ్ గాడ్" గోల్, అదే మ్యాచ్‌లో చేసిన అద్భుత సోలో గోల్, ఆ తర్వాతి ప్రపంచకప్ పోటీలు ఈ ప్రత్యర్థిత్వాన్ని మరింతగా పెంచాయి. ఈ సెమీఫైనల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అర్జెంటీనా బంతిని ఎక్కువ సేపు తమ ఆధీనంలో ఉంచి అవకాశాలను సృష్టించడంలో నైపుణ్యం కలిగి ఉంది. మరో వైపు ఇంగ్లండ్ వేగవంతమైన దాడులు, ఎత్తైన క్రాస్‌లు, శారీరక దృఢత్వంతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టగలదు. మిడ్ ఫీల్డ్‌లో ఆధిపత్యం సాధించే జట్టే మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

అర్జెంటీనాకు అనుభవం, మెస్సీ నాయకత్వం ప్రధాన బలం కాగా, ఇంగ్లండ్‌కు యువ శక్తి, వేగవంతమైన ఆట, సమిష్టి ప్రదర్శన బలంగా ఉన్నాయి. చిన్న పొరపాటు కూడా మ్యాచ్ గమనాన్ని మార్చే అవకాశం ఉండటంతో అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మెస్సీ-బెల్లింగ్‌హామ్, మెస్సీ-కేన్ వంటి స్టార్ ఆటగాళ్ల మధ్య పోటీ ఈ మ్యాచ్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. యంగ్ గన్స్ తమ ఛాన్స్ కోసం చూస్తున్నారు.

**హెడ్ టు హెడ్**

| అంశం | అర్జెంటీనా | ఇంగ్లండ్ |
|---|---|---|
| ప్రపంచకప్ | 3 | 1 |
| బలం | బంతిపై ఆధిపత్యం | కౌంటర్స్ |
| స్టార్స్ | మెస్సీ | హ్యారీ కేన్ |
| యంగ్‌గన్స్ | ఎంజో | బెల్లింగ్‌హామ్ |

### శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్

# తొలి వన్డేలో గ్రాండ్ విక్టరీ

**బర్మింగ్హామ్, జులై 14:** ఇంగ్లాండ్ గడ్డపై అయిదు టీ20ల సిరీస్‌లో బోల్తా కొట్టిన టీమిండియా... వన్డేలకు వచ్చేసరికి అదరగొట్టింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన తొలి వన్డేలో గ్రాండ్‌విక్టరీ అందుకుంది. ఇంగ్లాండ్‌పై ఆరు వికెట్ల తేడాతో నెగ్గి మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసింది. ఇంగ్లాండ్ విధించిన 259 రన్స్ లక్ష్యాన్ని టీమిండియా మరో 4.4ఓవర్లు మిగిలివుండగానే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది.

**శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్**

ప్రారంభ ఓవర్ నుంచే శుభ్‌మన్(75 బంతుల్లో 80 రిటైర్డ్‌హర్ట్; 11 ఫోర్లు, ఓ సిక్స్) బ్యాట్‌కు పని పెట్టాడు. రోహిత్ శర్మకు ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. తొలి వికెట్‌కు 43రన్స్ అందించాడు. ఈ దశలో రోహిత్ శర్మ(11), విరాట్ కోహ్లి(5) అయిదు పరుగుల తేడాతో అవుటవడంతో భారత్ కష్టాల్లో పడింది. క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్(53 బంతుల్లో 35) అండగా శుభ్‌మన్ స్కోరును ముందుకు నడిపాడు. ముఖ్యంగా గిల్ ఇంగ్లాండ్ బౌలర్లపై బౌండరీలతో 51బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. భారత్ స్కోరును 19.4 ఓవర్లలో వందకు చేర్చాడు. అలాగే మూడో వికెట్‌కు 101 బంతుల్లో సెంచరీ భాగస్వామ్యాన్ని నిర్మించాడు. 25.4 ఓవర్లకు భారత్ 149 పరుగులకు చేరింది. ఈ దశలో గిల్‌కు తొడకండరాలు పట్టేయడంతో ఇబ్బందిపడ్డాడు. రిటైర్డ్‌హర్ట్‌గా మైదానం వీడాడు.

**అక్షర్, వాషింగ్టన్ ఆల్‌రౌండ్ షో**

149 పరుగుల వద్ద గిల్ రిటైర్డ్‌హర్ట్ కాగా... 11 పరుగుల తేడాతో శ్రేయాస్(35), రాహుల్(1) వెనుదిరిగాడు. ఈ సారి భారత్ ఇన్నింగ్స్‌ను ఆలౌరౌండర్లు అక్షర్ పటేల్(52 బంతుల్లో 57), వాషింగ్టన్ సుందర్(63 బంతుల్లో 52) ఆదుకున్నారు. అజేయ అర్ధసెంచరీలతో కదం తొక్కారు. 5వ వికెట్‌కు అజేయంగా 102రన్స్ జోడించడంతో 45.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

**బౌలర్ల విజృంభణ**

అంతకుముందు టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు బెతెల్(14), డకెట్(45 బంతుల్లో 43) దూకుడుగా ఆడుతూ తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్లో ఓపెనర్లిద్దరినీ అవుట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఇక బుమ్రా రెండో స్పెల్ తొలి బంతికే కెప్టెన్ హ్యారీ బ్రూక్(1)ను అవుట్ చేశాడు. మరోవైపు ప్రసిద్ధ్ కృష్ణ కూడా చెలరేగి బట్లర్(5), కుర్రాన్‌ను ఒకే ఓవర్లో అవుట్ చేశాడు. భారత బౌలర్ల దెబ్బకు 22 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఆరు వికెట్లను చేజార్చుకుంది. అయితే, లియామ్ డాసున్(68), జో రూట్(76 నాటౌట్) ఏడో వికెట్‌కు 121 పరుగులు జోడించి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. ఆఖర్లో మళ్లీ పుంజుకున్న భారత బౌలర్లు స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేశారు. స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీసి లోయర్ ఆర్డర్ పనిపట్టాడు.



## జపాన్ ఓపెన్ రెండో రౌండ్‌లో పివి సింధు

**టోక్యో, జులై 14:** జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఏస్ షట్లర్ పీవీ సింధూ శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 21-14, 21-11తో మలేషియాకు చెందిన వోంగ్ లింగ్ చింగ్‌ను రెండు గేముల్లోనే చిత్తు చేసింది. అలవోక విజయంతో రెండో రౌండ్‌కు చేరింది. మ్యాచ్‌ఆరంభం నుంచి సింధూ ఆధిపత్యం ప్రదర్శించింది. ఆద్యంతం దూకుడును ప్రదర్శించిన సింధూ... బ్యాక్‌హాండ్, నెట్ డ్రిబిల్స్, డెఫ్ట్ డ్రాప్స్, హాఫ్ స్మాషస్ షాట్లతో చెలరేగి రెండు గేముల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో ధ్రువ్ కపిలాతనీషా క్రాస్టో జోడీ 21-16, 21-14తో స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డున్ జూలీ మాక్‌ఫెర్సన్ జోడీని ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మరో రోహన్ కపూర్, రుత్వికా శివాని తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్-చిరాగ్ జోడీ గాయంతో టోర్నీ నుంచి వైదొలిగారు.




## 150 వికెట్ల క్లబ్‌లో బుమ్రా

**బర్మింగ్హామ్, జులై 14:** భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అద్భుత అరుదైన ఘనత అందుకున్నాడు. ఇంగ్లాండ్‌తో తొలివన్డేలో కెప్టెన్ హ్యారీ బ్రూక్ వికెట్ తీసి... వన్డేల్లో 150 వికెట్లు పూర్తి చేశాడు. కేవలం 90వ వన్డేలోనే ఈ మైలురాయి అందుకున్నాడు. భారత్ తరపున అత్యంత వేగంగా ఈఘనత సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు. మహ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్ అతనికంటే ముందున్నారు. అలాగే ఇంగ్లాండ్ గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ బుమ్రా మరో రికార్డు సాధించాడు. ఇంగ్లాండ్ గడ్డపై బుమ్రా ఇప్పటి వరకు 31 వికెట్లు తీశాడు. దీంతో జడేజా (30), భువనేశ్వర్(28), మదన్ లాల్ (27)ను బుమ్రా వెనక్కి నెట్టాడు. మూడు ఫార్మాట్లలోనూ 100 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్‌గా ఇప్పటికే బుమ్రా ఘనత సాధించాడు. వన్డేల్లో 150, టెస్టుల్లో 234వికెట్లు, టీ20ల్లో 121 వికెట్లను బుమ్రా పడగొట్టాడు.

# పశ్చిమాసియా ఎఫెక్ట్..
# నష్టాల్లో స్టాక్ సూచీలు




**ముంబయి, జులై 14:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవడం, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, ముడిచమురు ధరలు భారీగా పెరగడం వంటి ప్రతికూల పరిణామాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కనిపించగా, ఫార్మా, మెటల్ రంగాల షేర్లు కొంత మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 561.46 పాయింట్లు పడిపోయి 77,054.94 వద్ద ముగియగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 158.95 పాయింట్లు కోల్పోయి 24,052.05 వద్ద స్థిరపడింది. వరుసగా మూడుట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1.38 శాతం, సెన్సెక్స్ 1.45 శాతం క్షీణించాయి. నిఫ్టీ సూచీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.34 శాతం, లార్సెన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) 2.11 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.09 శాతం నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కూడా అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.54 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.08 శాతం తగ్గాయి. బీఎస్ఈలో మొత్తం 1,501 షేర్లు లాభపడగా, 2,737షేర్లు నష్టపోయాయి. 203 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 3.49 డాలర్లు (4.19 శాతం) పెరిగి 86.79 డాలర్లకు చేరుకుంది.

విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.2600 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు95.6800గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు5, 2026గడువుగల బంగారం ఫ్యూచర్స్ ధర 0.54 శాతం పెరిగి 10 గ్రాములకురూ.1,41,060కు చేరుకుంది. బయోకాన్ షేరు6.34శాతం ఎగసి రూ.437కు చేరుకుంది. ల్యాండ్‌మార్క్ కార్స్ షేరు20శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు 4.63శాతం క్షీణించింది. కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాలను యథాతథంగా కొనసాగించడంతో పెట్టుబడిదారులు నిరాశ చెందారు. పీడీఎస్ షేరు 5.89శాతం లాభపడగా, ప్లాస్టిబ్లెండ్స్ ఇండియా1.39శాతం పెరిగింది. ఈఎంఎస్ షేరు 2.46 శాతం తగ్గింది. ఉత్తరప్రదేశ్ జల్ నిగమ్ (అర్బన్), వారణాసి నుంచి రూ. 105.82 కోట్ల విలువైన మురుగునీటి ప్రాజెక్టుకు అత్యల్ప ధరబిడ్డర్‌గా ఎంపికైనప్పటికీ షేరు ఒత్తిడిలోనే ముగిసింది. వెల్‌స్పన్ కార్ప్ 4.08 శాతం పెరిగింది. ఖైతాన్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 2.83 శాతం, కృష్ణ ఫాస్‌కెమ్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మంగళవారం సాయంత్రం 4:24 గంటల వరకు 12.45 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 8.16 కోట్ల షేర్లకు దరఖాస్తులు అందాయి. దీంతో ఈ ఇష్యూ 0.66 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జులై 14న ప్రారంభమై ఈనెల 16న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.545-574గా నిర్ణయించారు. ఆల్పైన్ టెక్స్‌వర్ల్డ్ ఐపీఓకు కూడా మంగళవారం సాయంత్రం 4:24 గంటల వరకు 1.20 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 32.52 లక్షల షేర్లకు మాత్రమే బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 0.27 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జులై 14న ప్రారంభమై ఈనెల 16న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.100-105గా నిర్ణయించారు.

## 62 పైసలు క్షీణించి 96.30కి చేరిక



**ముంబయి, జులై 14:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాల్చడంతో భారత రూపాయి మంగళవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే భారీగా బలహీనపడింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి 62 పైసలు క్షీణించి డాలర్‌కు రూ.96.30వద్ద ముగిసింది. ప్రారంభంలో రూపాయి రూ.95.95 వద్ద ట్రేడింగ్ ప్రారంభించినప్పటికీ, రోజు మొత్తం విక్రయ ఒత్తిడి కొనసాగడంతో చివరకు 62 పైసలు నష్టపోయి 96.30 వద్ద స్థిరపడింది. విదేశీ మారక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ముడి చమురు ధరలు పెరగడం, పెట్టుబడిదారులు భద్రమైన పెట్టుబడుల వైపు మొగ్గుచూపడంతో అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం రూపాయిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.16 శాతం తగ్గి 101.07 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌కు 86.42 డాలర్లకు చేరి 3.75 శాతం పెరిగింది.


### ఎన్ఆర్ఐ ప్రత్యేక డిపాజిట్ పథకానికి 10 బిలియన్ డాలర్లు

## రూపాయికి అండగా ఆర్‌బీఐ చర్యలు



**న్యూఢిల్లీ, జులై 14:** ఎన్ఆర్ఐలు కోసం రిజర్వు బ్యాంక్ ప్రవేశపెట్టిన ప్రత్యేక డిపాజిట్ పథకం ద్వారా ఇప్పటివరకు సుమారు 10 బిలియన్ డాలర్ల నిధులు భారత్‌కు వచ్చినట్లు వెల్లడి అయింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడంతో పాటు రూపాయి విలువకు మద్దతు ఇవ్వాలనే లక్ష్యంతో ఆర్‌బీఐ చేపట్టిన ఈచర్యకు మంచి స్పందన లభించింది. ద్రవ్య విధాన సమీక్షలో ఎన్ఆర్ఐల నుంచి బ్యాంకులు సమీకరించే విదేశీ కరెన్సీ డిపాజిట్ల కోసం జీరోకాస్ట్ ఫారెక్స్ స్వాప్ సౌకర్యాన్ని ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో బ్యాంకులు ఎన్ఆర్ఐలకు మరింత ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందించే అవకాశం లభించింది. తర్వాత గతనెల 23న ఆర్‌బీఐ ఈ డిపాజిట్లపై రుణాలు ఇవ్వడానికి, వాటిపై లియన్ నమోదు చేసేందుకు బ్యాంకులకు అనుమతి కల్పించింది. దీంతో లీవరేజ్ వినియోగానికి అవకాశం ఏర్పడి, ఈ పథకం మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ స్పష్టీకరణ అనంతరం గత వారం నుంచి నిధుల ప్రవాహం వేగం పెరిగిందని ఒక అధికారి తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు బ్యాంకులు ఈ డిపాజిట్లను సమీకరించే గడువు ఉండటంతో, ఎక్కువ మొత్తంలో నిధులు చివరి దశలో వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే, మీడియాతో మాట్లాడేందుకు అనుమతి లేకపోవడంతో సంబంధిత అధికారులు తమ పేర్లను వెల్లడించేందుకు నిరాకరించారు. ఈ అంశంపై స్పందించాలంటూ పంపిన ఈమెయిల్‌కు ఆర్‌బీఐ తక్షణ స్పందన ఇవ్వలేదు. 30-60 బిలియన్ డాలర్ల వరకు నిధులు వచ్చే అవకాశంప్రస్తుతం సమీకరించిన 10 బిలియన్ డాలర్లు, ఈ పథకం ద్వారా వచ్చే మొత్తం అంచనా నిధుల్లో చిన్న భాగమేనని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

## 100 బిలియన్ డాలర్లకు టాటా ఆటోమొబైల్స్ టార్గెట్



**న్యూఢిల్లీ, జులై 14:** టాటా గ్రూప్‌కు చెందిన ఆటోమొబైల్ వ్యాపారాన్ని వచ్చేఐదేళ్లలో 100 బిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు. దేశీయ వ్యాపార విస్తరణ కోసం రూ.40వేల కోట్ల మూలధనం ఖర్చుచేస్తామని, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కోసం సుమారు 20 బిలియన్ బ్రిటిష్ పౌండ్ల పెట్టుబడి ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 81వ ఏజీఎం లో వర్చువల్‌గా పాల్గొన్న చంద్రశేఖరన్, వాటాదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వివరాలు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలవిభాగంలో ప్రస్తుతం ఉన్న సుమారు 42 శాతం మార్కెట్ వాటాను కొనసాగిస్తూ, భవిష్యత్తులో 40-45 శాతం మార్కెట్ వాటాను నిలబెట్టుకోవడమే కంపెనీ లక్ష్యమని చెప్పారు. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడంపై టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. 2030 నాటికి వాహనాల విక్రయాలను పది రెట్లు పెంచడంతో పాటు దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో 20 శాతం వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్, టాటా మోటార్స్ లిమిటెడ్ రెండూ అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయి.




## 6.51 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

**న్యూఢిల్లీ, జులై 14:** దేశంలో ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలల్లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. జూలై 13, 2026 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 16.4 శాతం పెరిగి రూ.6.51 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ మేరకు ఆదాయపు పన్నుశాఖ సోషల్‌మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 13 నాటివరకు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు, రీఫండ్‌లు, నికర ప్రత్యక్ష పన్ను వసూళ్ల వివరాలను విడుదల చేసినట్లు తెలిపింది. వివరాల ప్రకారం, స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.6.66 లక్షల కోట్లతో పోలిస్తే 16.11 శాతం పెరిగి రూ.7.74 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రీఫండ్‌ల విలువ రూ.1.22 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 14.57శాతం అధికం. పన్ను చెల్లింపుదారుల రీఫండ్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరిస్తున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.51 లక్షల కోట్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ.5.59 లక్షల కోట్లుగా ఉంది. ఈ వృద్ధికి కార్పొరేట్ పన్ను, కార్పొరేట్‌తర పన్ను వసూళ్లు రెండూ బలంగా పెరగడం ప్రధాన కారణమని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ముఖ్యంగా వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు, సంస్థలు, వ్యక్తుల సంఘాలు, స్థానిక సంస్థలు, కృత్రిమ న్యాయ వ్యక్తులు చెల్లించే కార్పొరేట్‌తర పన్నులు ప్రత్యక్ష పన్ను ఆదాయంలో అత్యధిక వాటాను కొనసాగించాయి.

### భారత్‌లో టాప్100 బ్రాండ్ల విలువ

# 252.8 బిలియన్ డాలర్లు




**ముంబై, జులై 14:** భారత్‌లోని టాప్100 అత్యంత విలువైన బ్రాండ్ల మొత్తం బ్రాండ్ విలువ విలువ252.8బిలియన్ డాలర్లకు చేరిందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100-2026 నివేదిక వెల్లడించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 7 శాతం వృద్ధి సాధించినట్లు స్పష్టం అయింది. టాప్10 బ్రాండ్లలో తొమ్మిది బ్రాండ్లు తమ బ్రాండ్ విలువను పెంచుకోవడం భారతీయ కంపెనీల బలమైన స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపింది. కార్పొరేట్ సంస్థల్లో టాటా గ్రూప్ వరుసగా 10వ ఏడాది కూడా భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా నిలిచింది. టాటా బ్రాండ్ విలువ 7 శాతం పెరిగి 33.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇన్ఫోసిస్ 16.4బిలియన్ డాలర్ల బ్రాండ్‌విలువతో ఎలాంటి మార్పు లేకుండా నిలిచి, వరుసగా ఐదో ఏడాది దేశంలో రెండో అత్యంత విలువైన బ్రాండ్‌గా తన స్థానాన్ని కొనసాగించింది. ఎల్ఐసీ గ్రూప్ బ్రాండ్ విలువ 12శాతం పెరిగి 15.3బిలియన్ డాలర్లకు చేరింది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగాగ్రామీణ ప్రాంతాల్లో విస్తృత నెట్‌వర్క్, ప్రపంచంలోనే అతిపెద్ద ఏజెంట్ వ్యవస్థ ఉండటం ఎల్ఐసీకి బలంగా మారిందని తెలిపింది. ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ బ్రాండ్ విలువ 2 శాతం తగ్గి 13.9 బిలియన్ డాలర్లకు చేరినా, దేశంలోని ప్రముఖ ప్రైవేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ బ్రాండ్లలో ఒకటిగా తన స్థానాన్ని కొనసాగించింది. రిలయన్స్ గ్రూప్ బ్రాండ్ విలువ 11 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరింది.

రిటైల్, టెలికాం, డిజిటల్ సేవలు, ఇంధన రంగాల్లో విస్తరణతో పాటు వినియోగదారుల వ్యాపారాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, కంటెంట్, నూతన ఇంధన రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు రిలయన్స్‌వృద్ధికి ప్రధానకారణాలనిపేర్కొంది. ఎస్‌బీఐ గ్రూప్ బ్రాండ్ విలువ 2 శాతం పెరిగి 9.8బిలియన్ డాలర్లకు చేరింది. భారతబ్యాంకింగ్ వ్యవస్థలోకీలకసంస్థగా ఎస్‌బీఐ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందని నివేదిక తెలిపింది. హెచ్‌సీఎల్‌టెక్ బ్రాండ్ విలువ 9 బిలియన్ డాలర్ల వద్ద కొనసాగింది. విభిన్న రంగాల ఖాతాదారులు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులు, ఆధారిత సేవలకు పెరుగుతున్న డిమాండ్ కంపెనీ వృద్ధికి బలమని పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps